


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..

హైదరాబాద్ 22 శనివారం ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 158

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## భారత్‌కు సాయం నిలిపేసిన ట్రంప్

- భారత్‌తో స్నేహం..బంగ్లాదేశ్‌కు నిధులు
- ఇదీ అమెరికా అధ్యక్షుడు ట్రంఫ్ ధుర్నీతి
- ఓటర్స్ టర్నవుట్ ఇన్ ఇండియా ప్రాజెక్ట్‌కు మొన్నటివరకు 21 మిలియన్ డాలర్లు చెల్లించిన యుఎస్
- తాజాగా ఈ ప్రాజెక్టుకు నిధులు నిలిపేసిన ట్రంప్
- ప్రపంచంలోనే అత్యధిక పన్నులు విధించే భారత్
- భారత్‌కు ఎందుకు నిధులివ్వాలని ట్రంప్ ప్రశ్న

2



వాషింగ్టన్ డిసి-నవభూమిబ్యూరో
భారత్ సహా వివిధ దేశాలకు అమెరికా చేస్తోన్న ఆర్థిక సహకారాన్ని నిలిపివేయడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. ఫ్లోరిడాలోని మియామిలో ఏర్పాటైన ఎఫ్ఐఐ ప్రయారిటీ సదస్సులో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఎన్నికల వ్యవస్థ గురించీ ప్రస్తావించారు. ఓటర్స్ టర్నవుట్ ఇన్ ఇండియా ప్రాజెక్ట్‌కు.. ఓటర్స్ టర్నవుట్ ఇన్ ఇండియా ప్రాజెక్ట్‌కు మొన్నటివరకు 21 మిలియన్ డాలర్ల మొత్తాన్ని చెల్లిస్తూ వచ్చింది అమెరికా. డొనాల్డ్ ట్రంప్ తాజాగా దీన్ని నిలిపివేశారు. దీనికి సంబంధిం చిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పైనా సంతకం చేశారు. భారత్ సహా మొజాంబిక్ 10 మిలియన్ డాలర్లు, కంబోడియాలో రెండు ప్రాజెక్టుల కింద 12 మిలియన్ డాలర్లు, ప్రేగ్ సివిల్ సొసైటీ సెంటర్- 32, సెర్బియా- 486, మొల్డొవా- 22, భారత్- 21, బంగ్లాదేశ్- 19, లైబీరియా- 1.5, నేపాల్- 19, మాలీ- 14 మిలియన్ డాలర్ల మేర నిధుల కేటాయింపుల నూ రద్దు చేశారు. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు.. దీన్ని సమర్థించుకున్నారు డొనాల్డ్ ట్రంప్. ఓటర్ టర్నవుట్ ఇన్ ఇండియా ప్రాజెక్ట్‌కు తామెం దుకు డబ్బులు ఇవ్వాలంటూ ప్రశ్నించారు. భారత్‌ను అత్యధిక పన్నులు విధించే దేశంగా అభివర్ణించారు. ప్రపంచంలోనే అత్యధిక పన్నులను విధించే దేశాల్లో భారత్ ఒకటి

## భారత్ ఎన్నికల్లో అమెరికా నిధులు

- 2024 పార్లమెంట్ ఎన్నికల్లో భారత్‌కు అమెరికా సాయం
- యుఎస్ ఎయిడ్ సంస్థ ద్వారా ఓటర్లను పెంచేందుకు సాయం
- యుఎస్ ఎయిడ్ సంస్థ డైరెక్టర్‌గా ఉన్న వీణారెడ్డి
- ఎన్నికల ప్రక్రియ ప్రారంభంలో ఇండియాకు వీణారెడ్డి
- ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత యుఎస్‌కు వెళ్లిన వీణారెడ్డి
- వీణారెడ్డి పాత్రపై విచారణ జరపాలని బీజేపీ ఎంపీ ట్వీట్

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
భారత్ ఎన్నికల్లో అమెరికా నిధులు... వీణారెడ్డిపై విచారణ డిమాండ్! తాజాగా ఈ వ్యవహారానికి సంబంధించి వీణారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా.. ఈమె ఎవరు.. అమెరికా నుంచి భారత్‌లో జరిగే ఎన్నికలకు నిధుల సాయాన్ని అందించడంలో ఈమె పాత్ర ఎంత మొదలైన విషయాలపై ఇప్పుడు చర్చ మొదలైంది.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ లో జరిగిన ఎన్నికల్లో అగ్రరాజ్యం అమెరికా నిధుల పాత్ర ఇప్పుడు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఇటీవల ఆ నిధులను నిలిపివేస్తున్నట్లు 'డోజ్' సారథి ఎలాన్ మస్క్ చేసిన ఓ ప్రకటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో భారత్‌లో వీణా రెడ్డి పాత్రపై చర్చ మొదలైంది. అవును... భారత్ లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్లు (రూ.186 కోట్లు) సాయాన్ని రద్దు చేసినట్లు

## ఏపీకి వెళ్లండి..!

- తెలంగాణలోని ఐపీఎస్‌లకు కేంద్రం షాక్
- ముగ్గురు ఐపీఎస్ అధికారులకు కేంద్ర హోంశాఖ తాఖీదు
- అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతిలను రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించిన కేంద్రం

2




హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణలో కొనసాగుతున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులకు కేంద్ర హోంశాఖ షాకిచ్చింది. తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతిలను రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన ఈ ముగ్గురు అధికారులు వెంటనే ఏపీలో రిపోర్టు చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశించింది. అంతేగాక, 24 గంటల్లోనే ఏపీలో రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది. కాగా, రాష్ట్ర విభజన సందర్భంగా ఈ అధికారులను ఏపీకి కేటాయించారు. అయితే, ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన వారు తెలంగాణలోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం డీజీ ర్యాంకులో కొనసాగుతున్న అంజనీకుమార్.. రోడ్ సేఫ్టీ డీజీగా ఉన్నారు. డీజీ ర్యాంకులో ఉన్న మరో ఐపీఎస్ అధికారి అభిలాష బిస్త్.. పోలీస్ ట్రైనింగ్ డీజీగా ఉన్నారు. ఎస్పీ ర్యాంకులో

## జీహెచ్‌ఎంసీలో బీఆర్ఎస్ పార్టీకి మరో భారీ షాక్

- బీఆర్ఎస్‌కు కార్పోరేటర్లు షాక్
- 15 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి..
- బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వెల్లడి

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీకి మరో భారీ షాక్ తగలేలా కనిపిస్తోంది. ఇప్పటికే మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరగా.. ఇప్పుడు పదుల సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు జంప్ అయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వ్యాఖ్యలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. త్వరలో 15 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ తెలిపారు. ఇటీవల బీఆర్ఎస్ భవన్‌లో జరిగిన సమావేశానికి కార్పొరేటర్లను అనుమతించకపోవడంతో ఈ కార్పొరేటర్లంతా అసంతృప్తితో ఉన్నారని.. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారని చెప్పారు.గ్రేటర్ పరిధిలోని 15

## మహాయుతిలో లుకలుకలు



- తాజాగా బయటపడిన మహాయుతి కూటమిలో విభేదాలు
- మహారాష్ట్ర డిప్యూటీ సీఎం షిండే హెచ్చరికతో కూటమిలో కలకలం
- నన్ను తేలిగ్గా తీసుకోవద్దంటూ ఏక్‌నాథ్ షిండే హెచ్చరిక
- గతంలో ప్రభుత్వాన్ని కూలగొట్టా..ఏమైనా చేయగలుగుతానన్న షిండే
- కీలక సమావేశాలకు సైతం షిండే దూరం..దూరం

2

ముంబై-నవభూమిబ్యూరో
మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో లుకలుకలు తాజాగా బయటపడ్డాయి. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో మహారాష్ట్ర డిటీ సీఎం, శివసేన నేత ఏక్‌నాథ్ షిండే సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను తేలిగ్గా తీసుకోవద్దంటూ హెచ్చరికలు చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్న వీస్ నేతృత్వంలో జరిగిన కీలక సమావే శాలకు షిండే దూరంగా ఉండటం చర్చనీయాం శంగా మారింది. అయితే, షిండే వర్గం ఎమ్మెల్యేలకు భద్రతను తొలగించడంతోపాటు సచివాలయంలో వైద్య సహాయ కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేసుకోవడంతో వీరిమధ్య మరింత దూరాన్ని పెంచినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో షిండే చేసిన వ్యాఖ్యలు మహారాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. 2022లో ప్రభుత్వాన్ని పడగొట్టిన విషయాన్ని ఆయన తాజాగా గుర్తు చేయడం గమనార్హం. అయితే, ఏక్ నాథ్ షిండే హయాంలో ఆమోదించిన ఓ ప్రాజెక్టును ఫడ్నవీస్ ప్రభుత్వం నిలిపివేసింది. ఈ నేపథ్యంలో ఏక్ నాథ్ షిండే చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించు కుంది. తాను ఓ సాధారణ పార్టీ కార్యకర్తనని.. అంతేగాక, బాలాసాహెబ్ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తినని షిండే చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరూ దీన్ని అర్థం చేసుకోవాలన్నారు. 2022లో అందరూ నన్ను తేలిగ్గా తీసుకున్న ప్పుడు.. ఆనాడు అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టినట్లు షిండే చెప్పారు. ఆ తర్వాత విధానసభలో చేసిన మొదటి ప్రసంగంలో దేవేంద్ర ఫడ్నవీస్ కు 200 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని చెప్పానని.. 232 సీట్లు వచ్చాయని ఏక్ నాథ్ షిండే తెలిపారు. అందుకే తనను తేలిగ్గా తీసుకోవద్దని మరోసారి హెచ్చరించారు. తాను ఇది ఎవరిని ఉద్దేశించి చెబుతున్నానో వాళ్లు అర్థం చేసుకుంటారని ఏక్ నాథ్ షిండే అన్నారు. అయితే, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తో ఎలాంటి కోల్డ్ వార్ లేదని, అభివృద్ధిని అడ్డుకునేవారితోనే తన పోరాటమని చెప్పుకొచ్చారు.

## కాంగ్రెస్‌కు కోనప్ప రాజీనామా

- లోక్‌సభ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సిర్పూర్ కాగజ్ నగర్ మాజీ ఎమ్మెల్యే
- తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరైన ఫ్లైఓవర్‌ను
- రేవంత్ సర్కార్ రద్దు చేయడంతో ఆగ్రహంతో రాజీనామా



ఆదిలాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. సిర్పూర్ కాగజ్ నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, ఇకపై ఏ పార్టీలో చేరబోనని, స్వతంత్రం గా ఉంటానని చెప్పారు.
లోక్ సభ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీని వీడిన కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదిలాబాద్ జిల్లాలో కీలక నేతగా ఉన్న కోనప్ప ఏడాది పాటు కూడా కాంగ్రెస్ లో ఇమడలేకపోయారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరు చేసిన ఫ్లై ఓవర్ ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో ఆయన సీఎం రేవంత్ పై ఆగ్రహంతో ఉన్నారు. ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేసిన కోనప్ప తాజాగా పార్టీకి రాజీనామా చేశారు.
కాంగ్రెస్ కు రాజీనామా చేసిన అనంతరం కోనప్ప చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ దొంగల కంపెనీగా మారిందని ఆయన మండిపడ్డారు. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో కొత్త బిచ్చగాళ్లు తిరుగుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులను ప్రజలు గల్లా పట్టు కుని నిలదీయాలని పిలుపునిచ్చారు.
కోనేరు కోనప్ప 2014 ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఎన్నికల తర్వాత అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2023 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్ చేతిలో ఓటమిపాలయ్యారు. అయితే ఆ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడంతో ఆయన అసంతృప్తికి గురయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్ కు కూడా గుడ్ బై చెప్పారు. తాజాగా జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థికి ఆయన మద్దతు ప్రకటించారు.

## మిర్చి రైతుకు కేంద్రం భరోసా

- ఏపీలో మిర్చిధరలు,రైతుల సమస్యలపై కేంద్ర మంత్రి
- శివరాజ్ చౌహాన్‌తో చర్చించిన ఏపీ సీఎం చంద్రబాబు
- మార్కెట్ ఇంటర్ వెన్షన్ స్కీమ్ కింద మిర్చి రైతులను ఆదుకోవాలన్న సీఎం
- సీఎం అభ్యర్థనతో ఉన్నత స్థాయి సమీక్ష జరిపిన కేంద్ర మంత్రి చౌహాన్
- సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు కేంద్ర మంత్రి ఆదేశం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
ఏపీ సీఎం చంద్రబాబు తాజాగా ఢిల్లీ పర్యటనలో కీలక ప్రతిపాదన చేసారు. ఏపీలో మిర్చి ధరలు.. రైతుల సమస్య పైన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వివరించారు. మిర్చి ధర పెంపుతో పాటుగా ఎగుమతుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీంతో, శుక్రవారం శివరాజ్ సింగ్ ఇదే అంశం పైన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మార్కెట్ ఇంటర్ వెన్షన్ స్కీమ్ కింద మిర్చి రైతులను ఆదుకునే అంశం పైన నివేదిక ఇవ్వాలని కోరారు. కనీస మద్దతు ధర పైన కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పతనమైన ధరలు ఏపీలో మిర్చి ధరల పతనం పైన మాజీ సీఎం జగన్ ప్రభుత్వం పైన విమర్శలు చేసారు. తమ హయాంలో ఉన్న ధరలు.. ప్రస్తుతం ఉన్న పరిస్థితి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మిర్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. గుంటూరు మిర్చి యార్డులో జగన్ రైతులను పరామర్శించారు. ఇటు, సీఎం చంద్రబాబు మిర్చి రైతుల సమస్యల పైన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాసారు. అదే విధంగా ఢిల్లీ పర్యటనలో ఇదే అంశం పైన వివరించారు. ఎగుమతుల అంశం పైన చర్చించారు. ధరల విషయంలో

## ప్రియురాలితో జీహెచ్‌ఎంసీ జేసీ సహజీవనం

- పట్టుకుని చితక్కొట్టిన భార్య

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
ఉద్యోగం, క్యాంపుల పేరుతో రోజుల తరబడి ఇంటికి రాకుండా బయటే గడిపేస్తున్న భర్తపై నిఘా పెట్టిందో భార్య. దీంతో క్యాంపుల పేరుతో భర్త మరో యువతితో కాపురం పెట్టిన విషయం బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న భార్య ఆగ్రహంతో తన పుట్టింటి వాళ్లు, బంధువులను వెంటబెట్టుకుని వెళ్లి భర్తను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఆపై కోపం పట్టలేక భర్తను, ఆయన ప్రియురాలిని ఎడాపెడా వాయించింది. వెంట వెళ్లిన బంధువులు కూడా తలో చెయ్యి వేయడంతో సదరు భర్త పరిస్థితి దారుణంగా మారింది. హైదరాబాద్ లోని వారాసిగూడలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి ఆరోగ్య పరిస్థితి విషమం

- 4 రోజులుగా ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాగంటి గోపీనాథ్
- పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు వెల్లడి
- గోపీనాథ్‌ను పరామర్శించేందుకే ఆసుపత్రికి కేసీఆర్

2



ఆదిలాబాద్-నవభూమిబ్యూరో
బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టుగా తెలుస్తోంది. కిడ్నీ ఫెయిల్యూర్ సమస్యతో బాధ పడుతున్న ఆయన గత నాలుగు రోజులుగా హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి

## ఏపీకి అంతర్జాతీయ సంస్థలు

- నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి కీలక వ్యాఖ్యలు
- నిరుద్యోగ యువతకు ఉద్యోగాల వరద
- యువతకు ఉద్యోగాలు కల్పించడమే కూటమి లక్ష్యం
- ఎయిర్‌పోర్టు నిర్మించే స్థలాన్ని పరిశీలించిన ఎంపీ
- భూములు కోల్పోతున్న రైతులకు ఎంపీ భరోసా

2




నెల్లూరు-నవభూమిబ్యూరో
ఏపీకి అంతర్జాతీయ సంస్థలు రాబోతున్నాయని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకుండా జిల్లాకు పరిశ్రమలు తీసుకురావడమే తమ లక్ష్యమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లాకు రాబోతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు దగదర్తి మండలం. దామవరం వద్ద ఎయిర్ పోర్టు భూములను శుక్రవారం ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం పరిశీలించారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీ బీదా మస్తాన్ రావు, ఎమ్మెల్యే కావ్యా క్రిష్ణారెడ్డి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రామ్మోహన్ నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, తెలుగువారు కావడంతోనే ఎయిర్ పోర్టు పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. రామ్మోహన్ చొరవతో ఒక్కరోజు వ్యవధిలో అధికారులను

## బంజారాహిల్స్ తాజ్ బంజారా హెూటల్ సీజ్! టాక్స్ కట్టనందుకే..



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ప్రముఖ స్టార్ హెూటల్ తాజ్ బంజారా హెూటల్‌ను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. రెండు సంవత్సరాల నుంచి నిర్వాహకులు పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. పలు మార్లు బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇచ్చినప్పటికీ.. నిర్వాహకుల నుంచి స్పందన రాలేదని తెలిసింది. ఈ క్రమంలోనే తాజాగా అధికారులు చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. దాదాపు రూ. 1.43 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



## పండుగ వేళ రేవంత్ సర్కార్ మరో శుభవార్త.. ఇక తెల్లవార్లూ.. సంతోషం రెట్టింపు..!



**హైదరాబాద్-నవభూమి:**పండుగ వేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో శుభవార్త వినిపించింది. ఇప్పటికే.. రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు ముస్లిం ఉద్యోగులకు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక వెసులుబాటు కల్పించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ శాఖల్లో పని చేసే ముస్లిం ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకే తమ విధుల నుంచి రిలీవ్ అవ్వొచ్చని.. ఇప్పటికే సీఎస్ శాంతి కుమారి ఆదేశాలు జారీచేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఇప్పటికే ముస్లిం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తుండగా.. ఈ నేపథ్యంలోనే.. మరో శుభవార్త వినిపించింది ప్రభుత్వం.మార్చి 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 24 గంటల పాటు షాపులు తెరుచుకోవచ్చని దుకాణాదారులకు తెలంగాణ కార్మిక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో.. ముస్లింలకు ప్రత్యేక వెసులుబాటు కలగనుంది. ఉపవాసం ముగించుకుని రాత్రి పూట ఇఫ్తార్ విందుల్లో పాల్గొనేవారికి సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు. అటు ముస్లింలకే కాకుండా.. ఇటు దుకాణాదారుల్లో కూడా ఈ నిర్ణయం సంతోషం నింపినట్టయింది.మరోవైపు.. 8 గంటలు లేదా వారానికి 48 గంటల కంటే ఎక్కువ పనిచేసే సిబ్బందికి జీతాలు రెండింతలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అదే విధంగా.. మహిళ ఉద్యోగులు ఉంటే వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు తీసుకొవాలని పేర్కొంది. ఇదే క్రమంలో.. జీవో 476ను తప్పనిసరిగా పాటించాలని అధికారులు ఆదేశించారు. రంజాన్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది.%తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో పాటు ముస్లిం సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. రంజాన్ పండుగకు ముందుగానే ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడం ఆశాజనకంగా ఉందని చెప్పుకొచ్చారు.

ఇదిలా ఉంటే.. రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న నిర్ణయంపై కొంత మంది విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ పండుగలకు ఒకలా.. ముస్లిం పండుగల పట్ల మరొకలా ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు విధుల్లో ప్రత్యేక వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం.. అయ్యప్ప, హనుమాన్, భవానీ మాలధారుల విషయంలో ఇలాంటి వెసులుబాటు ఎందుకు ఇవ్వటంలేదని.. వాళ్లు చేసిన పాపమేంటంటూ ప్రశ్నిస్తున్నారు. అన్ని వర్గాలను ఒకలా చూడాలని రేవంత్ రెడ్డి సర్కారుకు చురకలంటిస్తున్నారు. కాగా.. ఇప్పుడు 24 గంటల పాటు దుకాణాలు తెరుచుకోవచ్చని చెప్పటంతో.. ఆ విమర్శలు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది.

## మాంస ప్రియులకు మరో బ్యాడ్ న్యూస్.. చికెన్ వ్యాపారుల కఠిన నిర్ణయం.. ఇక కష్టమే..!



**హైదరాబాద్-నవభూమి:**మాంస ప్రియులకు మరో బ్యాడ్ న్యూస్. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో చికెన్ కొనేందుకు ప్రజలు జంకుతున్నారు. చాలా మంది చికెన్ షాప్ వైపు చూసేందుకు కూడా భయపడుతున్నారు. వైద్యులు, నిపుణులు ఎంత అవగాహన కల్పించినప్పటికీ.. జనాల భయం జనాలది. ఫలితంగా.. చికెన్ వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో.. చికెన్ వ్యాపారులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. వారం రోజుల పాటు చికెన్ మార్కెట్ బంద్ చేయనున్నట్టు ప్రకటించారు. ఇది ఎక్కడో కాదు ఆదిలాబాద్‌లో మాత్రమే.

మాంస ప్రియులకు ఇప్పటికే గడ్డు కాలం వచ్చి పడింది. వారం వారం హ్యాపీగా చికెన్ తినే భోజన ప్రియులు.. ఈ బర్డ్ ఫ్లూ పుణ్యమా అని.. అటు చికెన్, ఇటు గుడ్లు ఏవీ తికలేక ఇబ్బంది పడుతున్నారు. అటు మటనో, చేపలో తిందామంటే.. ఉన్నట్టుండి రేట్లు పెంచేయటంతో.. అవి కొనలేక, ఇవి తినలేక మాంసప్రియులకు ముద్ద దిగటంలేదు. అయితే.. కొందరు మాత్రం.. డాక్టర్లు చెప్తున్న సూచనలు, జాగ్రత్తలు తీసుకుంటూ చికెన్ తింటున్నారు. అయితే.. వందలో పది మాత్రమే భయపడకుండా.. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ చికెన్ తింటుండటంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. దీంతో.. చికెన్ వ్యాపారులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. వారం రోజుల పాటు చికెన్ మార్కెట్ బంద్ చేయాలని నిర్ణయించారు. అయితే.. ఇది రాష్ట్రమంతటా కాదండోయ్.. కేవలం ఆదిలాబాద్‌లో మాత్రమే.ఆదిలాబాద్‌లో వారం రోజుల పాటు చికెన్ మార్కెట్ బంద్ చేస్తున్నట్టు వ్యాపారులు ప్రకటించారు. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయాయని వ్యాపారం పూర్తిగా పడిపోవటం వల్ల.. ఈ నిర్ణయం తీసుకున్నట్టు వ్యాపారులు తెలిపారు. వారం తర్వాత కూడా.. అప్పటి పరిస్థితిని చూసి మార్కెట్ ఓపెన్ చేయాలా వద్దా అని నిర్ణయిస్తామని వ్యాపారులు చెప్తున్నారు. తెలంగాణలో బర్డ్ ఫ్లూ భయం లేదని అధికారులు చెప్పినా.. చికెన్, గుడ్లు తినొచ్చని డాక్టర్లు చెప్పినా.. ప్రజలు మాత్రం భయపడుతూ కొనడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.

అయితే.. తెలంగాణలో బర్డ్ ఫ్లూ కేసులు నమోదైనట్టు ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. అయితే.. పక్కనున్న ఏపీలో బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాగా.. అక్కడ కూడా పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని.. ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర నాయుడు వెల్లడించారు. అయితే.. బర్డ్ ఫ్లూ నిర్ధారణ జరిగిన తూర్పు గోదావరి జిల్లా కానూరు అగ్రహారం, పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరు, కృష్ణా జిల్లా బాదంపూడి, కర్నూలు జిల్లా ఎన్.ఆర్.పేట, ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం ప్రాంతాల్లో పటిష్ట చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

# భారత్‌కు సాయం నిలిపేసిన ట్రంప్

(1వపేజీ తరువాయి)అంటూ వ్యాఖ్యానించారు. ఈ నిధులను అమెరికా కేటాయించింది భారత్‌కు కాదంటూ తాజాగా ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది. ఈ 21 మిలియన్ డాలర్ల మొత్తం కూడా 2022లో బంగ్లాదేశ్‌కు కేటాయించినట్లు వెల్లడించింది. ఇందులో- 13.4 మిలియన్ డాలర్లను ఇప్పటికే బంగ్లాదేశ్‌కు చెల్లించినట్లు పేర్కొంది. దీనిపై ఓ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిపోవడానికి.. కారణం ఏమిటి?

ఇందులో పలు షాకింగ్ అంశాలను పొందుపరిచింది ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్. బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిపోవడానికి, ఆమె పదవీచ్యుతురాలు కావడానికి సరిగ్గా ఏడు నెలల ముందు ఈ నిధులు విడుదల అయ్యాయని, 2024 జనవరిలో ఆ దేశ సార్వత్రిక ఎన్నికలకు ముందు రాజకీయ అనిశ్చితికి, అంతర్యుద్ధానికి, ఎన్నికల ప్రక్రియ కావడానికి ముందే ఈ ఫండ్స్ బంగ్లాదేశ్‌కు చేరినట్లు పేర్కొందా కథనం. గతంలోనే ట్రంప్ అభ్యంతరం.. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న ఈ చెల్లింపులను అప్పట్లోనే డొనాల్డ్ ట్రంప్ తప్పుపట్టారు. యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఎయిడ్) కింద భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచుకోవడా నికి అమెరికా నిధులను ఇవ్వడం ఎంతమాత్రం మంచిది కాదంటూ గతంలోనే విమర్శించారు ట్రంప్. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని నిలిపివేశారు. 21 మిలియన్ డాలర్ల చెల్లింపులను యూఎస్ఎయిడ్ కింద గ్రాంట్లుగా చూపించడం వివాదాస్పదమౌతోంది. వాషింగ్టన్ డీసీ కేంద్రంగా పన చేస్తోన్న కన్సార్టియం ఫర్ ఎలక్షన్స్ అండ్ పొలిటికల్ ప్రాసెస్ స్ట్రెంథనింగ్ (సీఈపీపీఎస్) ద్వారా ఈ నిధులు మంజూరు అయ్యాయి. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడం, ఓటర్ల ప్రక్రియను సులభతరం చేయడం వంటి కారణాలతో ఈ మొత్తాన్ని విడుదల చేసినట్లు ఆ కథనం పేర్కొంది. 2008 వరకు.. నిజానికి- సీఈపీపీఎస్ ప్రాజెక్ట్ కోసం యూఎస్ఎయిడ్ కింద భారత్‌కు నిధులను విడుదల చేసే విధానం 2008 వరకూ లేదు. ఆ తరువాతే ఇది తెరమీదికి వచ్చింది. ఫెడరల్ అవార్డ్ ఐడెంటిఫికేషన్ నంబర్ AID117LA1600001 కింద 2016 సెప్టెంబర్‌లో నిధుల చెల్లింపులు ఆరంభం అయ్యాయి. 2026 జులై వరకూ ఈ నిధుల విడుదల కొనసాగుతుంది. ఇప్పటివరకు 13.2 మిలియన్ల డాలర్లు మంజూరయ్యాయి. ధాకాకు చెల్లింపులు. 2022 నవంబర్‌లో ఈ గ్రాంట్ పక్కదారి పట్టినట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది. యూఎస్ఎయిడ్‌లో భాగమైన నాగొరిక ప్రోగ్రామ్‌కు మళ్లించినట్లు రికార్డుల్లో ఉందని తెలిపింది. అమర్ ఓటు అమర్ (నా ఓటు నా గని) అనే బంగ్లాదేశ్ ప్రాజెక్ట్‌కు మళ్లించినట్లు వివరించింది. ఇదే విషయాన్ని 2024 డిసెంబర్‌లో ధాకా యూఎస్ఎయిడ్ రాజకీయ వ్యవహారాల సలహాదారు సైతం ధృవీకరించారు. యూఎస్ఎయిడ్ కింద అమెరికా చెల్లిస్తోన్న 21 మిలియన్ డాలర్ల సీఈఈపీఎస్/నాగోరిక్ ప్రాజెక్ట్‌కు తాను పని చేస్తోన్నట్లు వెల్లడించారు. 2022 నుంచి.. ఓటర్స్ టర్నవుట్ ఇన్ ఇండియా కోసం కేటాయించిన యూఎస్ఎయిడ్ గ్రాంట్ 21 మిలియన్ డాలర్లల్లో 2022 నుంచి ఇప్పటివరకు 13.4 మిలియన్లు బంగ్లాదేశ్‌కు మళ్లించినట్లు తేలింది. 2022 జులై- 2024 అక్టోబర్ మధ్యకాలంలో ఆరు సబ్ గ్రాంట్లుగా దీన్ని విభజించినట్లు తేలింది. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఎలక్టోరల్ సిస్టమ్, ఇంటర్నేషనల్ రిపబ్లికన్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ డెమోక్రటిక్ ఇన్‌స్టిట్యూట్‌కు మంజూరు చేశారు. సబ్ గ్రాంట్స్ వినియోగం ఇలా.. 2024 ఆగస్టులో షేక్ హసీనా పదవీచ్యుతురాలు కాగా.. అదే ఏడాది సెప్టెంబర్ 11వ తేదీన యూనివర్శిటీ ఆఫ్ ధాకా ప్రొఫెసర్ ఐనుల్ ఇస్లాం తన ఫేస్‌బుక్, లిక్డ్ ఇన్‌లో పెట్టిన పోస్ట్ ఒకటి అనేక అనుమానాలను రేకెత్తించింది. సివిల్ వార్ రాత్రికి రాత్రి చోటు చేసుకున్నది కాదని వెల్లడించారాయన. యూత్ ఈవెంట్స్‌కు ఖర్చు.. బంగ్లాదేశ్ వ్యాప్తంగా ఉన్న యూనివర్శిటీలు, ఇతర క్యాంపస్‌లల్లో 544 యూత్ ఈవెంట్స్ జరిగాయని, వాటి నిర్వహణ కోసం అమెరికా విడుదల చేసిన 13.4 మిలియన్ డాలర్ల నుంచి ఖర్చు చేసి ఉండొచ్చని ఐనుల్ అనుమానించారు. యూత్ డెమోక్రటిక్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ కోసం ఖర్చు చేశారని పేర్కొన్నారు. దీని కింద 10,264 మంది యూనివర్శిటీ విద్యార్థులు, 221 ప్రాజెక్టులు, 170 డెమోక్రసీ సెషన్స్ నిర్వహించారని తెలిపారు. వాటికి ఈ నిధులను చెల్లించి ఉండొచ్చని అన్నారు.

## యాదగిరిగుట్ట స్వర్ణ విమాన గోపురం రికార్డు..
# దేశంలోనే మొట్టమొదటిది.. విశేషాలివే..!



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహెూత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 23వ తేదీన దేవస్థాన స్వర్ణ విమాన గోపురానికి మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డిని ఆలయ పూజారులు ఆహ్వానించగా.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కూడా ఆహ్వానించారు. శుక్రవారం (ఫిబ్రవరి 21న) యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన పూజారి, ఆలయ కార్యనిర్వహణ అధికారులతో కూడిన బృందం ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. మార్చి 1 నుంచి 11 వరకు జరిగే యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సైతం హాజరు కావాల్సిందిగా కేసీఆర్‌ను ఆలయ పూజారులు కోరారు.అయితే.. కేసీఆర్ హయాంలో యాదగిరిగుట్టను పునర్మిర్మాణం చేసి.. అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన విషయం తెలిసిందే. కాగా.. ఆలయ విమాన గోపురానికి స్వర్ణ తాపడం పనులకు కేసీఆర్ హయాంలోనే శ్రీకారం చుట్టగా.. ఆ పనులు ఇప్పుడు పూర్తయ్యాయి. కాగా.. ఈ నెల 23న స్వర్ణ విమాన గోపురానికి మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు.

**స్వర్ణ విమాన గోపురం విశేషాలివే..**

స్వర్ణ విమాన గోపురం ఎత్తు 50.5 అడుగులు కాగా.. గోపురం వైశాల్యం 10,759 చదరపు అడుగులు. గోపురానికి స్వర్ణతాపడానికి మొత్తంగా 68 కిలోల బంగారాన్ని ఉపయోగించారు. డిసెంబరు ఒకటో తేదీ, 2024లో స్వర్ణ తాపడం పనులు ప్రారంభించగా.. ఫిబ్రవరి 18, 2025న తాపడం కవచాల బిగింపు పనుల పూర్తయ్యాయి. అయితే.. బిగింపు పనులకు అయిన మొత్తం ఖర్చు.. రూ.5.10 కోట్లు. రాగి రేకులకు అయిన ఖర్చు రూ.12 లక్షలు. మొత్తంగా.. సుమారు రూ.70 కోట్ల వరకు ఖర్చయినట్టు అంచనా. దేశంలోనే మొట్టమొదటి ఎత్తైన స్వర్ణ గోపురంగా రికార్డుకెక్కటం గమనార్హం.యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహెూత్సవంలో పాల్గొనాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డికి.. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్, ఆలయ ఈవో, అర్చకులు.. గురువారం (ఫిబ్రవరి 20న) ఆహ్వాన పత్రికను అందించారు. ఈ నెల 23న శ్రీ లక్ష్మీ నరసింహ దేవస్థానంలో బంగారు స్వర్ణ గోపురం మహా కుంభాభిషేక మహెూత్సవాన్ని నిర్వహించనున్నారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ మహెూత్సవం

## విద్యార్థులు భారీ శుభవార్త.. ఇకపై ప్రతి నెలా నాలుగో శనివారం సెలవు.. ఎంజాయ్ పండగో..!



**హైదరాబాద్-నవభూమి:** సాధారణంగా విద్యార్థులకు ఆదివారాలు, పండుగలకు మాత్రమే సెలవులు ఇస్తుంటారు. అలా కాకుండా మధ్యలో విద్యార్థి సంఘాలు ఎవైనా బంద్‌లకు పిలుపునిస్తే.. ఎవరైనా ప్రముఖులు మరణిస్తేనో ఇలా ప్రత్యేక సందర్భాల్లోనే అదనపు సెలవులు వస్తుంటాయి. అలాకాకుండా.. విద్యాసంస్థల యాజమాన్యాలే స్వయంగా విద్యార్థులకు అదనపు సెలవులు ఇచ్చారంటే.. అంతకంటే శుభవార్త ఉంటుందా..? అచ్చంగా అదే జరిగింది. ఇప్పటి వరకు విద్యార్థులకు నెలలో నాలుగు ఆదివారాలు మాత్రమే సెలవులు వచ్చేవి.అయితే.. ఇక నుంచి ప్రతి నెలా నాలుగో శనివారం కూడా విద్యార్థులకు సెలవు ఇవ్వాలని డిసైడ్ చేసింది హైదరాబాద్ జేఎన్టీయూ కేవలం విద్యార్థులకు మాత్రమే సెలవు ఇచ్చి సిబ్బందికి ఇవ్వకపోతే ఎలా.. ఉద్యోగులకు కూడా హాలిడే ప్రకటించేసింది. ఈ మేరకు.. జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ గురువారం (ఫిబ్రవరి 20న) రోజున కీలక ప్రకటన జారీ చేసింది.యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలు, కార్యాలయాలకు ఇక నుంచి నాలుగో శనివారం సెలవు ప్రకటిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈ మేరకు జేఎన్టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర రావు ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా ప్రకటించిన నాలుగో శనివారం సెలవు.. ఈనెల (ఫిబ్రవరి) నుంచే అమలు కానుంది. ఈ ఉత్తర్వులు అమల్లోకి రావడంతో ఈనెల 22వ తేదీన నాలుగో శనివారం విద్యార్థులకు సెలవు రానుంది. నాలుగో శనివారం కార్యాలయాలు, కళాశాలలకు సెలవు దినం ప్రకటించటంతో.. విద్యార్థులతో పాటు ఆచార్యులు, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బందికి కూడా హాలిడే రానుంది.అయితే.. జేఎన్టీయూ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 423 కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలలన్నింటికి నాలుగో శనివారం సెలవు దినం ప్రకటన వర్తించనుంది. అయితే నాలుగో శనివారం సెలవు అనేది గతంలోనే ఉండేది. 2008కి ముందు ఈ నాలుగో శనివారం హాలిడే అమల్లో ఉండేది. కాగా.. 2008లో దీనిని రద్దు చేయగా తిరిగి మళ్లీ ఇప్పుడు అదే పద్ధతిని తిరిగి ప్రకటించటం గమనార్హం. యూనివర్సిటీ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల విద్యార్థులు, ఉద్యోగులు, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ మహిళలకు శుభవార్త.. ఏడాదికి 2 ఖరీదైన చీరలు, రూ.1000 కోట్లతో.. రేవంత్ కీలక ప్రకటన..!

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో కోటి మంది మహిళల్ని కోటీశ్వరుల్ని చేయడమే తమ ప్రభుత్వం లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లాలో పర్యటిస్తోన్న సీఎం రేవంత్ రెడ్డి.. అప్పకపల్లిలో మహిళా సమాఖ్య పెట్రోల్ బంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. మహిళలకు శుభవార్త వినిపించారు. గత ప్రభుత్వం మహిళా సంఘాల్ని పట్టించుకోలేదని.. ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం మహిళా సంఘాల్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోందని చెప్పుకొచ్చారు.ఈ సందర్భంగా.. మహిళలు ఆత్మగౌరవంతో బతకాలని ఏడాదికి రెండు చీరలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గతంలో మామూలు చీరలు ఇచ్చేవారని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఖరీదైన చీరలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. మరోవైపు.. అంబానీ, అదానీలు పోటీపడే సోలార్ ప్రాజెక్టుల్లో మహిళలను ప్రోత్సహిస్తామని చెప్పుకొచ్చారు. మహిళలు వ్యాపారంలో వేగంగా ఎదిగేలా వారిని ప్రోత్సహిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.దేశంలోనే తొలిసారి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో మహిళలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళలు ఆత్మగౌరవంతో బతుకుతారని తమ ప్రభుత్వం ప్రగాఢంగా నమ్ముతోందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళా స్వయం సహాయక సంఘాలను పునరుద్ధరించామన్నారు.తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యన్నారు. అన్ని రంగాల్లో మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని.. ఈ క్రమంలోనే.. 600 ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులను చేశామని తెలిపారు. ఇదే క్రమంలో.. వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మహిళా స్వయం సహాయక ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి శిల్పారామం వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు.

## భారత్ ఎన్నికల్లో అమెరికా నిధులు

(1వపేజీ తరువాయి)డోజ్ పేర్కొంది. డోజ్ ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఇదే సమయంలో.. భారత్ లో ఏదో ఒక రాజకీయ పార్టీకి బైడెన్ ఈ సాయం చేసి ఉంటారని డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం తీవ్ర కలకలం రేపింది. ఈ నేపథ్యంలో... తాజాగా ఈ వ్యవహారానికి సంబంధించి వీణారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా.. ఈమె ఎవరు.. అమెరికా నుంచి భారత్ లో జరిగే ఎన్నికలకు నిధుల సాయాన్ని అందించడంలో ఈమె పాత్ర ఎంత మొదలైన విషయాలపై ఇప్పుడు చర్చ మొదలైంది. ఈ సమయంలో బీజేపీ కీలక డిమాండ్ తెరపైకి తెచ్చింది. యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్ మెంట్ (యూఎస్ ఎయిడ్) ఇండియా కు 2021 - 24 మధ్య వీణారెడ్డి డైరెక్టర్ గా వ్యవహరించారు. ఈ క్రమంలో ఈమె 2021లో భారత్ కు వచ్చి 2024 లోక్ సభ ఎన్నికలు ముగిసిన తర్వాత అమెరికాకు తిరిగి వెళ్లారని అంటున్నారు. ఈ మేరకు బీజేపీ ఎంపీ ఎక్స్ వేదికగా కీలక విషయాలు వెల్లడించారు. వీణారెడ్డి యుఎస్ ఎయిడ్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు అమెరికా నుంచి భారత్ కు అందే సాయం గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోందని.. అమెరికా సాయంతో భారత్‌లో ఓటర్ టర్నవుట్ పెరిగితే అది కచ్చితంగా అధికార పార్టీకి అయితే మేలు చేయదని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవ్య ఇప్పటికే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో... వీణారెడ్డి పాత్రపై విచారణ జరపాలని బీజేపీ ఎంపీ మహేష్ జెఠ్మలానీ తాజాగా ట్వీట్ చేయడంతో ఆమె పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఈ విషయం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## మిర్చి రైతుకు కేంద్రం భరోసా

(1వపేజీ తరువాయి)సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో చంద్రబాబు చంద్రబాబు అభ్యర్ధనతో చౌహాన్ ఉన్నతస్థాయి సమీక్ష ఏర్పాటు చేసారు. సమస్య పరిష్కార దిశగా తక్షణ చర్యలు, పరిష్కార మార్గం కనుక్కోవాలని ఉన్నతాధికా రులను శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశించారు. ఈ సమీక్షలో ఏపీ నుంచి కేంద్రంలో మంత్రులుగా ఉన్న రామ్మోహన్ నాయుడు తో పాటుగా పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. మిర్చికి రూ.11,600కు పైగా ధర ఇవ్వాలని కోరినట్లు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. మిర్చి ఎగుమతులపైనా చర్చించామన్నారు. ఎగుమతి దారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని శివరాజ్‌సింగ్ చౌహాన్ చెప్పారన్నారు. కేంద్రం మిర్చి రైతులకు సానుకూల నిర్ణయం ప్రకటిస్తుందని భరోసా ఇచ్చారు. మిర్చి రైతుల విషయంలో చంద్రబాబు కేంద్రం ముందు కీలక ప్రతిపాదనలు చేసారు. మార్కెట్ జోక్యం పథకం కింద కేంద్ర ప్రభుత్వం 25% పంట కొనుగోలు సీలింగ్ తొలగించి సాధ్యమైనంత ఎక్కువ పంట కొనుగోలు చేయాలని చంద్రబాబు కోరారు. ఐసీఏఆర్ నిర్ణయించిన మిర్చి ధరలు ఏపీ రైతుల సాగు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఖరారు చేసినట్లు కనిపిస్తోందని... వాటిని సరిదిద్దాలని సూచించారు. మిర్చి కొనుగోలు వ్యయాన్ని కేంద్ర, రాష్ట్రాలు ఎలా పంచుకోవాలో ఆలోచన చేయాలని కోరారు. దీంతో, ఇప్పుడు ఈ ప్రతిపాదనల పైన సమీక్ష చేసి.. రైతులకు మేలు చేసేలా నిర్ణయం తీసుకోవాలని శివరాజ్ సింగ్ చౌహాన్ సూచించారు.

## ఏపీకి అంతర్జాతీయ సంస్థలు

(1వపేజీ తరువాయి)ఢిల్లీ నుంచి ఏపీకి పంపారని అన్నారు. సహా చాలా కంపెనీలు నెల్లూరు వైపు అడుగులు వేస్తున్నాయని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

**యువతకు ఉద్యోగాలు: ఎమ్మెల్యే కావ్యా క్రిష్ణారెడ్డి**

ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే కావ్యా క్రిష్ణారెడ్డి తెలిపారు. కృష్ణపట్నం పోర్టు రామాయపట్నం పోర్టు అనుసంధానం చేస్తూ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నిర్మాణం కానుందని అన్నారు. ఎయిర్ పోర్టుకు గతంలో సీఎం చంద్రబాబు భూమి పూజ చేస్తే, వైసీపీ పాలనలో ఒక్క అడుగు ముందుకు కూడా పడలేదని చెప్పారు. 700 ఎకరాల భూసేకరణ పూర్తయిందని.. . మిగిలిన భూసేకరణ కూడా త్వరలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కావ్యా క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు.

## ఏపీకి వెళ్లండి..!

(1వపేజీ తరువాయి)కొనసాగుతున్న అభిషేక్ మహంతి.. ప్రస్తుతానికి కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతిలను వెంటనే రిలీవ్ చేయాలని తెలంగాణ సర్కారును ఆదేశించిన కేంద్ర హెూంశాఖ.. వెంటనే ఏపీ క్యాడర్‌లో రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది. గతంలో కూడా పలువురు ఐఏఎస్ అధికారులు తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లిన విషయం తెలిసిందే.

## జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ పార్టీకి మరో భారీ షాక్

(1వపేజీ తరువాయి)మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమతో టచ్‌లో ఉన్నారని.. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ఫసియుద్దీన్ తెలిపారు. గత తొమ్మిదేళ్లుగా స్టాండింగ్ కమిటీలో ప్రాతినిధ్యం లేని కాంగ్రెస్ నుంచి ఈసారి ఏడుగురు సభ్యులు ఉండనున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ములేక బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుందన్నారు. వచ్చే బల్దియా ఎన్నికల్లో హైదరాబాద్ నగర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా ఉండబోతోందని బాబా ఫసియుద్దీన్ చెప్పుకొచ్చారు. కాగా, ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు నామినేషన్ విత్ డ్రా చేసుకోవడంతో స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం అయిన విషయం తెలిసిందే. స్టాండింగ్ కమిటీలో ఏడుగురు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ఎంఐఎంకు చెందిన ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు. ఫసియుద్దీన్ వ్యాఖ్యలతో బీఆర్ఎస్ పార్టీకి జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తప్పదని తెలుస్తోంది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి ఆరోగ్య పరిస్థితి విషమం

(1వపేజీ తరువాయి)విషమంగా ఉన్నట్టు బంధువులు కూడా చెపుతున్నారు. ఇదే విషయాన్ని బీఆర్ఎస్ వర్గాలు కూడా చెపుతున్నాయి. అయితే గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి గురించి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిన్న ఏఐజీ ఆసుపత్రికి వెళ్లిన సంగతి తెలిసిందే. సాధారణ వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి ఆయన వెళ్లారని పార్టీ శ్రేణులు చెప్పినప్పటికీ... గోపీనాథ్ ను పరామర్శించడానికే ఆయన వెళ్లారని తెలుస్తోంది. గోపీనాథ్ కు కిడ్నీ సమస్యలు ఉన్నప్పటికీ ఆయన నిర్లక్ష్యం చేశారని... దీంతో సమస్య పెద్దదయిందని చెపుతున్నారు. ట్రీట్మెంట్ తీసుకుంటున్నప్పటికీ నాలుగు రోజుల క్రితం ఆయన మరింత అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించినట్టు వైద్యులు చెప్పినట్టు సమాచారం.

# భాష ఆధారంగా వివక్షకు యత్నం!



**కడలూరు-నవభూమి:** భాష ఆధారంగా వివక్ష చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాని మోదీ శుక్రవారం అన్నారు. భారతీయ భాషల మధ్య ఎన్నడూ శత్రుత్వం లేదని, ఒకదానికొకటి ప్రభావితం చేసి, సుసంపన్నం చేసుకున్నాయని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా హిందీని బలవంతంగా రుద్దేందుకు కేంద్రం చూస్తున్నదనే రాజకీయ రచ్చ నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన్ ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ అపోహలు, తప్పుడు అభిప్రాయాలకు దూరంగా ఉండి, అన్ని భాషలను స్వీకరించడం మన సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మరోవైపు రాజకీయ కారణాలతో జాతీయ విద్యావిధానం అమలు చేయకపోవడం సరైంది కాదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. త్రిభాషా విధానాన్ని అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. దక్షిణాదిపై హిందీ భాషను రుద్దేందుకే ఈ సూత్రాన్ని ప్రవేశపెట్టారని, ఎన్ఈపీని అమలు చేస్తేనే సమగ్ర శిక్షా అభియాన్ నిధులు విడుదల చేస్తామనడం సరైంది కాదంటూ తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఇందుకు జవాబుగా ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం స్టాలిన్‌కు సంధించిన లేఖలో త్రిభాషా ఫార్ములాకు, జాతీయ విద్యావిధానానికి అంతర్గత సంబంధం ఉందని స్పష్టం చేశారు. దీంతో ఈ ఫార్ములా పాటించని రాష్ట్రాలకు కేంద్ర నిధులు రావన్నది స్పష్టమవుతోంది!

# జైలుకెళ్లిన గ్యాంగ్‌స్టర్, లేడీడాన్‌గా చక్రం తిప్పుతున్న భార్య.. భారీ డ్రగ్స్‌తో అడ్డంగా దొరికింది



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు.. డ్రగ్స్, గ్యాంగ్‌స్టర్ల ముఠా ఆట కట్టించారు. గత కొన్ని సంవత్సరాలుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న లేడీ డాన్ జోయా ఖాన్(33) ఎట్టకేలకు పోలీసులకు చిక్కింది. అయితే ఆ సమయంలో రూ.కోటి విలువైన 270 గ్రాముల హెరాయిన్ కూడా లభ్యం కావడం గమనార్హం. అయితే ఢిల్లీలో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ అయిన హాషీం బాబా భార్యనే ఈ జోయా ఖాన్. హత్యలు, దోపిడీ, ఆయుధాల అక్రమ రవాణా సహా పదుల సంఖ్యలో కేసుల్లో నిందితుడిగా ఉన్న హాషీం బాబా జైలుకు వెళ్లగా.. బయట అతడి నేర సామ్రాజ్యాన్ని, గ్యాంగ్‌ను నడిపిస్తూ జోయా ఖాన్ లేడీ డాన్‌గా మారింది. అయితే హాషీం బాబాకు మూడో భార్యనే ఈ జోయా ఖాన్. ఆమెకు అంతకుముందే పెళ్లి అయి విడాకులు తీసుకుంది. ఆ తర్వాత హాషీం బాబా, జోయా ఖాన్.. ఈశాన్య ఢిల్లీలో ప్రేమించి 2017లో పెళ్లి చేసుకున్నారు.ఇక అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం సోదరి హసీనా పార్కర్‌తో కూడా జోయా ఖాన్‌కు సంబంధాలు ఉన్నట్లు ఢిల్లీ పోలీసులు గుర్తించారు. దోపిడీలు, డ్రగ్స్ అక్రమ రవాణాలో కూడా జోయా ఖాన్ పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ జోయా ఖాన్.. హై ప్రొఫైల్ పార్టీలకు హాజరవుతుందని.. ఖరీదైన దుస్తులు ధరించి, ఖరీదైన కార్లతో తిరుగుతూ.. ఎప్పుడూ లగ్జరీ బ్రాండ్లతో లైఫ్ ఎంజయ్ చేస్తూ ఉంటుందని పోలీసుల విచారణలో తేలింది. వీటన్నింటినీ మించి ఈ జోయా ఖాన్‌కు సోషల్ మీడియాలో భారీగా ఫాలోయింగ్ ఉన్నట్లు సమాచారం.అయితే తీహార్ జైలులో ఉన్న తన భర్త హాషీం బాబాను కలుస్తూ.. వారిద్దరూ కోడ్ భాషలో మాట్లాడుకుంటారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఇక జోయా ఖాన్‌ను పట్టుకునేందుకు ఢిల్లీ పోలీసులు, క్రైం బ్రాంచ్ అధికారులు ఎన్నో ఏళ్లుగా ఎన్నో ఆపరేషన్లు చేపట్టినా దొరకలేదు. అయితే తాజాగా పక్కా సమాచారంతో ఈశాన్య ఢిల్లీలోని వెల్‌కమ్ ప్రాంతంలో ఢిల్లీ పోలీసులు జోయా ఖాన్‌ను అరెస్ట్ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ నుంచి ఢిల్లీకి భారీగా హెరాయిన్ తరలిస్తుండగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇక ఢిల్లీలో జిమ్ ట్రైనర్ నాదిర్ షాను హత్య చేసిన వారికి జోయా ఖాన్ ఆశ్రయం కల్పించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
జోయా ఖాన్ మాత్రమే కాకుండా ఆమె తల్లిదండ్రులది కూడా నేర సామ్రాజ్యమే అని పోలీసులు వెల్లడించారు. ఇక జోయా ఖాన్ తల్లి సెక్స్ రాకెట్ కేసులో జైలుకు వెళ్లి వచ్చింది. ఆమె తండ్రికి డ్రగ్స్ అక్రమ రవాణా నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. వారికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో కూడా మంచి సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇక తీహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్, హాషీం బాబాలకు సంబంధాలు కుదిరినట్లు తెలుస్తోంది.

# సర్కార్ కీలక నిర్ణయం.. ఇక ఆ ఉద్యోగులకు 60 రోజుల సెలవులు, జీతం కూడా ఇస్తారు

**న్యూఢిల్లీ-నవభూమి:**రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ఆ ఉద్యోగులకు 60 రోజుల సెలవులు ఇవ్వనుంది. ఈ 2 నెలల సెలవుల కాలంలో కూడా ఆ ఉద్యోగులకు జీతం చెల్లించనుంది. అయితే ఇందుకు ఎలాంటి అర్హతలు ఉండాలి. ఇంతకీ ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఏది. ఎలాంటి ఉద్యోగులకు ఈ 60 రోజుల సెలవులు ఇవ్వనున్నారు. అసలు ఆ సెలవులు ఎందుకు ఇస్తున్నారు. అసలు ఈ సంగతేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.హిమాచల్ ప్రదేశ్‌లో అధికారంలో ఉన్న సుఖ్వీందర్ సుఖు నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు అండగా ఉండేందుకు మరో సంచలన నిర్ణయానికి తెరతీసింది. ఇప్పటినుంచి మహిళా ఉద్యోగులకు 60 రోజుల స్పెషల్ మెటర్నిటీ లీవులు మంజూరు చేయనుంది. అయితే ఈ సెలవులు అందరు మహిళా ఉద్యోగులకు మాత్రం కాదని హిమాచల్ ప్రదేశ్ సర్కార్ తేల్చి చెప్పింది. గర్భిణీలకు డెలివరీ సమయంలో పుట్టిన బిడ్డ చనిపోవడం లేదా డెలివరీ తర్వాత బిడ్డను కోల్పోయిన ప్రభుత్వ మహిళ ఉద్యోగులకు ఈ 60 రోజుల ప్రత్యేక ప్రసూతి సెలవును ఉంటుందని స్పష్టం చేసింది.దీనికి సంబంధించి తాజాగా సుఖ్వీందర్ సింగ్ సుఖు సర్కార్ ఉత్తర్వులు వెలువరించింది. అయితే హిమాచల్ ప్రదేశ్‌లో ఒకరు లేదా ఇద్దరు పిల్లలు ఉన్న మహిళా ఉద్యోగులకు ఇప్పటివరకు 180 రోజులు (6 నెలలు) ప్రసూతి సెలవులు ఇస్తున్నారు. అయితే ఈ ప్రసూతి సెలవులకు ఎలాంటి అర్హతలు ఉండాలో.. కొత్తగా ప్రకటించిన ప్రత్యేక ప్రసూతి సెలవులకు కూడా అవే అర్హతలు అని హిమాచల్ సర్కార్ వెల్లడించింది. కానీ ఈ ప్రత్యేక ప్రసూతి సెలవులు మాత్రం డెలివరీ సమయంలో లేదా ఆ తర్వాత పుట్టిన శిశువు చనిపోయిన వారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. అయితే గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో డెలివరీలు చేసుకున్న ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు మాత్రమే ఈ ప్రత్యేక ప్రసూతి సెలవులు వర్తిస్తాయని పేర్కొంది.9 నెలల పాటు కడుపులో మోసిన బిడ్డ.. కళ్లు తెరిచే సమయంలో, తెరిచిన తర్వాత ప్రాణాలు కోల్పోవడం అంటే ఆ తల్లికి.. అంతకుమించిన శోకం ఇంకోటి ఉండదని హిమాచల్ ప్రభుత్వం తెలిపింది. అందుకే అలాంటి తీవ్ర విషాదకరమైన పరిస్థితుల కారణంగా వారికి కలిగే శారీరక, మానసిక బాధ నుంచి బయటికి వచ్చేందుకు ఈ 60 రోజుల స్పెషల్ మెటర్నిటీ లీవ్స్ ఉపయోగపడుతాయని పేర్కొంది.ఈ నిర్ణయం వల్ల ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం భరోసా కల్పించినట్లు అవుతుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా మహిళల ఆరోగ్యం, వారి శ్రామిక శక్తిని ఉపయోగించడంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చెబుతుందని తెలిపాయి. ఇక ఇలాంటి విధానాన్ని తీసుకురావడం ద్వారా మంచి పాలనకు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు అవుతుందని వెల్లడించాయి. ఉద్యోగుల శ్రేయస్సుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని.. వారికి కష్ట సమయాల్లో మద్దతును అందిస్తుందని స్పష్టం చేశాయి.ఇదే కాకుండా మరో కీలక నిర్ణయాన్ని కూడా హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసి.. మన దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చేస్తున్న వారికి పూర్తి జీతాన్ని మంజూరు చేయడం ద్వారా హెల్త్‌కేర్ సెక్టార్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన ముందడుగు వేసిందని హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

# నన్ను తేలిగ్గా తీసుకోవద్దు.. మహారాష్ట్ర అధికార కూటమిలో విబేధాల వేళ షిండే వార్నింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:** మహారాష్ట్ర రాజకీయాలు మరోసారి దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అధికారంలోకి వచ్చి 6 నెలలు కూడా పూర్తి కాకుండానే మహాయుతి కూటమిలో విబేధాలు గుప్పుమంటున్నాయి. మహాయుతి కూటమిలో చీలికలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్న వేళ.. షిండే శివసేన చీఫ్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే సంచలన వ్యాఖ్యలకు తెరలేపారు. తనను తేలిగ్గా తీసుకోవద్దని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. షిండే వర్గం ఎమ్మెల్యేలకు భద్రత తగ్గింపు, సెక్రటేరియట్‌లో వేర్వేరు హెల్త్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవడంతో షిండే శివసేనకు, బీజేపీకి కోల్డ్ వార్ నడుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తగా.. తాజాగా ఏక్‌నాథ్ షిండే చేసిన వ్యాఖ్యలు తీవ్ర ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీంతో మహారాష్ట్ర రాజకీయాల్లో మళ్లీ సంచలన ట్విస్ట్‌లు జరుగుతాయా అని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.అయితే ఇటీవలి కాలంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నిర్వహిస్తున్న సమావేశాలకు ఏక్‌నాథ్ షిండే దూరంగా ఉంటుండటంతో.. మహాయుతిలో విబేధాలు తలెత్తాయంటూ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ జరిగింది. ఈ నేపథ్యంలోనే 2022లో శివసేన పార్టీని చీల్చి ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా ఉన్న మహా వికాస్ అఘాడీ కూటమి ప్రభుత్వాన్ని పడగొట్టిన విషయాన్ని ఏక్‌నాథ్ షిండే తాజాగా మరోసారి గుర్తు చేశారు. మహాయుతి కూటమిలో విభేదాలు తీవ్రమయ్యాయని ఊహాగానాలు వినిపిస్తున్న వేళ ఆయన చేసిన వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి.
ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండే ఉన్న సమయంలో ఆమోదం కల్పించిన ఓ ప్రాజెక్టును తాజాగా ముఖ్యమంత్రి పదవి చేపట్టిన దేవేంద్ర ఫడ్నవీస్ నిలిపివేసిన నేపథ్యంలో.. తనను తేలిగ్గా తీసుకోవద్దని షిండే హెచ్చరించారు. తాను ఒక సాధారణ పార్టీ కార్యకర్తను అని.. అంతేకాకుండా బాబాసాహెబ్ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తిని అని పేర్కొన్న షిండే.. ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరు అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. 2022లో ఉద్ధవ్ ఠాక్రే సీఎంగా ఉన్న సమయంలో తనను అందరూ తేలిగ్గా తీసుకున్నప్పుడు.. ప్రభుత్వాన్ని పడగొట్టానని స్వయంగా మీడియా ముందు ఏక్‌నాథ్ షిండే వెల్లడించారు.ఆ తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీలో చేసిన మొదటి ప్రసంగంలో మహాయుతి కూటమికి 2024 ఎన్నికల్లో 200 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని తాను చెప్పానని.. తుది ఫలితాల్లో 232 సీట్లు వచ్చినట్లు గుర్తు చేశారు. అందుకే తనను తేలిగ్గా తీసుకోవద్దని.. అయితే ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేస్తున్నానో వాళ్లు అర్థం చేసుకుంటారని అనుకుంటున్నట్లు ఏక్‌నాథ్ షిండే వెల్లడించారు.
మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమావేశాలకు ఏక్‌నాథ్ షిండే హాజరుకావడం లేదని ఇటీవల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అంతేకాకుండా షిండే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు భద్రతను తొలగించడంతోపాటు.. మహారాష్ట్ర సచివాలయంలో బీజేపీ, షిండే శివసేన వేర్వేరుగా వైద్య సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడంతో ఫడ్నవీస్, షిండే మధ్య దూరం మరింత పెరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఊహాగానాలపై ఇటీవలే స్పందించిన షిండే.. తనకు సీఎం ఫడ్నవీస్‌తో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. అయితే మహారాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే వారితోనే తన పోరాటం కొనసాగిస్తానని వెల్లడించారు.

# పంట పొలాల్లో ఎన్నారై జంట పెళ్లి.. పెద్ద కారణమే ఉంది, అసలు విషయం ఏంటంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** సాధారణంగా పెళ్లి అంటే మామూలు హడావుడి ఉండదు. వేసుకునే బట్టల దగ్గర నుంచి.. పెళ్లి పందిరి, లైటింగ్, డీజే, హంగు ఆర్భాటాలు సాధారణంగా ఉండవు. ఇక విదేశాల్లో ఉండేవారు పెళ్లి కోసం స్వదేశానికి వచ్చి.. లక్షలు, కోట్ల రూపాయలు కూడా ఖర్చు చేస్తుండటం మనం చూస్తూనే ఉన్నాం. డెస్టినేషన్ వెడ్డింగ్స్ అంటూ ఎక్కడెక్కడికో వెళ్లి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. ఇక కొంతమంది అయితో సముద్రంలో పడవపై వెళ్తూ.. ఆకాశంలో విమానంలో ప్రయాణిస్తూ పెళ్లిళ్లు కానిస్తున్నారు. కానీ ఈ ఎన్నారై జంట మాత్రం.. ఫంక్షన్ హాల్‌లో కాకుండా పంట పొలాల్లో పెళ్లి చేసుకుని.. అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే వారు ఏదో సాధారణంగా తీసుకున్న నిర్ణయం కాదు. దాని వెనుక పెద్ద స్టోరీ ఉంది. పంజాబ్‌లో జరిగిన ఈ పెళ్లికి సంబంధించిన వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.పంజాబ్ ఫిరోజ్‌పూర్ జిల్లాలోని కారీకలాన్ గ్రామంలో బుధవారం ఒక పెళ్లి జరిగింది. అయితే ఈ పెళ్లి ఊరిలో కాకుండా గ్రామ శివార్లలో ఉన్న పంట పొలాల్లో నిర్వహించారు. పచ్చని పొలాల్లో టెంట్లు వేసి.. వాటికి రంగురంగుల లైట్లు పెట్టారు. బంధుమిత్రుల సమక్షంలో దుర్లభ్ సింగ్, హర్మన్ కౌర్ అనే జంట ఒక్కటైంది. అయితే అంతకుముందు వధువు హర్మన్ కౌర్ భారీ ఊరేగింపుతో వరుడు దుర్లభ్ సింగ్ ఇంటికి చేరుకుంది. అక్కడి నుంచి వారు ఊరి బయట పొలాల్లో ఏర్పాటు చేసిన పెళ్లి మండపానికి చేరుకున్నారు.
అయితే కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న దుర్లభ్ సింగ్, హర్మన్ కౌర్.. స్వదేశానికి వచ్చి ఇలా పెళ్లి చేసుకుని ఆదర్శవంతంగా నిలిచారు. అయితే పంట పొలాల్లో పెళ్లి చేసుకోవడం వెనుక.. రైతుల సమస్యలను ప్రపంచానికి తెలియజేయాలనే సదుద్దేశం ఉన్నట్లు ఆ జంట చెప్పింది. పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని.. ఢిల్లీ సరిహద్దుల్లో ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి అన్నదాతలు ఏళ్ల తరబడి చేస్తున్న ఆందోళనలు చూసి.. వారి పరిస్థితిని అర్థం చేసుకుని తాము ఇలా పంట పొలాల్లో పెళ్లి చేసుకున్నట్లు దుర్లభ్ సింగ్, హర్మన్ కౌర్ జంట వెల్లడించింది.ఇక పంట పొలాల్లో ఏర్పాటు చేసిన పెళ్లి మండపాన్ని రకరకాల మొక్కలతో అలంకరించారు. పెళ్లి తంతు పూర్తి అయిన తర్వాత ఆ మొక్కలను వచ్చిన బంధువులు, అతిథులకు పంపిణీ చేశారు. అదేవిధంగా రైతుల నినాదాలు ముద్రించిన స్వీట్ బాక్సులను అందరికీ పంచిపెట్టారు. ఇక రైతులు ఉత్పత్తి చేసిన తేనె సీసాలను అందరికీ అందజేశారు. ఇక ఈ పెళ్లికి సంబంధించిన వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. రైతుల ఆందోళనలను ఆదర్శంగా తీసుకున్న దుర్లభ్ సింగ్, హర్మన్ కౌర్ జంట.. పంట పొలాల్లో పెళ్లి చేసుకున్న విషయం తెలుసుకుని వారి జంటను నెటిజన్లు అభినందిస్తున్నారు.

# పెళ్లైన వెంటనే ప్రియుడితో నవవధువు జంప్.. రిసెప్షన్‌కు ముందు బ్యూటీపార్లర్‌కు వెళ్లొస్తానని..!



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇటీవలి కాలంలో పీటల మీద పెళ్లిళ్లు ఆగిపోతుండటం చూస్తూనే ఉన్నాం. వధువు లేదా వరుడు.. పెళ్లికి ముందే వేరొకరిని ప్రేమించి.. పెద్దల బలవంతంతో పెళ్లి పీటలపై కూర్చుంటున్నారు. ఈ క్రమంలోనే ఏ చిన్న అవకాశం దొరికినా.. తాళి కట్టే సమయంలో కూడా పెళ్లిని పెటాకులు చేసి.. తాము ప్రేమించినవారితో వెళ్లిపోతున్నారు. అయితే కొంతమంది పెళ్లి అయిన తర్వాత కూడా.. తాము ప్రేమించిన వారిని విడిచి ఉండలేక.. పెళ్లి చేసుకున్న వారిని వదిలేసి.. ప్రేమించిన వారితో పారిపోతున్నారు. కానీ ఈ ఘటనలో పెళ్లి చేసుకున్న యువతి.. రిసెప్షన్ కంటే ముందే తన బాయ్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోవడం సంచలనంగా మారింది. అయితే పెళ్లి అయిన తర్వాత బయటికి వెళ్లేందుకు ఆ నవవధువు.. బ్యూటీపార్లర్‌కు వెళ్తున్నా అని నాటకం ఆడింది. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఈ సంఘటన ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది.మధ్యప్రదేశ్‌లోని గంజ్‌బసోడా జిల్లాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. టిటినగర్‌కు చెందిన ఆశిష్ రాజక్‌కు, గంజ్‌బసోడాకు చెందిన రోష్ని సోలంకికి పెళ్లి కుదిరింది. ఈ క్రమంలోనే మంగళవారం వారిద్దరి పెళ్లి అంగరంగ వైభవంగా కుటుంబ సభ్యులు నిర్వహించారు. అనంతరం పెళ్లి కుమార్తెను వరుడి ఇంటికి తీసుకెళ్లారు. బుధవారం రోజున వారిద్దరికీ రిసెప్షన్ చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే తాను మేకప్ అయ్యేందుకు బ్యూటీపార్లర్‌కు వెళ్లి వస్తానని చెప్పి వరుడి ఇంటి నుంచి బయటికి వెళ్లింది. కానీ ఆమె ఎంతకూ తిరిగిరాకపోవడంతో.. భర్త, అత్తింటివారు వెతికారు. చివరికి ఆమె కిడ్నాప్ అయిందని.. టిటి నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
అయితే కేసు నమోదు చేసి రంగంలోకి దిగిన పోలీసులు.. జరిగిన విషయం తెలిసి అవాక్కయ్యారు. తన భార్య రోష్ని సోలంకిని ఎవరో కొంతమంది వచ్చి బలవంతంగా కారులో ఎక్కించుకుని వెళ్లారని భర్త ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా తన పెళ్లి రోజున గంజ్‌బసోడాలో తన కారు నాలుగు టైర్లను ఎవరో పంక్చర్ చేశారని కూడా చెప్పాడు. ప్రాథమిక విచారణ ప్రకారం ఆ నవవధువు స్వయంగా కారులోకి ఎక్కి వారితో కలిసి పారిపోయినట్లు తేలింది. దీంతో ఆమె కాల్ రికార్డులు సేకరించగా.. ఆమె ఇంటి పక్కనే ఉండే అనికేత్ మాలవీయతో ప్రేమాయణం నడిపినట్లు గుర్తించారు. అయితే రిసెప్షన్ జరిగే బుధవారం రోజున కూడా రోష్ని సోలంకి, అనికేత్ మాలవీయతో చాలాసార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు.దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పారిపోయిన రోష్ని సోలంకి, అనికేత్ మాలవీయల జాడ కోసం వెతుకుతున్నారు. ఇందుకోసం రెండు టీమ్‌లు సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం రోజున రోష్ని సోలంకి ఒక ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ చేసింది. అందులో అసలు విషయాలు వెల్లడించింది. తాను అనికేత్ మాలవీయను ప్రేమిస్తున్నానని.. ముందుగానే తన తల్లిదండ్రులకు చెప్పానని.. అయితే వారు తమకు పెళ్లి చేయకుండా ఆశిష్ రాజక్‌కు ఇచ్చి పెళ్లి జరిపించారని పేర్కొంది. తనకు ఆశిష్ రాజక్‌ను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని తెలిపింది. ఈ క్రమంలోనే తనకు, తన ప్రియుడికి భద్రత కల్పించాలని కోరింది.

# పదో తరగతి పరీక్షల్లో “చీటింగ్” గొడవ.. కాల్పులు జరిపిన విద్యార్థులు, ఒకరి మృతి!



**న్యూఢిల్లీ-నవభూమి:**పదో తరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందంటూ ఆరోపణలు రాగా.. విద్యార్థుల మధ్య గొడవ చెలరేగింది. తరగతి గదిలోని విద్యార్థులంతా రెండు గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్నారు. ఈక్రమంలోనే పలువురు తుపాకీలతో కాల్పులకు తెగబడగా.. ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. ఇందులో ఓ బాలుడు చనిపోయాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు విద్యార్థి మృతదేహాన్ని తీసుకుని రోడ్డుపై బైఠాయించారు. తమకు న్యాయం జరిగే వరకు అక్కడ నుంచి కదలమంటూ నిరసన చేస్తున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.బిహార్‌లోని రోహ్‌తాస్ జిల్లా సాసారామ్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి బోర్డు పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఫిబ్రవరి 17వ తేదీన ఈ పరీక్షలు ప్రారంభం కాగా.. 25వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా.. సాసారామ్ పట్టణ విద్యార్థులు సైతం అక్కడి పరీక్షా కేంద్రలోనే పరీక్షలకు హాజరు అవుతున్నారు. అయితే 19వ తేదీ బుధవారం రోజు పరీక్ష జరుగుతుండగా.. పలువురు విద్యార్థులు చీటింగ్‌కు పాల్పడ్డారంటూ కొందరు విద్యార్థులు ఫిర్యాదు చేశారు.
అవన్నీ తప్పుడు వార్తలని, తాము చీటింగ్‌కు పాల్పడలేదంటూ మరికొంత మంది విద్యార్థులు చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే విద్యార్థుల మధ్య గొడవ ప్రారంభం అయింది. అయితే పరీక్ష అనంతరం చప్పుడు చేయకుండా ఇళ్లకు వెళ్లిపోయన పిల్లలు.. మరుసటి రోజు అంటే గురువారం రోజు రెండు గ్రూపులుగా విడిపోయిన భౌతిక దాడులు చేసుకున్నారు. ఈక్రమంలోనే కొందరు విద్యార్థులు తుపాకీలతో కాల్పులకు తెగబడ్డారు. దీంతో శంభుబిఘా గ్రామానికి చెందిన మంజు యాదవ్ కుమారుడు అమిత్ కుమార్, కమలేష్ సింగ్ కుమారుడు సంజీత్ కుమార్, అమిత్ కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు.ఈ గుర్తించిన స్థానికులు వీరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి పంపించారు. ప్రస్తుతం వీరు చికిత్స పొందుతుండగా.. ఇందులో ఓ అమిత్ కుమార్ ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరి పరిస్థితి కాస్త నిలకడానే ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. కానీ కుమారుడి మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు బాలుడి మృతదేహాన్ని తీసుకుని ధర్నా చేశారు. జీటీ రోడ్డులోని ఆరవ లేన్‌పై బైఠాయించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఫలితంగా పెద్ద ఎత్తున వాహన రాకపోకలు ఆగిపోగా.. పోలీసులు రంగ ప్రవేశం చేశారు.నిందితులను అరెస్ట్ చేస్తామని, న్యాయం చేస్తామని వారికి నచ్చజెప్పారు. ఇలా గంటన్నర సేపు స్తంభించిన ట్రాఫిక్ ను యధావిధిగా కొనసాగించేలా చేశారు. అలాగే ఈ కేసు నిందితుల్లో ఒకరైన బాలుడు సుమిత్ కుమార్‌ను ఇప్పటికే అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి తుపాకీని కూడా స్వాధీనం చేసుకున్నారు. మరికొందరిని పట్టుకోవడం కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ రోషన్ కుమార్ తెలిపారు.

# 24 గంటలైనా కాలేదు.. అప్పుడే విమర్శలా?: అతిశీ కామెంట్లపై ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ఫైర్



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశరాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రిగా తాను పదవీ బాధ్యతలు స్వీకరించి ఒక్క రోజు కూడా గడవకముందే ఆప్ నేతలు విమర్శలు చేయడంపై రేఖా గుప్తా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాను పదవిలోకి వచ్చి 24 గంటలు కూడా గడవకముందే క్యాబినెట్ సమావేశం జరిపినట్లు వెల్లడించారు. కానీ 15 ఏళ్లు కాంగ్రెస్, 13 ఏళు ఆప్ ఢిల్లీని పాలించి ఏం చేశారో చెప్పాలంటూ ప్రశ్నించారు. తమపై విమర్శలు చేసే స్థాయిలో ఆమ్ ఆద్మీ పార్టీ లేదని.. వారి గురించి వాళు చూసుకుంటే చాలంటూ తెలిపారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.
ఢిల్లీ కొత్త సీఎం రేఖా గుప్తా అధికారంలోకి వచ్చి కొన్ని గంటలు కూడా కాకముందే.. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఆప్ ఎమ్మెల్యే అయిన అతిశీ.. బీజేపీ ఎన్నికల వాగ్దాలనాలను నెరవేర్చలేదంటూ విమర్శలు చేశారు. దీనిపై తాజాగా సీఎం రేఖా గుప్తా స్పందించారు. 24 గంటలు కూడా గడవకముందే ఇలాంటి ఆరోపణలు ఎలా చేస్తారంటూ ప్రశ్నించారు. అంతేకాకుండా కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆమ్ ఆద్మీ పార్టీ 13 సంవత్సరాలు పాలించి ఢిల్లీకి ఏం చేశారో చెప్పాలని అడిగారు. మొదటి రోజే తాను క్యాబినెట్ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.ఢిల్లీలో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కారు ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ ఎమ్మెల్యే అతిశీ విమర్శించారు. ఢిల్లీ మహిళలను కాషాయ దళం మోసం చేస్తుందని.. మొదటి రోజే కేబినెట్ సమావేశంలోనే మహిళలకు రూ.2500 ఇచ్చే పథకాన్ని ఆమోదిస్తామని బీజేపీ చెప్పినట్లు గుర్తు చేశారు. ఎన్నికల ముందు చెప్పిన ఈ మాటను ప్రస్తుత సీఎం మర్చిపోయినట్లున్నారంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. దీనిపై తాజాగా ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్పందించారు.
తాను అధికార బాధ్యతలు చేపట్టి 24 గంటలు కూడా కాలేదని.. ఇప్పుడే అలాంటి విమర్శలు ఎలా చేయగల్గుతారంటూ ప్రశ్నించారు. మాజీ సీఎం అతిశీ పేరు చెప్పకుండానే.. ఆమ్ ఆద్మీ పార్టీకి తమను విమర్శించే హక్కు లేదన్నారు. తొలి రోజే కాబినెట్ సమావేశం పెట్టి ఆయుష్మాన్ భారత్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. దాంతో పేద ప్రజలకు 10 లక్షల రూపాయల మేర వైద్య సహాయం అందబోతుందన్నారు. అంతేకాకుండా ఆప్ ఈ పథకాన్ని అమలు చేయలేదని గుర్తు సీఎం రేఖా గుప్తా గుర్తు చేశారు.
డబుల్ ఇంజిన్ సర్కారుతో బీజేపీ ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేరుస్తుందని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అయిన మార్చి 8వ తేదీ నాటికి అర్హులైన మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఢిల్లీ అభివృద్ధి కోసం బీజేపీ నిరంతరం కృషి చేస్తుందని.. ఒక్క రోజు కూడా వృథా చేయకుండా పాలన అందిస్తామని అన్నారు. అంతేకాకుండా ఆప్ తమ పార్టీ గురించి పట్టించుకుంటే చాలని.. బీజేపీపై విమర్శలు చేయాల్సిన అవసరం లేదన్నారు.ఎంతో మంది నేతలు ఆమ్ ఆద్మీ పార్టీని వీడాలనుకుంటున్నారని.. కాగ్ రిపోర్టును అసెంబ్లీలో పెడితే అందరి జాతకాలు బయట పడతాయని తీవ్ర ఆందోళన చెందుతున్నారని ముఖ్యమంత్రి రేఖా గుప్తా వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ రిపోర్టులను అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ప్రవేశ పెడతామని ఇప్పటికే బీజేపీ ప్రకటించింది.

# 498.. వరకట్నం సెక్షన్ మాత్రమే కాదు!

**న్యూఢిల్లీ-నవభూమి:**భర్త, అత్తింటివారి నుంచి వివాహితలకు రక్షణ ఛత్రంగా తీసుకువచ్చిన ఐపీసీ ‘సెక్షన్ 498’లో అన్ని రకాల వేధింపులను ఇమిడ్చారని సుప్రీంకోర్టు పేర్కొంది. భర్తలపై క్రూరత్వ అభియోగాలు మోపడానికి ‘వరకట్నం డిమాండ్’ అవసరం లేదని పేర్కొంది. ఐపీసీ సెక్షన్ 498ఏ కింద వరకట్నం డిమాండ్ చేయడాన్ని ప్రత్యేక నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలేతో కూడిన ధర్మాసనం గత ఏడాది డిసెంబరు 12న వ్యాఖ్యానించింది. ఐపీసీ సెక్షన్ 498ఏలోనే క్రూరత్వ చర్యలు ఇమిడి ఉన్నాయని, భర్త, అత్తమామలపై ఈ సెక్షన్‌ను అమలు చేయడానికి అదనంగా వరకట్నం డిమాండ్‌ను జోడించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. భార్యలపై జరిగే క్రూరత్వం ఏ రూపంలో ఉన్నా అది 498 సెక్షన్ కింద శిక్షార్హమైందేనని పేర్కొంది. సెక్షన్ 498ఏ, బీ క్లాజులలో అంశాలు ఎలాంటి వేధింపులకైనా వర్తిస్తాయని స్పష్టం చేసింది. క్లాజ్-ఏ ప్రకారం.. భార్యను శారీరకంగా, మానసికంగా హింసించడం, క్లాజ్-బీ ప్రకారం.. భార్య లేదా ఆమె పుట్టింటి వారి నుంచి చట్టవిరుద్ధమైన డిమాండ్‌ను(అదనపు కట్నం, కానుకలు వంటివి) బలవంతంగా నెరవేర్చుకునేందుకు చేసే వేధింపులు వర్తిస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో సెక్షన్ 498ను ప్రవేశ పెట్టిన సందర్భంగా పార్లమెంటులో చేసిన ప్రకటనను కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ శనివారం 22 । ఫిబ్రవరి । 2025





## స్థల పురాణం మూలాలతో తవ్వకాలు.. బయటపడింది చూసి షాక్..!

**తమిళనాడు-నవభూమి:** తమిళనాడులో చోళులు పల్లవుల పరిపాలనలో అద్భుతమైన కళాఖండాల నిర్మాణం జరిగింది. దక్షిణాదిన తమిళనాడులో ఎక్కువగా ఈ పురాతన కట్టడాలు ఆలయాలు ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే..! వేల సంవత్సరాల క్రితం జరిగిన ఆ నిర్మాణాలు ఇప్పటికీ చాలా చోట్ల చెక్కుచెదరకుండా నాటి కళా వైభవాన్ని చాటి చెబుతున్నాయి. అప్పట్లో ఎలాంటి సాంకేతికత లేకుండా జరిగిన నిర్మాణాలు ఇప్పటికీ అబ్బురపరుస్తూ ఉంటాయి. తమిళనాడులో ఇటీవల కాలంలో పురావస్తు శాఖ అధికారులు జరిపిన తవ్వకాల్లో చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు అనేకం బయటపడ్డాయి. చరిత్రలో తెలిపిన వివరాల ప్రకారం జరిపిన తవ్వకాల్లో వాటి అవశేషాలను గుర్తించిన ఆర్కియాలజీ అధికారులు వాటిపై ఇంకా పరిశోధనలు సాగిస్తూనే ఉన్నారు. తాజాగా ఇలాంటి పురాతన నిర్మాణాలకు సంబంధించిన సమాచారంతో తవ్వకాలు జరిపితే మరోసారి చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు బయటపడ్డాయి. తిరువళ్లూరు సమీపంలో చోళుల కాలంలో నిర్మించిన మురుగన్ ఆలయంలో ఒక సొరంగం ఉన్నట్లు పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. తవ్వకాల్లో బయటపడ్డ ఈ సొరంగంపై తమిళనాడులో ఆసక్తిగా మారింది. తిరువళ్లూరుకు సమీపంలో ఉన్న పట్టరైపెరుమంతూర్‌లో కులుత్తుంగ చోళరాజుల పాలనలో నిర్మించిన ప్రాచీన మురుగన్ ఆలయం ఉంది. ఈ ఆలయం పదవ శతాబ్దానికి చెందినదిగా స్థలపురాణంలో ఉంది. తిరువళ్లూరు జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ముఖ్యమైన రోజులలో ఈ ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది.




## వర్గీకరణ సమస్య కుల నిర్మూలన దృక్పథం

రాజ్యం అందులో భాగమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి నుండి రిజర్వేషన్లను అమలు చేయడంలో గాని, వెనుకబడిన కులాలకు ఫలాలు అందించడంలో గాని పూర్తిగా విఫలమయ్యారు. కనుక అందరికీ సమాన అవకాశాలు కల్పించినా అన్ని కులాలు సమానంగా అవకాశాలను అందుకోలేదు. దీనికి పాలక కులాల దీర్ఘకాలిక నిర్లక్ష్యం తోడైంది. ఈ అణగారిన కులాలను ఓటు బ్యాంకుగా పరిగణించి, రాజకీయ స్వార్థంతో రాజ్యాంగబద్ధంగా రావలసిన వాటాలను అందించలేదు. ఉదాహరణకు రిజర్వేషన్లు ఉపయోగించుకోవడానికి విద్య అత్యంత కీలకమైనది. ఇందులో ఉన్న అన్ని కులాలకు పాఠశాల విద్య, కాలేజీ విద్య, యూనివర్సిటీ విద్య, సాంకేతిక విద్య అందించకుండా, విద్యా సంస్థలను వారికి అందుబాటులోకి తేకుండా జాగ్రత్త పడ్డారు. ఫలితంగా అత్యధికంగా వెనుకబడిన కులాలకు విద్యయే లేకుండా పోయింది. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా విద్యను కొంతమందికే గాని అందరికీ అందే విధంగా చూడకుండా దానిని ఎన్నికల స్వార్థ రాజకీయాలకు ఉపయోగపడేలా చేశారు. అంతేగాని అది ఒక రాజ్యాంగపరమైన సామాజిక న్యాయంగా పరిగణించ లేదు. ఫలితంగా మెజారిటీ కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయి. అయితే ఈ అణగారిన కులాలలో చారిత్రకంగా ముందంజలో ఉన్న కొన్ని కులాలలోని కొంతమంది ఎంతో కొంత విద్యావకాశాలను, ఉద్యోగావకాశాలను పొందడం సహజం.

ఇలా కొంత ప్రయోజనం పొందినవాళ్లను స్వార్థ రాజకీయ పార్టీలు, ప్రభుత్వ రంగ సంస్థల అధిపతులు తమ స్వార్థం కోసం వాడుకొని రిజర్వేషన్లను పూర్తిగా అమలు చేయకుండా, అత్యంత వెనుకబడిన పీడిత కులాలకు చేరకుండా, ఆయా కులాలలో కూడా అత్యధికంగా వెనుకబడిన కుటుంబాలకు చేరకుండా చూశారు. ప్రభుత్వాలు ఐదేళ్ళకు ఒకసారైనా రిజర్వేషన్ల అమలు గురించి సమీక్ష జరపకుండా, రిజర్వేషన్లు పొందిన వాళ్లలో కొద్ది మందిని తమకు ఊడిగం చేసే విధంగా తయారు చేసుకున్నారు. ఫలితంగా ఫలాలు పొందిన వాళ్ళలో చాలామంది తమ సొంత ప్రయోజనాల కోసం తమ సంబంధిత కులాలనే కాకుండ తమ కులంలోని వెనుకబడిన కుటుంబాలను గాలికి వదిలేసారు. పూలే, అంబేడ్కర్, పెరియార్ ఆలోచనల ప్రకారం రిజర్వేషన్ల విధానం కులరహిత సమాజం కోసం అన్ని రకాల అసమానతలు లేని సమసమాజం నిర్మాణ దిశగా నడవాలి. కాని పాలకులు ఈ విధానాన్ని కుల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా దిగజార్చారు. నిజానికి రిజర్వేషన్లు పొందిన వ్యక్తులు రెండు రకాల పోరాటాలు చేయవలసి ఉన్నది. ఒకటి వారు పని చేస్తున్న సంస్థలలో అణగారిన కులాలకు ప్రాతినిధ్యం, జనాభా దామాషా ప్రకారం పెంచటానికి చేయవలసిన పోరాటం. రెండవది పౌర సమాజంలో అణగారిన కులాల పైన ఆధిపత్య కులాలు సాగిస్తున్న దోపిడీ, దౌర్జన్యాలు, హత్యలకు వ్యతిరేకంగా జరపవలసిన పోరాటంలో వీలైన చోట ప్రత్యక్షంగా, కానిచోట పరోక్షంగా పాల్గొని, ఇతరులను పాల్గొనే విధంగా చైతన్య పరిచే పోరాటం. ముందు వరుసలో ఉండి రిజర్వేషన్లు పొందిన వ్యక్తులు ఈ రెండు పోరాటాలు అవసరం ఉన్నంత మేరకు చేయలేదు. కొంత మేరకు సైద్ధాంతిక, రాజకీయ పోరాటం చేసి అణగారిన కులాలను ఐక్యం చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉత్తరప్రదేశ్‌లో కూడా ఈ సమస్యను పరిష్కరించలేదు. ఆంధ్రప్రదేశ్‌లోని కారంచేడు, చుండూరు కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటం చేసి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాల్ని సాధించుకున్న దళిత ఉద్యమం కూడా ఈ సమస్యను పరిష్కరించుకోలేకపోయింది. దేశ వ్యాపితంగా పెద్ద ఎత్తున ఒక ఉద్యమంగా ఈ జమిలి పోరాటాలు చేయకపోవడం వలన ఈ అణగారిన కులాల్లో రిజర్వేషన్లు పొందటంలో కుల అసమానతలు మరింత పెరిగాయి. స్వాతంత్ర్యానంతరం రాజ్యాధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కాని తర్వాత కాలంలో కాంగ్రెస్ నాయకత్వంలో నడిచిన యూపీఏ ప్రభుత్వం కాని, భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో నడుస్తున్న ఎన్‌డిఏ ప్రభుత్వం కాని మనువాద దృక్పథంతో ఈ వ్యక్తులను జమిలి పోరాటాలు చేయకుండా చాలా జాగ్రత్త వహించి, కొద్ది మంది వ్యక్తులనే అణగారిన కులాల ప్రతినిధులుగా చిత్రీకరించి, వీరిలో అట్టడుగున ఉన్న కులాలకు రిజర్వేషన్ ఫలాలు అందకుండా చేశారు. ఈ కులాలలో అసమానతలు పెంచి, వైరుధ్యాలు సృష్టించి వాళ్ల ముందున్న కులాలను పీడకులుగా, వెనకబడ్డ కులాలను పీడితులుగా చిత్రీకరించి, పీడితులనే శత్రువులుగా చూపించి తమాషా చూస్తున్నారు. అంతే కాకుండా రిజర్వేషన్లను అంతమొందించే సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను తీసుకొచ్చిన పాలకులు వీరిని మద్దతు ఇచ్చే విధంగా తయారుచేసి పావులుగా వాడుకుంటున్నారు. ఇప్పటికైనా పీడిత కులాలు ఈ మనువాద పార్టీల కుట్రలకు, కుయుక్తులకు బలి కాకుండా ఈ సమస్యను ప్రజాస్వామికంగా, సామాజిక న్యాయ ప్రాతిపదికన పరిష్కరించుకోవాలి. ఇప్పుడు రాజ్యాంగపరంగానైనా అణగారిన కులాలు సంఘటితమై జనాభా దామాషా ప్రకారం పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని పెంచుకోవాలి. ఇది దేశవ్యాప్తంగా జరగటానికి రాజ్యాంగంలో అవసరమైన సవరణలు తీసుకురావడానికి పోరాటం చేసి మరింత సంఘటితమై రాజ్యాధికారం కోసం పోరాడాలి. అయితే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో తలెత్తిన వర్గీకరణ సమస్య పరిష్కారానికై భేషజాలకు పోకుండా కావలసిన గణాంకాలు, సమాచారం ప్రాంతాల వారీగా నిజాయితీగా, నిష్పక్షపాతంగా సేకరించాలి. ఈ సమస్య పరిష్కారం కొరకై కొన్ని ప్రతిపాదనలు మేము చర్చ కోసం మీముందు పెడుతున్నాం. మొదటి పద్ధతి: 1) ఇప్పటికీ బడి ముఖం చూడని, ఎటువంటి ఉద్యోగాలు పొందని అత్యంత వెనుకబడిన కులాలను ఒక ప్రత్యేక సమూహంగా లేదా గ్రూపుగా ఏర్పాటు చేసి వీరికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. 2) ఎస్సీ కులాలలో ఇప్పటికే కొద్ది తేడాలతో రిజర్వేషన్ల ప్రతిఫలాలను అనుభవిస్తున్న మాల మాదిగ కులాలను ఒక సమూహంగా లేదా గ్రూపుగా చేసి వీరికి రెండవ ప్రాధాన్యత ఇవ్వాలి. రెండవ పద్ధతి: 1) అత్యధికంగా వెనుకబడిన, మాదిగ అనుబంధ కులాలను ఒక సమూహంగా లేదా గ్రూపుగా చేసి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. 2) అలాగే అత్యధికంగా వెనుకబడిన మాల అనుబంధ కులాలను ఒక సమూహంగా లేదా గ్రూపుగా చేసి రెండవ ప్రాధాన్యత ఇవ్వాలి. 3) మాదిగ కులాన్ని ఒక గ్రూపుగా చేసి మూడవ ప్రాధాన్యత ఇవ్వాలి. 4) అలాగే మాల కులాన్ని ఒక గ్రూపుగా చేసి నాలుగవ ప్రాధాన్యత ఇవ్వాలి.

అయితే ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. అంటరానితనం, కులపీడనే రిజర్వేషన్లకు క్రైటేరియా అనేది మరిచి పోకూడదు. ఇప్పటివరకూ రిజర్వేషన్ల ద్వారా కొన్ని షెడ్యూల్డ్ కులాలు ఆర్థికంగా, రాజకీయంగా విద్య, ఉద్యోగ రంగాలలో ఎంతో కొంత మేరకు అభివృద్ధి చెందిన ఒక సమూహం ముందుకు వచ్చింది.

# మనిషిని యంత్రంగా మారుస్తారా?




జనవరి తొమ్మిదిన రెండు వార్తలు ఉద్యోగ-, శ్రామిక రంగాల్లో పెద్ద దుమారాన్ని రేపాయి. మొదటిది, కృత్రిమ మేధ (ఏఐ) తదితర ఆధునిక సాంకేతిక ఆవిష్కరణల వల్ల దాదాపు 93 మిలియన్ల మంది ఉద్యోగులు సామూహిక స్థానభ్రంశానికి గురి కాబోతున్నారనేది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్లుఇఎఫ్) 'ఉద్యోగుల భవిష్యత్తు' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ హెచ్చరికను చేసింది. రెండోదిబీ లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ) చైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ 90 గంటల పని వారాన్ని అమలు చేయాలని ప్రతిపాదించారు అనేది.

సుబ్రమణ్యన్ ఒక ఆంతరంగిక సమావేశంలో యథాలాపంగా అన్న మాటల్ని పట్టించుకోవాల్సిన పనిలేదని ఆ సంస్థ ప్రతినిధులు అంటున్నారు. సుబ్రమణ్యన్ మాట్లాడింది ఒక విధానానికి సంబంధించిన అంశం కనుక ఎక్కడ అన్నారూ అనేదానికన్నా ఏమన్నారూ అనేదే ప్రధానం. సుబ్రమణ్యన్ ప్రతిపాదన ప్రకారం వారానికి ఏడు పనిదినాలయితే రోజుకు 13 గంటలు పనిచేయాలి. ఆరు పనిదినాలయితే రోజుకు 15 గంటలు పనిచేయాలి. ఐదు పనిదినాలయితే రోజుకు 18 గంటలు పనిచేయాలి. గతంలో ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి కూడ 70 గంటల పనివారాన్ని ప్రతిపాదించారు. వారి ఉద్దేశ్యం కూడా సిబ్బందితో రోజుకు 14 గంటలు పని చేయించాలనే. కార్మిక సంఘాలు, సామ్యవాదులు మాత్రమే గాక మానవతావాదులు, సామాన్యులు సహితం ఇలాంటి ప్రతిపాదనల్ని సహజంగానే తీవ్రంగా వ్యతిరేకిస్తారు. నిజానికి ఈ రెండు వార్తలూ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. మొదటిది ఉన్న ఉద్యోగాలే ఊడిపోతాయి అంటుంటే, రెండోది, శ్రామికులు మరిన్ని అదనపు గంటలు పనిచేయాలంటున్నది. ప్రత్యర్థుల నోరు మూయించడానికి మన ఏలినవారు ఇటీవలి కాలంలో దేశభక్తిని తిరుగులేని ఆయుధంగా వాడుతున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీలు విడుదల చేసే కాలుష్యానికి వ్యతిరేకంగా స్థానికులు ఆందోళన చేస్తుంటే, వాళ్ళ నోళ్లు మూయించడానికి కూడా దేశభక్తిని ముందుకు తెస్తున్నారు. శిలాజ ఇంధనమైన ముడి చమురును దిగుమతి చేసుకోవడానికి భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని చెల్లించి దేశం అప్పుల పాలవుతున్నదనీ, ఇథనాల్ వంటి జీవ ఇంధనాలను ఇక్కడే తయారు చేస్తే దేశం మీద రుణభారం తగ్గుతుందనీ ఆ వాదన సారాంశం. పని గంటల విషయం లోనూ ఇదే వాదన. మన దేశం చైనాను అధిగమించాలంటే భారత ఉద్యోగులు-, శ్రామికులు అధికంగా శ్రమించాలంటున్నారు. భారతదేశ భవిష్యత్తు ఇప్పుడు శ్రామికుల చేతుల్లోనే ఉంది అనే మాటలూ వినిపిస్తున్నాయి. భూమి, ఆకాశం, సముద్రాలు, అడవులు, కొండలు, గనులతోపాటు దేశ శ్రామికుల్ని కూడా ప్రభుత్వం మెగా కార్పొరేట్లకు అప్పచెపుతోంది. శ్రామికులు మారు మాట్లాడకుండా దేశభక్తి పారవశ్యంతో రోజుకు 24 గంటలు పని చేస్తే భారతదేశం చైనాను ఏమిటీ, ఏకంగా అమెరికాను సహితం అధిగమిస్తుంది అనేది ఏలినవారు చెప్పదలచుకున్న సిద్ధాంతం.

16వ శతాబ్దంలో ఆధునిక యంత్రాల మీద ఉత్పత్తి విధానం మొదలయినప్పుడే మనిషి ఒక రోజులో ఎంత సమయం శ్రమించాలి అనే చర్చ కూడా మొదలయింది. ఇందులో తాత్త్విక, ధార్మిక, సాంస్కృతిక దృక్పథాలు ఉన్నాయి. శ్రమించడం దైవారాధనకు మరో రూపం, సాతాను ప్రభావంలో ఉన్నవాళ్ళు శ్రమించరు - వంటి భావనని జాన్ కాల్విన్ వంటివాళ్ళు ముందుకు తెచ్చారు. అంతకుముందే సెయింట్ బెనెడిక్ట్ రులే వంటివారు ప్రార్థన, శ్రమ, విశ్రాంతుల మధ్య సమయ విభజన చేయడానికి ప్రయత్నించారు. 18వ శతాబ్దపు బెంజామిన్ ఫ్రాంక్లిన్ Early to bed and early to rise అంటూ మనందరికీ బాగా తెలిసిన నీతిని చెపుతూ త్వరగా పడుకొని త్వరగా లేచే మనిషిని ఆరోగ్యం, ధనం, జ్ఞానం వరిస్తాయి అని ఆశపెట్టాడు. ఇస్లాం ప్రబోధించే ఉపవాసాల్లోనూ ఎప్పుడు లేవాలి, ఎప్పుడు పడుకోవాలి అనే అంశాలతో పాటు మనిషి తన జీవితాన్ని, ఆర్థిక సామాజిక కర్తవ్యాలని సూర్యోదయ సూర్యాస్తమయాలతో అనుసంధానం చేయాలనే సూచనలు ఉంటాయి. తరువాత ఆడమ్ స్మిత్, మాక్స్ వేబర్ వంటి అర్థశాస్త్ర, సమాజశాస్త్ర ఆదిపురుషులు వచ్చారు. సమయం అంటే డబ్బు అనే మాట అప్పుడే పుట్టింది. అయితే, వీళ్ళందరూ తమకు తెలిసో తెలియకో పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాదనలు చేశారు. దానికి విరుద్ధమైన వాదనలు కూడా అప్పట్లోనే వచ్చాయి. మనందరం ఏ తొమ్మిదో తరగతిలోనో న్యూటన్ చలన సూత్రాలను చదివి ఉంటాం. అందులో బాగా గుర్తుండిపోయేది: ప్రతి చర్యకు తత్సమానమైన వ్యతిరేకమైన ప్రతిచర్య ఉంటుంది అనేది. మనం తరచూ అక్కడితో ఆగిపోతాం. ఆ ప్రతిచర్య కూడా ఒక చర్య అయినప్పుడు దానికీ ఒక ప్రతిచర్య ఉంటుందని గుర్తించం. ఇలాంటి చర్య ప్రతిచర్యల నిరంతర కొనసాగింపే గతితర్కం. ఆహార సేకరణ కాలంలో మనిషి కూడా దాదాపు జంతువుల్లానే జీవించాడు. అయితే, మనిషి పరికరాలు, యంత్రాలను సృష్టించి వాటిని విస్తృతంగా వాడడం మొదలు పెట్టాక సమయ పాలన అతన్ని జంతు ప్రపంచం నుంచి పూర్తిగా విడగొట్టేసింది. ఆహార నిద్రా మైథునాలనే శరీర ధర్మాలు, మతం, వాణిజ్యం వంటి సాంస్కృతిక, సామాజిక ధర్మాలతోపాటు శ్రమకు ఎంత సమయాన్ని కేటాయించాలనే అంశం చర్చకు వచ్చింది. రోజుకు 24 గంటలు అనుకుంటే దాన్ని మూడు భాగాలు చేసి మొదటిదాన్ని శ్రమకు, రెండోదాన్ని సమాజానికీ, మూడోదాన్ని విశ్రాంతికీ కేటాయించాలనే అభిప్రాయం క్రమంగా బలపడింది. ఒక్కోదానికి చెరో ఎనిమిది గంటలు అన్నమాట. 19వ శతాబ్ద ఆరంభ కాలపు సమాజశాస్త్రవేత్త రాబర్ట్ ఒవెన్ ఈ సమాన సమయ విభజనను సిద్ధాంతీకరించాడు అంటారు. ఇందులో సమాజం అనే మాటకు చాలా అర్థాలున్నాయి. తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, మిత్రులు, కళా సాహిత్య అభిరుచులు, రాజకీయ ఆసక్తులు, ప్రేమ, ద్వేషాలు వగైరాలన్నీ ఇందులో ఉంటాయి. అవన్నీ ఉన్నప్పుడే మనిషి సంఘజీవి అవుతాడు.

ఎనిమిది గంటల పని దినాన్ని ఫ్యాక్టరీ యజమానులు ఆమోదించలేదు. ఇప్పటి సుబ్రహ్మణ్యన్, నారాయణ మూర్తిల్లా 16 గంటల పనిదినం అమలు కావల్సిందేనని పట్టుబట్టారు. 1886లో అమెరికా అంతటా ఎనిమిది గంటల పనిదినం డిమాండు చాలా బలంగా ముందుకు వచ్చింది. ఆ ఏడాది మే ఒకటిన ఆల్బర్ట్ పార్సన్స్, ఆగస్టు స్పయిస్ తదితరుల నాయకత్వంలో చికాగో నగరంలో జరిగిన ఉద్యమాన్ని రక్తపాతంతో ముంచెత్తారు. అయినప్పటికీ అది విజయం సాధించింది. ఇప్పుడు ఆ విజయాన్ని బలహీనపరిచి 18 గంటల పనిదినాన్ని పునరుద్ధరించాలన్న వాదనలు మొదలయ్యాయి. చైనాతో మనం ఏ విధంగానూ పోల్చుకోలేము. పని స్థలానికి సమీపంలోనే అక్కడి ప్రభుత్వం కార్మికులకు నివాసాన్ని ఏర్పాటు చేస్తుంది. దానివల్ల మూడు లాభాలుంటాయి. ప్రయాణ సమయం, వాహనాల ఇంధన ఖర్చు, దేశంలో కాలుష్యం మూడూ తగ్గుతాయి. భారతదేశంలో అలాంటి ఏర్పాటు లేదు. ఉదాహరణకు హైదరాబాద్‌లో పనిచేయడానికి కొందరు ఇప్పటికీ ప్రతిరోజూ వరంగల్, భూదాన్ పోచంపల్లి నుంచి వస్తుంటారు. కార్యాలయంలో ఎనిమిది గంటల పనిదినం ఎలాగూ తప్పదు. అది మారదు. ప్రయాణ సమయం సులువుగా 6-7 గంటలు ఉంటుంది. దీని కోసం వాళ్ళు సామాజిక జీవితాన్నయినా కోల్పోవాలి, లేదా విశ్రాంతి సమయాన్ని అయినా కోల్పోవాలి. వెరసి మనిషి ఒక యంత్రంగా మారిపోవాలి. ఇవి ఆ శ్రామికుల జీవితాల్లో అనేక కొత్త సంక్షోభాలను సృష్టిస్తాయి. మనిషిని యంత్రుడుగా మార్చే కపటం కొనసాగుతుంది. సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కర రావు 1947లో రాసిన 'మాభూమి' నాటకంలో, నెలల పసిబిడ్డ అయిన తన కొడుకు నిద్రలేవడానికి ముందే ఓ వెట్టి కూలీ పనికి పోతుంటాడు. రాత్రి ఆ పిల్లవాడు నిద్రపోయాక ఇంటికి చేరుతుంటాడు. మెలకువగా ఉండగా తన కొడుకును చూడలేదని నెలల తరబడి వాపోతాడతడు. వర్తమాన ఉద్యోగ సమూహాలు అంతకన్నా దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు దీనికి మినహాయింపు కావచ్చు. కృత్రిమ మేధ (ఏఐ) వచ్చాక లెక్క ప్రకారం మనిషికి పనిభారం తగ్గాలి. విద్దూరం కాకపోతే ఈ పని గంటలు పెంచడం ఏమిటీ? కృత్రిమ మేధను ఒక బూచిగా చూపించి ఉద్యోగ,- శ్రామిక వర్గాలను మరింతగా లొంగదీసుకోవడానికి మెగా కార్పొరేట్లు కుట్రలు పన్నుతున్నారా? అనే సందేహం ఎవరికయినా రావాలి.

# యూపీఐ మోసాలు, అకౌంట్ హ్యాకింగ్ .. తగిన జాగ్రత్తలు



డిజిటల్ ప్రపంచంలో సైబర్ నేరాలు వ్యక్తులకు, వ్యాపారాలకు, ప్రభుత్వాలకు పెరుగుతున్న ముప్పుగా మారాయి. ఫిషింగ్ దాడుల నుండి మాల్వేర్ ఇన్ఫెక్షన్ల వరకు, సైబర్ నేరగాళ్లు వివిధ వ్యూహాలను ఉపయోగించి సున్నితమైన సమాచారాన్ని దొంగిలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సైబర్ నేరాల రకాలను అర్థం చేసుకోవడం, సరైన భద్రతా చర్యలను అమలు చేయడం అత్యంత కీలకం.

ఫిషింగ్ దాడులు ఇమెయిల్, మెసేజ్ లేదా నకిలీ వెబ్‌సైట్‌ల ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని మోసపూరితంగా పొందేందుకు ప్రయత్నిస్తాయి. నకిలీ లాగిన్ పేజీలు, అత్యవసర అభ్యర్థనలు, ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రధాన వ్యూహాలుగా ఉంటాయి. సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత వివరాలు దొంగిలించి, ఆర్థిక మోసాలకు పాల్పడుతారు. డేటా ఉల్లంఘనలు, సోషల్ ఇంజనీరింగ్, డంప్‌స్టర్ డైవింగ్ వంటి పద్ధతులు ఉపయోగిస్తారు. వైరస్లు, ట్రోజన్లు, ర్యాన్సవేర్ వంటి మాల్వేర్ ప్రోగ్రామ్‌లు కంప్యూటర్ సిస్టమ్‌లను హానికరం చేయడమే కాక, డేటా దొంగిలించేందుకు ఉపయోగపడతాయి. పెట్టుబడి మోసాలు, లాటరీ స్కామ్‌లు, రొమాన్స్ స్కామ్‌లు, నకిలీ ఉద్యోగ ఆఫర్లు వంటివి ఆర్థిక నష్టాన్ని కలిగిస్తాయి.

సైబర్ నేరాల నివారణ కోసం అవగాహన కలిగి ఉండటం, తాజా మోసపూరిత వ్యూహాల గురించి తెలుసుకోవడం ముఖ్యం. ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్, భద్రతా ప్రమాణాలతో కూడిన ఇమెయిల్ సేవలు ఉపయోగించాలి. ప్రత్యేకమైన, ఊహించలేని పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలి. పాస్‌వర్డ్ మేనేజర్‌ల ద్వారా భద్రతను మెరుగుపరచుకోవాలి. యాంటీవైరస్, ఆపరేటింగ్ సిస్టమ్‌లు, అప్లికేషన్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. టూ-ఫాక్టర్ అథెంటికేషన్ ద్వారా ఖాతాలను అదనపు భద్రతతో రక్షించుకోవచ్చు.







కొత్తగా ఆన్‌లైన్ చీటింగ్, యూజర్ అకౌంట్ హ్యాకింగ్, యుపిఐ ఫ్రాడ్‌లు పెరుగుతున్నందున, బ్యాంక్ లావాదేవీలను జాగ్రత్తగా నిర్వహించాలి. గుర్తుపట్టలేని లింకులు క్లిక్ చేయకుండా ఉండాలి. సోషల్ మీడియా అకౌంట్‌ల భద్రతను పెంచేందుకు ప్రైవసీ సెట్టింగ్‌లను సమీక్షించాలి. నకిలీ లింకులు, డౌన్‌లోడ్‌లు, అపరిచిత నంబర్ల నుండి వచ్చే కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి. ఫోన్ లేదా మెయిల్ ద్వారా వచ్చే ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదు.

ఇటీవల డిజిటల్ అరెస్ట్ పేరుతో వాట్సప్ కాల్‌లు వస్తున్నాయి. నేరస్తులు పోలీసులుగా నటిస్తూ ఫోన్‌లో బెదిరించి డబ్బులు వసూలు చేసే మోసాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి వాట్సప్ కాల్‌లకు స్పందించకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో 24/7 కాల్ సెంటర్‌ను అందుబాటులో ఉంచింది. ఏదైనా సైబర్ మోసం జరిగినట్లయితే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వెంటనే నేరస్తుల అకౌంట్‌లను స్తంభింపజేసే అవకాశం ఉంటుంది.

సైబర్ నేరాల ప్రభావాన్ని తగ్గించడానికి అప్రమత్తత, అవగాహన, భద్రతా చర్యలు అత్యవసరం. సమాచారంతో ఉండండి, అప్రమత్తంగా ఉండండి, సురక్షితంగా ఉండండి.

**మహమ్మద్ అక్బర్**
**జర్నలిస్ట్ (నవభూమి డైలీ)**
**మహబూబాబాద్‌టౌన్,**
**తెలంగాణ రాష్ట్రం**



# సకల విద్యాప్రదాయిని



సర్వశక్తిమయి అయిన జగదంబను వాక్కు, బుద్ధి, జ్ఞానాల స్వరూపిణిగా భావన చేస్తే... ఆ రూపమే సరస్వతీదేవి. ఆమెను ఆరాధించే గొప్ప పర్వదినం మాఘ శుద్ధ పంచమి. దీనినే 'శ్రీ పంచమి' అని కూడా అంటారు. సరస్వతీదేవిని 'జ్ఞానం దేహి స్మృతి దేహి విద్యాం విద్యాధి దేవతే ప్రతిష్ఠాం, కవితాం దేహి శక్తిం శిష్య ప్రబోధితాకామ్' అని 'బ్రహ్మవైవర్త పురాణం' వర్ణించింది. "విద్యాధిదేవత అయిన సరస్వతీ దేవి జ్ఞానాన్ని, జ్ఞాపకాన్ని ప్రసాదించే తల్లి. విద్యను, ప్రతిష్టను, కవితాశక్తిని ఆమె అనుగ్రహిస్తుంది. శిష్యులను జ్ఞానవంతులుగా చేసే శక్తిని సమకూరుస్తుంది" అని భావం.

**ప్రాణశక్తి, జ్ఞాన శక్తి...**

ప్రతిభ, మేధ, శ్రద్ధ, స్ఫురణ, సాహిత్య సంగీతాది కళా నైపుణ్యాలు సరస్వతీ గుణాలు. పూర్వం గురువులు 'సరస్వతీ నమస్తుభ్యం' అంటూ ప్రార్థన చేయించిన తరువాత విద్యార్థులకు బోధన ప్రారంభించేవారు. అక్షరాభ్యాసానికి ముందు సరస్వతిని పూజించి, పలక మీద బలపంతో శివ పంచాక్షరిని రాయించే ఆనవాయితీ ఉంది. బ్రహ్మదేవుడు సరస్వతిని ఆరాధించి, జ్ఞానాన్ని పొంది... సృష్టిని ఆరంభించాడని పురాణాలు చెబుతున్నాయి. వాణి, భారతి, వీణాపాణి, విద్యావాచస్పతి, వాగ్దేవి, బుద్ధిధాత్రి, ప్రజ్ఞ... ఇలా ఆమెకు సహస్రాధికంగా పేర్లు ఉన్నాయి. లౌకికమైన విద్యలకు, పారమార్థికమైన బ్రహ్మవిద్యకు అధినేత్రి సరస్వతి. భ్రమ, బుద్ధిమాంద్యం, మతిమరపు, వాక్కులో లోపాలు తదితరాలను సమూలంగా నశింపజేస్తుంది కాబట్టి 'నిశ్శేష జాడ్యాపహా' అని సరస్వతీదేవిని వర్ణించారు. వేదాల్లో సరస్వతీ సూక్తాలు ఉన్నాయి. ప్రాణ శక్తిగా, జ్ఞానశక్తిగా పూర్వులు సరస్వతిని ఆరాధించారు. 'యా బ్రహ్మాచ్యుత శంకరః ప్రభృతిభిః దేవైః సదా పూజితా..' సరస్వతీ దేవిని సర్వ దేవతలూ పూజిస్తారు.

**నాటి వ్యాసపురి... నేటి బాసర**

పురాణ గ్రంథాల ప్రకారం... వాల్మీకి మహర్షి... సరస్వతిని ఉపాసించి రామాయణ మహా కావ్య రచన చేశాడు. ఆ బాటలోనే వ్యాస మునీంద్రుడు కూడా నడచి వేదవిభజన చేశాడు. పురాణాలను ఆవిష్కరించి, మహా భారత, భాగవత, బ్రహ్మసూత్రాది రచనలు చేసి... భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి ఆచార్యుడు అయ్యాడు. సరస్వతీ దేవిని సాక్షాత్కరించుకున్న వ్యాసుడు ఆ తల్లి ఆజ్ఞపై పరమ పావన గోదావరీ తీరంలోని వాసర క్షేత్రంలో ఆమెను సైకత మూర్తిగా ప్రతిష్ఠించాడు. ఆ రోజు మాఘ శుద్ధ పంచమి అనీ 'దేవీ భాగవతం' తదితర గ్రంథాలు పేర్కొంటున్నాయి వ్యాసపురిగా ప్రసిద్ధి చెందిన ఆ క్షేత్రం అనంతర కాలంలో 'బాసర'గా ప్రాచుర్యం పొందింది. సరస్వతీ కృపతోనే అపారమైన తత్త్వ విజ్ఞానాన్ని పొందానని చెప్పిన ఆది శంకరులు శృంగేరిలో శారదామాతను ప్రతిష్ఠించి, ఆరాధించారు. యాజ్ఞవల్క్యుడు గురు శాపం కారణంగా అభ్యసించిన విద్యలన్నిటినీ కోల్పోయాడు. సూర్యుడి సూచనల మేరకు సరస్వతిని ఉపాసించి ఆమె కరుణను పొందాడు. మళ్ళీ విద్వాంసుడయ్యాడు.

మాఘ శుద్ధ పంచమి రోజున జన్మించిన సరస్వతీ దేవి తెలుపు వర్ణంలో వెలుగులీనుతూ ఉంటుంది. ఆమెకు ఇష్టమైన రంగు తెలుపు. తెల్లని పద్మం ఆమె పీఠం. హంస ఆమె వాహనం. తెల్లని పుష్పాలు ఆమెకు ఇష్టం. తెల్ల రంగు వస్త్రాలతో ఆమెను అలంకరించి, పూజించి, తెల్లని పాయసాన్ని నివేదిస్తే అనుగ్రహిస్తుందని పెద్దలు చెప్పారు. పుస్తక ధారిణి అయిన సరస్వతిని పుస్తక రూపంలోనూ పూజించవచ్చు. గాయత్రిగా, సావిత్రిగా, పరాశక్తిగా శ్రుతులు పేర్కొన్న సరస్వతిని శ్రీపంచమినాడు భక్తితో అర్చిస్తే సర్వ శుభాలు చేకూరుతానేది పెద్దల మాట.

## ఎండకు చర్మం కమిలితే...



ఎండకు కమిలిపోయిన, రంగు మారిన చర్మం సహజసిద్ధ మెరుపును సంతరించుకోవడం కోసం కలర్ కరెక్టర్‌ను ఉపయోగించాలి. సన్ ట్యాన్‌కు గురైన ప్రదేశంలో పసుపు టోన్ కలిగిన కలర్ కరెక్టర్‌ను చర్మంలో కలిసిపోయేలా అద్దుకోవాలి. నుదురు, ముక్కు, చెక్కిళ్లు సన్‌ట్యాన్‌కు ఎక్కువగా గురవుతూ ఉంటాయి. ఆయా ప్రదేశాల్లో కలర్ కరెక్టర్‌ను అద్దుకుని, ఆ తర్వాతే మేకప్ మొదలుపెట్టాలి.

కన్సీలర్..రంగు మారిన చర్మం మీద సన్నని గీతలు కూడా ఏర్పడతాయి. కాబట్టి వాటిని దాచడం కోసం చర్మపు రంగు కంటే తేలిక రంగులో ఉండే కన్సీలర్‌ను ఎంచుకోవాలి. ఈ కన్సీలర్‌ను తడిపి పిండిన బ్యూటీ బ్లెండర్ సహాయంతో చర్మం మీద అద్దుకోవాలి.

ఫౌండేషన్..ఎండకు కమిలిన చర్మం మరింత సున్నితంగా మారుతుంది. కాబట్టి చురుకైన రసాయనాలుండే ఫౌండేషన్లకు దూరంగా ఉండాలి. అలాగే చర్మాన్ని తేమగా ఉంచే ఫౌండేషన్లను మాత్రమే వాడుకోవాలి. అందుకోసం మాయిశ్చరైజర్, ఎస్‌పిఎఫ్ కలిగిన ఫౌండేషన్‌నే ఎంచుకోవాలి. మరీ ముఖ్యంగా వేసవిలో ముదురు రంగు ఫౌండేషన్లనే వాడుకోవాలి.

# భావోద్వేగాలను బంధించేద్దాం!



కాండిడ్ ఫొటోగ్రఫీ.. అంటే, ఎదుటివారి నిజమైన భావోద్వేగాలను, సహజమైన వ్యక్తిత్వాన్ని చిత్రీకరించే కళ. వైవిధ్యానికి, సహజత్వానికి గౌరవం ఇచ్చే కళ. మీరు ఫొటో తీయాలనుకున్న వ్యక్తి సంతోషంగా నవ్వుతున్న సమయంలోనో, ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న సందర్భంలోనో, పిల్లలతో ఆడుతున్నప్పుడో.. ఇలా, కొన్ని ప్రత్యేక క్షణాలను వారికి తెలియకుండానే ఫొటోలు తీయడం. ఈ ఫొటోలు.. అనేక భావోద్వేగాలను పట్టిచూపుతాయి. నిజజీవిత సౌందర్యాన్ని ప్రదర్శిస్తాయి. ఆయా క్షణాలకు సంబంధించిన కథలను కలకాలం చెబుతూనే ఉంటాయి.

మొబైల్ ఫోన్ కెమెరాల అభివృద్ధి తర్వాత కాండిడ్ ఫొటోగ్రఫీ అందరికీ అందుబాటులోకి వచ్చింది. మొబైల్ ఫోన్‌తోనే కాండిడ్ ఫొటోగ్రఫీని ఎలా చేయవచ్చో.. ఆనందపు క్షణాలను అద్భుతంగా ఎలా ఒడిసి పట్టుకోవచ్చో తెలుసుకుందాం.

కాండిడ్ ఫొటోగ్రఫీ.. సంప్రదాయ పోర్ట్రెయిట్ ఫొటోగ్రఫీకి భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎదుటి వ్యక్తులను.. 'ఫొటోలకు పోజులివ్వండి' అని అడగాల్సిన పనిలేదు. వారి సహజమైన స్థితిలో ఉన్నప్పుడే.. ఆ మూమెంట్స్‌ను, ఎక్స్‌ప్రెషన్స్‌ను చిత్రీకరించాలి.

**మొబైల్ ఫోన్‌నే ఎందుకు?**

అత్యాధునిక ఫీచర్లతో వస్తున్న మొబైల్ ఫోన్‌లు.. డీఎస్‌ఎల్‌ఆర్ కెమెరాలకు ప్రత్యామ్నాయంగా మారాయి. కాండిడ్ ఫొటోగ్రఫీకి మొబైల్ ఫోన్‌లు సరైనవని చెప్పడానికి ఇక్కడ అనేక కారణాలు ఉన్నాయి.

**సౌకర్యవంతంగా :** స్మార్ట్‌ఫోన్లు తేలికగా ఉంటాయి. మన చేతిలోనే ఉంటూ.. ఏదైనా మంచి మూమెంట్ కనిపించగానే, 'క్లిక్' అనిపిస్తాయి. ఇక ప్రయాణాల్లోనూ కాండిడ్ ఫొటోలను తీయడాన్ని సులభం చేస్తాయి.

**గమనించకుండా :** కాండిడ్ ఫొటోగ్రఫీ అంటేనే.. ఎదుటి వ్యక్తికి తెలియకుండా ఫొటోలు తీయడం. డీఎస్‌ఎల్‌ఆర్ లాంటి పెద్ద కెమెరాలతో ఫొటోలు తీసేటప్పుడు.. ఆయా వ్యక్తులు గమనించే అవకాశం ఉంటుంది. అదే.. మొబైల్ ఫోన్ కెమెరాను గమనించడం, దానిని చూసి ప్రతిస్పందించే అవకాశం తక్కువ. దీనివల్ల కాండిడ్ క్షణాలను క్యాప్చర్ చేయడం సులభం అవుతుంది.

**ఎడిటింగ్‌తో మాయ..**

కాండిడ్ ఫొటోగ్రఫీ సహజంగా ఉంటుంది. అయితే కొంత ఎడిటింగ్ చేయడం వల్ల ఫొటోలు మరింత ప్రభావవంతంగా కనిపిస్తాయి.

ఎక్స్‌పోజర్, కాంట్రాస్ట్‌ను సర్దుబాటు చేయండి

ఫ్రేమింగ్ సరిగ్గా లేదని అనిపిస్తే.. ఫొటోను క్రాప్ చేయండి.

**సులభంగా :** మొబైల్ ఫోన్ కెమెరాలు యూజర్ ఫ్రెండ్లీగా ఉంటాయి. వీటి వాడకం చాలా సులభం. ఆటో ఫోకస్, ఇమేజ్ స్టెబిలైజేషన్, పోర్ట్రెయిట్ మోడ్ వంటి ఫీచర్లనూ కలిగి ఉంటాయి. పెద్దపెద్ద కెమెరాలతో పని లేకుండానే.. కొత్తవారు కూడా సులభంగా హై క్వాలిటీ ఫొటోలను తీసే అవకాశం ఉంటుంది.అప్పటికప్పుడే : స్మార్ట్‌ఫోన్ కెమెరాతో కాండిడ్ ఫొటోలు తీసిన తర్వాత.. ఆయా చిత్రాలను అప్పటికప్పుడే ఎడిట్ చేసుకోవచ్చు. సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయవచ్చు. మీ ఫొటోలను సులభంగా ప్రాసెస్ చేయడానికి, షేర్ చేయడానికి స్మార్ట్‌ఫోన్లు బాగా సహకరిస్తాయి.

**ఆధునిక సాంకేతికత..**

ఇప్పుడొస్తున్న స్మార్ట్‌ఫోన్లు.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉంటున్నాయి. ఏఐ ఆధారిత ఫీచర్లతో.. ప్రొఫెషనల్ క్వాలిటీ చిత్రాలను అందిస్తున్నాయి.

మీ మొబైల్ ఫోన్‌తో అద్భుతమైన కాండిడ్ ఫొటోలు తీయడానికి కొన్ని చిట్కాలు ఇప్పుడు తెలుసుకుందాం!

కాండిడ్ ఫొటోలను తీయడానికి మంచి స్మార్ట్‌ఫోన్ కన్నా టెక్నిక్, ఓర్పుతోపాటు ఫొటోను ఎప్పుడు, ఎలా తీయాలనే దానిపై అవగాహన ఎక్కువగా ఉండాలి. అప్పుడే మీ మొబైల్ ఫోన్ కెమెరాను సరిగ్గా వినియోగించడానికి వీలవుతుంది. స్మార్ట్‌ఫోన్‌తో క్యాండిడ్ ఫొటోగ్రఫీలో నైపుణ్యం సాధించడంలో మీకు సహాయపడటానికి ఇక్కడ కొన్ని ముఖ్యమైన చిట్కాలు ఇస్తున్నాం.

**1. తెలియకుండానే..**



మీరు తమను ఫొటో తీస్తున్నారని అవతలివారికి తెలిస్తే.. వారు తమ ప్రవర్తనను మార్చుకోవచ్చు. దాంతో, కాండిడ్ అర్థమే మారిపోతుంది. క్వాలిటీ కూడా తగ్గుతుంది. కాబట్టి, ఫొటో తీసేటప్పుడు మీరు చాలా సీక్రెట్ మెయిన్‌టెయిన్ చేయాలి. అలా సరదాగా తిరుగుతున్నట్టే తిరుగుతూ.. ఫొటోలు తీయాలి.

చిట్కా 1 : ఫోన్‌ను ఛాతీ స్థాయిలోనైనా, దానికి దిగువన అయినా ఉంచి, దూరంనుంచే ఫొటోలు తీయండి. ఇది అవతలివారి దృష్టిని ఆకర్షించే అవకాశాన్ని తగ్గిస్తుంది.

చిట్కా 2 : మీ ఫోన్‌ని ఒక చేతిలో పట్టుకుని, నోటిఫికేషన్లను తనిఖీ చేస్తున్నట్టు నటిస్తూ.. యాప్‌లను స్క్రోల్ చేస్తూ, మరో చేత్తో మెల్లగా ఫొటోలు తీయండి.

**2. మధుర క్షణాన్ని..**

క్యాండిడ్ ఫొటోగ్రఫీ అంటేనే.. టైమింగ్, ఎమోషన్‌కి సంబంధించినది. సరైన పోజ్ కోసం ఎదురుచూడకుండా, నిజమైన హావభావాలను, మధుర క్షణాలను క్యాప్చర్ చేయడంపై దృష్టి పెట్టండి.

చిట్కా 1 : ఎమోషనల్ అట్మాస్ఫియర్‌పై శ్రద్ధ వహించండి. జోక్ అయినా, నిశ్శబ్దమైన క్షణమైనా, ఎవరైనా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసిన క్షణమైనా సరే.. ఫొటోల్లో బంధించండి. ఇలా ఎలాంటి ప్రణాళికలేని క్షణాలే.. అత్యంత శక్తిమంతమైన కాండిడ్ ఫొటోలను అందిస్తాయి.

**3. ఫ్లాష్ వద్దు..**

కాండిడ్ ఫొటోగ్రఫీలో బరస్ట్ మోడ్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పబ్లిక్ ప్లేస్‌లలో సహజ కాంతిలో ఫొటోలు తీయడమే బెటర్. మీరు ఫ్లాష్‌ను ఉపయోగించినట్టయితే.. మీరు ఫొటో తీసినట్టు ఎదుటివారికి తెలిసిపోతుంది. దాంతో వారినుంచి మరో ఫొటోను ఊహించలేం.

**4. ఓపికతో ఉండండి..**

కాండిడ్ ఫొటోగ్రఫీకి ఓపిక చాలా అవసరం. ఎప్పటికప్పుడు అప్రమత్తంగానూ ఉండాలి. ఎందుకంటే, బెస్ట్ మూమెంట్స్ అనేవి క్షణాల్లోనే కరిగిపోతాయి. అలాంటి క్షణాలు కనిపించినప్పుడు.. దాన్ని క్యాప్చర్ చేయడానికి సదా సిద్ధంగా ఉండాలి.

చిట్కా 1 : ఎదుటి వ్యక్తుల బాడీ లాంగ్వేజ్‌తోపాటు వారి చర్యలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. పిల్లల నవ్వులు, కేరింతలు.. ఇలాంటి ఆసక్తికరమైన క్షణాలు ఎప్పుడైనా.. ఎక్కడైనా జరగవచ్చు.

చిట్కా 2 : తొందరొద్దు. పరిసరాల్ని పరిశీలించడానికి ఎక్కువ సమయం తీసుకోండి. చిన్న చిన్న వివరాలను.. భావోద్వేగాలు, హావభావాలను నిశితంగా గమనించండి.

# సజ్జ రొట్టెలు మెత్తమెత్తగా...



సజ్జ పిండిలో జీర్ణవ్యవస్థకు హాని కలిగించే గ్లూటన్ ఉండదు. ఈ పిండి శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తుంది. అందుకే సజ్జ రొట్టెలు తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. సజ్జ రొట్టెలు మెత్తగా రావాలంటే ఏచిట్కాలు పాటించాలో తెలుసుకుందాం.

**సజ్జ రొట్టెలు మెత్తమెత్తగా...**

సజ్జ పిండిలో జీర్ణవ్యవస్థకు హాని కలిగించే గ్లూటన్ ఉండదు. ఈ పిండి శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తుంది. అందుకే సజ్జ రొట్టెలు తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. సజ్జ రొట్టెలు మెత్తగా రావాలంటే ఏచిట్కాలు పాటించాలో తెలుసుకుందాం.

స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి అరచెంచా ఉప్పు, ఒక చెంచా నెయ్యి వేసి అయిదు నిమిషాలు మరిగించి దించాలి. ఇందులో ఒక గ్లాసు సజ్జ పిండి వేసి మెల్లగా కలుపుతూ ముద్దలా చేయాలి. దీనిపై తడిగుడ్డ కప్పి పది నిమిషాలు నాననిస్తే పిండి ఉబ్బుతుంది. రొట్టెలు కూడా మెత్తగా వస్తాయి.

సజ్జ పిండిని ఎక్కువసేపు కలపకూడదు. నీళ్లు కలిసి ముద్దలా అయితే చాలు. గోధుమపిండి మాదిరి ఒత్తుతూ కలిపితే సజ్జపిండి జిగురుగా మారుతుంది. రొట్టెలు చేయడం కష్టమవుతుంది.

సజ్జ రొట్టెలను పలుచగా ఒత్తకూడదు. కొంచెం మందంగానే ఉండాలి. పొడి పిండి చల్లుకుంటూ పెద్దగా నొక్కకుండా తేలికగా ఒత్తాలి.

స్టవ్ మీద ఇనప పెనం పెట్టి అది వేడెక్కాక సజ్జ రొట్టెను జాగ్రత్తగా వేయాలి. ఒకవైపు కాలిన తరవాతే రెండోవైపుతిప్పాలి. సజ్జ రొట్టెలు త్వరగా గట్టిపడతాయి. కాబట్టి ఎక్కువసేపు కాల్చకూడదు. రొట్టెమీద గోధుమ రంగుచుక్కలు కనిపించగానే రెండోవైపునకు తిప్పాలి. రెండు వైపులా దోరగా కాలిన తరవాత పళ్లెంలోకి తీసి కొద్దిగా నెయ్యి రాయాలి. రొట్టెలు ఆరిపోకుండా పలుచని గుడ్డ కప్పాలి. ఇలాచేస్తే చాలా సమయం వరకు రొట్టెలు మెత్తగా ఉంటాయి.

## చలివేళల్లో తట్టుకోవడానికి చిట్కాలు



చలి తీవ్రత ఏమాత్రం తగ్గడంలేదు. ఉదయం తొమ్మిది దాటుతున్నా.. గజగజా వణకడం మాత్రం తప్పడంలేదు. అయితే, చలిలో ఆడవాళ్లే ఎక్కువగా వణుకుతుండటం ఎప్పుడైనా గమనించారా? 'అది నిజమే!' అని వైద్య నిపుణులు అంటున్నారు. ఎందుకంటే.. పురుషులతో పోలిస్తే, మహిళలే ఎక్కువగా చలి బారినపడతారట. ఇందుకు కారణాలు అనేకం. అందులో మొదటిది.. మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత. నెలసరి కారణంగా శరీరంలో.. ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లలో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి.ఇవి, శరీర ఉష్ణోగ్రతను ప్రభావితం చేస్తాయి. అంతేకాకుండా, మహిళల్లో జీవక్రియ రేటు తక్కువగా ఉండటం కూడా మరో కారణం. దీనివల్ల శరీరంలో తక్కువ వేడి ఉత్పత్తి అవుతుంది. ఉష్ణోగ్రత తగ్గడం వల్ల వారికి మరింత చలిగా అనిపిస్తుంది. మహిళల శరీరంలో ఎక్కువ మొత్తంలో పేరుకుపోయే కొవ్వు.. అంతర్గత వేడిని ప్రసరింపజేసే రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. ఫలితంగా, మహిళలు మరింత చలిని అనుభవిస్తారని నిపుణులు చెబుతున్నారు.

# షాపింగ్ జనరేషన్



ఒకప్పుడు షాపింగ్ సందడి అంటే.. పండుగలకో, శుభకార్యాలకో మాత్రమే కనిపించేది. కానీ, జెన్-జెడ్ మాత్రం.. నిత్య షాపింగ్ మంత్రం పఠిస్తున్నది. అయితే, అన్నిటికీ ఆన్‌లైన్ మీదే ఆధారపడే ఈ తరం.. విచిత్రంగా షాపింగ్ కోసం ఆఫ్‌లైన్ స్టోర్లకు క్యూ కడుతున్నది. పేమెంట్ టెక్నాలజీ కంపెనీ.. 'అడియన్' నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 18 నుంచి 27 ఏండ్ల వయసుగల వారిలో దాదాపు మూడు వంతుల మంది (73 శాతం).. కనీసం వారానికి ఒకసారైనా ఆఫ్‌లైన్ స్టోర్లను సందర్శిస్తారట. ఈ విషయంలో బేబీ బూమర్లు (1946-1964 మధ్యలో పుట్టినవారు) 65 శాతం మాత్రమే ఉన్నారట. ఈ సర్వేలో పాల్గొన్న జెన్-జెడ్ షాపర్లలో దాదాపు సగం మంది (49 శాతం) ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తూ.. ఆయా సంస్థలకు చెందిన స్టోర్ల నుంచి డెలివరీ పొందుతున్నారట. అదే.. బేబీ బూమర్ల విషయానికి వస్తే.. 28 శాతం మంది మాత్రమే ఇలా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసి, స్టోర్ల నుంచి డెలివరీ తీసుకుంటున్నారట. ఇలా.. ఆఫ్‌లైన్ స్టోర్లను సందర్శించి, నచ్చిన వస్తువును కొనుగోలు చేయడం మంచి అనుభవమని 57 శాతం మంది చెబుతున్నారు. అదే సమయంలో.. ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయడం కూడా తమకు సౌకర్యంగా ఉంటుందని జెన్-జెడ్ అంటున్నది.

ముఖ్యంగా, ఖరీదైన వస్తువులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తామని 38 శాతం మంది చెప్పగా.. ఇందుకు భిన్నంగా ఆఫ్‌లైన్ స్టోర్లను ఆశ్రయిస్తామని 37 శాతం మంది చెప్పారు. 'డిజిటల్ ప్రపంచంలోనే బతుకుతారు' అనే పేరు తెచ్చుకున్న జెన్-జెడ్.. షాపింగ్ విషయానికి వచ్చేసరికి ఆ హద్దులను చెరిపేస్తున్నారని సర్వే ప్రతినిధులు చెబుతున్నారు. ఎందుకంటే.. వారు చాలా వేగవంతమైన, ఒత్తిడి లేని షాపింగ్ అనుభవాన్ని కోరుకుంటున్నారట. మరో విషయం ఏమిటంటే, స్టోర్లలో షాపింగ్ చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ.. జెన్-జెడ్ తరం కొన్ని నిబంధనలను పాటిస్తున్నది. బిల్లింగ్ దగ్గర ఆలస్యమైనా.. చెక్ అవుట్ లైన్లు పొడవుగా ఉన్నా.. షాపింగ్‌ను వదిలేస్తున్నారట. అంటే.. అప్పటిదాకా సెలెక్ట్ చేసుకున్న దుస్తులు, వస్తువులను అక్కడే వదిలేసి వెళ్తున్నారట. అలా.. క్యూ లైన్లలో వేచి ఉండటం ఇష్టంలేక షాపింగ్‌ను వదిలేస్తున్నట్లు 60 శాతం మంది చెప్పారు. తమకు ఇష్టమైన చెల్లింపు పద్ధతులు (క్రెడిట్ కార్డ్, యూపీఐ) లాంటివి అందుబాటులో లేకున్నా.. వీరు షాపింగ్ వదిలేస్తారట.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
6 | హైదరాబాద్
శనివారం
22 । ఫిబ్రవరి । 2025






## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. టాప్ 5 లాసింగ్ స్టాక్స్



**ముంబై-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కూడా మరోసారి నష్టాల్లో ముగిశాయి. ఈ క్రమంలో ప్రధాన సూచీలైన 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 203.22 పాయింట్లు తగ్గి 75,735 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 50 కూడా 19.75 పాయింట్లు తగ్గి 22,913.15 స్థాయికి చేరుకుంది. ఇదే సమయంలో బ్యాంక్ నిఫ్టీ 236 పాయింట్లు నష్టపోయి 49,334 స్థాయికి చేరుకోగా, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ మాత్రం వీటికి విరుద్ధంగా 637 పాయింట్లు లాభపడి 51,163 స్థాయికి చేరింది. ఈ క్రమంలో పలువురు మదుపర్లు నష్టపోగా, మరికొంత మంది మాత్రం లాభపడ్డారు. ఈ క్రమంలో బ్యాంక్, మారుతి సుజుకి, టెక్ మహీంద్రా, టాటా కంస్యూమర్స్, టెక్ సంస్థల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉండగా, శ్రీరామ్ ఫైనాన్స్, , భారత్ ఎలక్ట్రిక్, అదానీ పోర్ట్స్ సంస్థల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉన్నాయి. నిఫ్టీ 50లోని 50 స్టాక్‌లలో 28 లాభాలతో ముగిశాయి.

నిఫ్టీ ఆటో, నిఫ్టీ , మెటల్, రియాల్టీ, మీడియా సూచీలు ఒక శాతానికి పైగా లాభాలతో ముగియగా, బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ, ఫార్మా, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు 0.75 శాతం వరకు నష్టపోయాయి. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న మిశ్రమ ధోరణుల నేపథ్యంలో స్టాక్ మార్కెట్ సూచీలు పడిపోయినట్లు నిపుణులు చెబుతున్నారు.

## 8 ఓలా ఎలక్ట్రిక్ మూడో తరం స్కూటర్ల ఆవిష్కరణ.. రూ.79,999 నుంచి ప్రారంభం..!



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రముఖ ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ దేశీయ మార్కెట్లోకి ఎనిమిది మూడో తరం ఎలక్ట్రిక్ స్కూటర్లు ఆవిష్కరించింది. అడ్వాన్స్‌డ్ జెన్ 3 ప్లాట్‌ఫామ్‌పై ఎస్1 బ్రాండ్‌పై ఎనిమిది స్కూటర్లను అందుబాటులకి తెచ్చింది. వీటి ధరలు రూ.79,999 (ఎక్స్ షోరూమ్) నుంచి రూ.1,69,999 (ఎక్స్ షోరూమ్) మధ్య పలుకుతాయి. జెన్ 3 ఎస్1స్కూటర్లతోపాటు జెన్ 2 స్కూటర్ల విక్రయాలు కొనసాగుతాయని ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. శుక్రవారం (జనవరి 31, 2025) నుంచి స్కూటర్ల ప్రీ బుకింగ్స్ ప్రారంభించింది. ఫిబ్రవరి రెండో వారంలో బుక్ చేసుకున్న కస్టమర్లకు స్కూటర్ల డెలివరీ ప్రారంభం అవుతుందని వెల్లడించింది.

మూడోతరం ఎస్1 స్కూటర్లను ఆవిష్కరించిన నేపథ్యంలో ఎస్1 ప్రో, ఎస్1 ఎక్స్ (2కిలోవాట్లు, 3 కిలోవాట్లు, 4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్స్) రెండోతరం స్కూటర్లపై రూ.35 వేల వరకూ డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నది. దీంతో ఈ స్కూటర్లు రూ.1,14,999 (ఎక్స్ షోరూమ్), రూ.69,999 (ఎక్స్ షోరూమ్), రూ.79,999 (ఎక్స్ షోరూమ్), రూ.89,999 (ఎక్స్ షోరూమ్) ధరలకు లభిస్తాయి.5.3 (4680 భారత్ సెల్) కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో వస్తున్నమూడోతరం ఎస్1 ప్రో ం స్కూటర్ రూ.1,69,999 (ఎక్స్ షోరూమ్), 4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ ఎస్1 ప్రోం స్కూటర్ ధర రూ.1,54,999 (ఎక్స్ షోరూమ్) లకు లభిస్తుంది. మూడో తరం ఎస్1ప్రో స్కూటర్ (4 కిలోవాట్లు) రూ.1,34,999 (ఎక్స్ షోరూమ్), 3 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో వస్తున్న స్కూటర్ రూ.1,14,999 (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది.ఎస్1 ఎక్స్ (2కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్) స్కూటర్ ధర రూ.79,999 (ఎక్స్ షోరూమ్), 3కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ స్కూటర్ ధర రూ.89,999 ((ఎక్స్ షోరూమ్), 4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ వేరియంట్ ధర రూ99,999 (ఎక్స్ షోరూమ్)లకు లభిస్తుంది. అదనంగా ఎస్1ఎక్స్ ం విత్ 4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ స్కూటర్ రూ.1,07,999 (ఎక్స్ షోరూమ్) లభిస్తుంది. ఈ ధరలు వచ్చే ఏడు రోజులు మాత్రమే అమల్లో ఉంటాయి. తదుపరి ఓలా ఎలక్ట్రిక్ వీటిని సవరించనున్నది.మిడ్ డ్రైవ్ మోటార్, చైన్ డ్రైవ్, సుపీరియర్ పెర్ఫార్మెన్స్, రేంజ్, ఎఫిషియెన్సీ కోసం ఇంటిగ్రేటెడ్ ఎంసీయూతో కూడిన టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్స్‌తో రూపుదిద్దుకున్నాయి ఓలా మూడో తరం ఎస్1 స్కూటర్లు. ఫస్ట్ డ్యుయల్ ఏబీఎస్, బ్రేక్ బై వైర్ టెక్నాలజీ, సేఫ్టీ విస్తరణతోపాటు 15శాతం ఎనర్జీ రికవరీ మెరుగుదల కలిగి ఉంటుంది. సృజనాత్మకతతో రూపుదిద్దుకున్న మూడో తరం ఓలా ఎస్1ఎక్స్ స్కూటర్ ఇంజిన్లలో 20 శాతం విద్యుత్ పెరగడంతోపాటు 11 శాతం ఖర్చు తక్కువ. ఓలా ఎలక్ట్రిక్ తన యూజర్ల కోసం మూవ్ ఓఎస్ వచ్చేనెల మధ్యలో ఆవిష్కరిస్తుంది. ఇందులో ఓలా మ్యాప్స్ నిర్వహించే స్మార్ట్ వాచ్ యాప్, స్మార్ట్ పాక్, భారత్ మూడ్, రోడ్ ట్రిప్ మూడ్, లైవ్ లొకేషన్ షేరింగ్, ఎమర్జెన్సీ ఎస్ఓఎస్ తదితర ఆప్షన్లు ఉంటాయి.

వేరియంట్ల వారీ స్పీడ్ - మోటార్, శ్రేణి తెలుసుకుందాం

మోడల్ వేరియంట్ - బ్యాటరీ - రేంజ్ - మోటార్ -గరిష్ట వేగం

ఓలా ఎస్1 ఎక్స్ - 2 కిలోవాట్లు - 108 కి.మీ- 7 కిలోవాట్లు - గంటకు 101 కిమీ

ఓలా ఎస్1 ఎక్స్- 3 కిలోవాట్లు -176 కి.మీ- 7 కిలోవాట్లు - గంటకు 115 కిమీ

ఓలా ఎస్1 ఎక్స్ -4 కిలోవాట్లు -242 కి.మీ- 7 కిలోవాట్లు - గంటకు 123 కిమీ

ఓలా ఎస్1 ఎక్స్ం - 4 కిలోవాట్లు -242 కి.మీ- 11 కిలోవాట్లు - 125 కిలోవాట్లు

ఓలా ఎస్1 ప్రో - 3 కిలోవాట్లు -176 కి.మీ -11 కిలోవాట్లు - 125 కి.మీ

ఓలా ఎస్1 ప్రో- 4 కిలోవాట్లు -242 కి.మీ -11 కిలోవాట్లు -125 కి.మీ

ఓలా ఎస్1 ప్రోం - 5.3 కిలోవాట్లు -320 కి.మీ -13 కిలోవాట్లు - గంటకు 141 కి.మీ

ఓలా ఎస్1 ప్రోం - 4 కిలోవాట్లు - 242 కి.మీ - 13 కిలోవాట్లు - గంటకు 141 కి.మీ

## చాట్‌జీపీటీ, డీప్‌సీక్‌కు భారత్ పోటీ

**న్యూఢిల్లీ- నవభూమి:** కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రపంచ దిగ్గజాలకు సవాలు విసిరేందుకు భారత్ సన్నద్ధమవుతోంది. ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, చైనా తాజా సంచలనం డీప్‌సీక్ ఆర్1, గూగుల్ జెమినీతో పాటు ఇతర జెనరేటివ్ ఏఐ అప్లికేషన్లకు పోటీగా భారత్ సొంత ఫౌండేషనల్ మోడల్‌ను అభివృద్ధి చేయనుంది. వచ్చే పది నెలల్లో ఇది సిద్ధం కానుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ఉత్కర్ష్ ఒడిశా సదస్సులో వెల్లడించారు. కృత్రిమ మేధ సాంకేతికతలో స్వయం సమృద్ధి దిశగా భారత ప్రయాణంలో ఇది కీలక మైలురాయి కానుందన్నారు. సొంత లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) అభివృద్ధికి ఇప్పటికే రంగం సిద్ధం చేసినట్లు చెప్పారు.

ఇందుకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ సిద్ధంగా ఉందని.. భారత వినియోగదారుల వినూత్న అవసరాల తీర్చే వ్యవస్థను అభివృద్ధి చేయడంపై భారత్ దృష్టిసారించిందన్నారు. గత వారం విడుదలైన ఓపెన్‌సోర్స్ మోడల్ డీప్‌సీక్ ఆర్1.. ప్రపంచవ్యాప్త సాంకేతిక నిపుణుల దృష్టిని తనవైపుకు తిప్పుకుంది. అంతేకాదు, ఏఐ రంగంలో ఓపెన్‌ఏఐ సహా అమెరికన్ సిలికాన్ కంపెనీల ఆధిపత్యానికి సవాలు విసిరింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా ఈ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది.

18,693 జీపీయూల సమీకరణ: చాట్‌జీపీటీ, డీప్‌సీక్ వంటి ఏఐ మోడళ్ల అభివృద్ధికి అత్యాధునిక జీపీయూ ((గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్)లు వేల సంఖ్యలో అవసరం. ఎందుకంటే, ఏఐ మోడల్ ట్రైనింగ్‌కు ఈ ఆధునిక జీపీయూలే కీలకం.డీప్‌సీక్ ఏఐ మోడల్‌కు 2,500 జీపీయూలతో సమాచార ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇవ్వగా.. చాట్‌జీపీటీ అభివృద్ధికి ఏకంగా 25,000 జీపీయూలను వినియోగించారు. భారత్ సొంత ఏఐ మోడల్‌ను అభివృద్ధి చేసుకునేందుకు ఇప్పటి వరకు 18,693 జీపీయూలను సమకూర్చుకుంది. అందులో 10,000 జీపీయూలు ఇప్పటికే అందుబాటులో ఉండగా.. త్వరలో మరిన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఏఐ మోడల్ అభివృద్ధి కోసం కామన్ కంప్యూటింగ్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేసింది.

# హైదరాబాద్‌లో తగ్గిన బంగారం ధరలు.. మంచి ఛాన్స్.. ఈరోజు తులం గోల్డ్ రేటు ఎంతంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశ ప్రజలకు బంగారం అంటే ఎంతో ఇష్టం. వందల సంవత్సరాల క్రితమే పసిడి భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక భాగమైంది. ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాలు ధరించేందుకు ఇష్టపడుతుంటారు. ఇటీవలి కాలంలో చాలా మంది పురుషులు సైతం బంగారం ధరిస్తున్నారు. ఇక చాలా మంది బంగారం ఉంటే ఆర్థిక భరోసాగా భావిస్తున్నారు. దీంతో బంగారంపై పెట్టుబడులు పెంచుతున్నారు. దీంతో బంగారం ధరలు రోజు రోజుకు భారీగా పెరుగుతున్నాయి. దీనికి తోడు అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం చూపి అది కాస్త బంగారం ధరలు పెరిగేలా చేస్తుంది. ట్రంప్ నిర్ణయాలతో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేని మదుపరులు సురక్షితమైన పెట్టుబడి మార్గంగా బంగారాన్ని భావిస్తున్నారు. తమ డబ్బులతో బంగారం కొంటున్నారు. దీంతో పసిడి ధరలు సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. అయితే, గత నాలుగు రోజులుగా పెరిగిన గోల్డ్ రేట్లు ఫిబ్రవరి 22వ తేదీన స్వల్పంగా దిగివచ్చింది. ఆ వివరాలు తెలుసుకుందాం. అంతర్జాతీయ మార్కెట్లో చూసుకుంటే బంగారం ధరలు తగ్గాయి. క్రితం రోజుతో పోలిస్తే స్పాట్ గోల్డ్ రేటు ఒక ఔన్సుకు (31.10 గ్రాములు) 15 డాలర్ల వరకు ధర తగ్గింది. ఇప్పుడు ఔన్సుకు గోల్డ్ రేటు 2935 వద్దకు దిగివచ్చింది. ఇక స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు 32.48 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక స్పాట్ రూపాయి విలువ రూ.86.675 వద్ద అమ్ముడవుతోంది.

**హైదరాబాద్‌లో తగ్గిన బంగారం ధరలు..**

అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ రేట్లు దిగివచ్చిన క్రమంలో హైదరాబాద్‌లోనూ ఆ ప్రభావం కనిపించింది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం రేటు 10 గ్రాములపై రూ.450 మేర తగ్గింది. దీంతో తులం రేటు రూ. 80 వేల 250 వద్దకు దిగివచ్చింది. అయితే, 24 క్యారెట్ల మేలిమి గోల్డ్ రేటు తులానికి రూ.60 పెరిగి రూ.88 వేల 100 వద్దకు ఎగబాకింది.

**వారం తర్వాత తగ్గిన వెండి రేటు..**

హైదరాబాద్ మార్కెట్లో వెండి రేట్లు గత వారం రోజుల నుంచి స్థిరంగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే, ఇవాళ స్వల్పంగా తగ్గింది. కిలో వెండి రేటు రూ.100 తగ్గింది. దీంతో హైదరాబాద్ ఏరియాలో కిలో వెండి రేటు రూ. 1,07,900 వద్ద అమ్ముడవుతోంది.

ఈ కథనంలో చెప్పిన బంగారం, వెండి రేట్లు ఫిబ్రవరి 22, శనివారం ఉదయం 7 గంటల సమయంలో ఉన్నవి. అయితే, మధ్యాహ్నం సమయానికి బంగారం, వెండి ధరల్లో మార్పులు రావచ్చు. అలాగే జీఎస్టీ వంటి ట్యాక్సులు కలిపితే ధరలు ఇంకాస్త ఎక్కువే ఉంటాయి. గతం కొంత కాలంగా క్రమేపీ పెరుగుతున్న బంగారం ధరలు నేడు కూడా స్వల్పంగా పెరిగాయి. నేడు (21-02-2025) ఉదయం 6.30కు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర నిన్నటి రేట్లతో పోలిస్తే రూ.10 మేర పెరిగి రూ.88,200కు చేరుకుంది. ఇక 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర కూడా ఇదే స్థాయిలో పెరిగి రూ.80,860 వద్ద తచ్చాడుతోంది.

ఈ ఏడాది ప్రారంభం నుంచి బంగారం ధరలు క్రమక్రమంగా పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారంవైపు మొగ్గు చూపడంతో ధరలకు రెక్కలొచ్చాయి. గతంలోలా భారీ స్థాయిలో మార్పులు లేకపోయినా క్రమంగా రేట్లు పెరుగుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇక వెండి ధరలో మాత్రం నిన్నటితో పోలిస్తే తగ్గుదల కనిపించింది. నిన్న కేజీ వెండి ధర రూ.1,00,500 కాగా నేడు అది రూ.100 తగ్గి రూ. 1,00,500కు చేరుకుంది. గత కొన్ని రోజులుగా స్థిరంగా ఉన్న వెండి ధరలు నేడు స్వల్పంగా తగ్గడం గమనార్హం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (22, 24 క్యారెట్లు) ఇవీ

చెన్నై: రూ.80710, రూ.88050


ముంబై: రూ.80710, రూ.88050

ఢిల్లీ: రూ. 80860, రూ.88200

కోల్‌కతా: రూ. 80710, రూ.88050

హైదరాబాద్: రూ. 80710, రూ. 88050

## ఊహించని మలుపుల నుంచి నాన్-స్టాప్ నవ్వుల వరకు- టాటా ప్లే తెలుగు సినిమాలో జనక అయితే గనక వీక్షించేందుకు 5 కారణాలు



**న్యూఢిల్లీ-** కొన్ని సినిమాలు మిమ్మల్ని నవ్విస్తాయి, కొన్ని ఆలోచించేలా చేస్తాయి, మరికొన్ని రెండింటినీ అప్రయత్నంగా చేయిస్తాయి. జనక అయితే గనక ఆ రెండవ కోవకు చెందిన సినిమా. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రసాద్‌గా సుహాస్ మరియు సంగీత విపిన్ అతని భార్యగా నటించారు. ఈ చిత్రం హాస్యం, భావోద్వేగాలు మరియు సామాజిక పరిస్థితులకు అద్దం పట్టే ఆహ్లాదకరమైన సమ్మేళనం. ఫ్రెష్ కంటెంట్‌తో, సంబంధిత పాత్రలతో, ఇది కేవలం కామెడీ కన్నా ఎక్కువ- ఇది వినోదాత్మక కుటుంబ నాటకం అని చెప్పవచ్చు. ఇది మిమ్మల్ని నవ్విస్తుంది, కళ్లు చెమర్చేలా చేస్తుంది అలాగే జీవితంలోని చిన్న వ్యంగ్య సందర్భాలను ప్రతిబింబిస్తుంది. ఫిబ్రవరిలో ప్రతిరోజూ టాటా ప్లే తెలుగు సినిమా, సర్వీస్ 1402లో మాత్రమే దీన్ని వీక్షించేందుకు సిద్ధంగా ఉండండి.

కనుక, జనక అయితే గనకను తప్పనిసరిగా ఎందుకు చూడాలి? మీరు తెలుసుకోవలసిన ముఖ్య కారణాలు ఇక్కడ ఉన్నాయి:

కథను మరోస్థాయికి తోడ్కొని వెళ్లే తారాగణం ప్రసాద్‌గా సుహాస్ అద్భుతమైన నటనను ప్రదర్శించారు. ప్రతి సన్నివేశంలో హాస్యం, భావోద్వేగాల సమ్మేళనాలను పండించారు. సంగీత విపిన్ అతనికి సహకారం అందించే, అర్థం చేసుకున్న భార్యగా ఇందులో కనిపించగా, వెన్నెల కిషోర్ అద్భుతమైన కామెడీ టైమింగ్ ప్రేక్షకులకు నవ్వు తెప్పిస్తుంది. రాజేంద్ర ప్రసాద్ మరియు మురళి శర్మ తమ నటనానుభవంతో కోర్టు రూమ్ డ్రామాను మరింత రక్తి కట్టించగా, వీరు తారాగణంలో ప్రధాన పాత్రధారులుగా నిలిచారు.

దర్శకత్వం మరియు సినిమాటోగ్రఫీకి అత్యంత ప్రశంసలు..దర్శకుడు సందీప్ రెడ్డి బండ్ల హాస్యాన్ని సామాజిక వ్యాఖ్యానంతో అద్భుతంగా సమతుల్యం చేశారు. కథనాన్ని ఆకర్షణీయంగా, సందర్భోచితంగా చిత్రీకరించారు. సినిమాటోగ్రాఫర్ సాయి శ్రీరామ్ ఈ సినిమాలో ఉల్లాసమైన సన్నివేశాలను ఉత్సాహభరితమైన విజువల్స్‌తో అందించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా సుందరమైన ప్రదేశాలను చిత్రీకరించగా, అవి కథనంలో ప్రేక్షకులు మరింత లీనమయ్యేలా చేశాయి.

సాపేక్షంగా మరియు ఆకర్షణీయంగా ఉండే కథాంశం..ఊహించకుండా భార్య గర్భం దాల్చితే, కండోమ్ కంపెనీని కోర్టుకు ఈడ్చే మధ్యతరగతి వ్యక్తి పరిస్థితి ఎంత చిత్రంగా ఉంటుందో అంతే విచిత్రంగా ఉంటుంది. ఈ చిత్రం రోజువారీ జీవితంలోని పోరాటాలను అద్భుతంగా తెరపై చూపిస్తుంది. హాస్యం, ఫ్యామిలీ డైనమిక్స్, ప్రేక్షకులను చివరి వరకు ఆసక్తిగా ఉంచే ఆకర్షణీయమైన కోర్టు రూమ్ డ్రామా చుట్టూ కథ కొనసాగుతుంది.

మనసును కదిలించే 'నువ్వే నాకు లోకం' పాట విజయ్ బుల్గానిన్ స్వరపరిచి కార్తీక్ ఆలపించిన 'నువ్వే నాకు లోకం' సినిమా భావోద్వేగాలను అందంగా వ్యక్తపరుస్తుంది. హృదయాన్ని సృజించే సాహిత్యం, ప్రశాంతమైన శ్రావ్యతతో, ఈ పాట శ్రోతలను ఆకట్టుకుని, చక్కని ప్రజాదరణ పొందగా, ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

మిమ్మల్ని నవ్వించే అనూహ్య ముగింపు

కథ ఒక కొలిక్కి వస్తోందని మీరు భావిస్తున్నప్పుడు, ఇది ఊహించని మలుపును తెస్తుంది. అది మిమ్మల్ని నవ్వుల్లో మునిగి తేలేలా చేస్తుంది. ఇది సినిమాను హాస్యంతో ముడిపెట్టే పరిపూర్ణ ఆశ్చర్యం అని చెప్పవచ్చు. మీ మోముపై చిరునవ్వు మిగుల్చుతుందని ఈ సినిమా నిర్ధారిస్తుంది.

## లక్షకు రూ. 2 లక్షలు.. 5 లక్షలకు 10 లక్షలు.. కేంద్రం హామీతో గ్యారెంటీ రిటర్న్స్!

**న్యూఢిల్లీ-నవభూమి:** పోస్టాఫీస్ పథకాలకు ఇతర స్కీమ్స్ కంటే కూడా ఆదరణ కాస్త ఎక్కువే ఉంటుంది. ఇక్కడ ఇతర స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ కంటే రాబడి తక్కువగా ఉన్నప్పటికీ ఎలాంటి రిస్క్ ఉండదు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ఉంటుంది కాబట్టి గ్యారెంటీ రిటర్న్స్ వస్తాయి. ఇప్పుడు మనం పెట్టుబడిని గ్యారెంటీగా డబుల్ చేసే ఒక పోస్టాఫీస్ పథకం గురించి తెలుసుకుందాం.

చాలా మంది సంపాదిస్తున్నప్పటికీ.. దానిని సరైన విధంగా పొదుపు చేయలేక.. మదుపు చేయలేక.. మంచి రాబడిని కోల్పోతుంటారు. కొందరికి పెట్టుబడి పెట్టాలన్న ఆసక్తి ఉన్నప్పటికీ.. ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలో తెలియక ఇబ్బందులు పడుతుంటారు. ఇంకొందరు పెట్టుబడి పెడితే ఎక్కడ ఆ డబ్బులు రావో.. పోతాయో అన్న కంగారులో ఉంటారు. ఇలాంటి వారి కోసం ఎలాంటి రిస్క్ లేని పథకాలు కూడా మనకు చాలానే ఉన్నాయి. స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లు వంటి వాటిల్లో పెట్టుబడులు అంటే రిస్క్‌తో కూడుకున్నవి ఉంటాయి. కానీ.. కేంద్ర ప్రభుత్వం అందించే పోస్టాఫీస్ పథకాలు బెస్ట్ అని చెప్పొచ్చు. వీటినే చిన్న మొత్తాల పొదుపు పథకాలు అంటారు. ఇక్కడ ఎలాంటి రిస్క్ ఉండదు.

ఈ పోస్టాఫీస్ పథకాల్లో నిర్దిష్ట వడ్డీ రేటు ప్రకారం.. నిర్ణీత కాల వ్యవధిలో రిటర్న్స్ వస్తాయి. వీటిల్లో ఒక పథకం కిసాన్ వికాస్ పత్ర. ఇక్కడ కచ్చితంగా మీ పెట్టుబడి డబుల్ అవుతుంది. ఎలాంటి రిస్కూ అవసరం లేదు. దీంట్లో మీరు కనీసం రూ. 1000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. గరిష్టంగా ఎలాంటి పరిమితి లేదు. అంటే ఎంతైనా మీ స్థోమతను బట్టి ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉంటుంది. దీంట్లో ప్రస్తుతం 7.50 శాతం వడ్డీ రేటు ఉంది.

ఇక దీని ప్రకారం.. సరిగ్గా 115 నెలల్లో మీరు పెట్టిన పెట్టుబడి డబుల్ అవుతుంది. అంటే 9 సంవత్సరాల 7 నెలలు పడుతుంది. ఇక్కడ ఎంతైనా అంటే ఉదాహరణకు మీరు లక్ష ఇన్వెస్ట్ చేస్తే.. 115 నెలలకు రూ. 2 లక్షలు వస్తాయి. ఇలాగే రూ. 5 లక్షలు పెడితే రూ. 10 లక్షలు వస్తాయి. రూ. 20 లక్షలు జమ చేస్తే.. 115 నెలల్లో అది రూ. 40 లక్షలు అవుతుంది. అందుకే ఈ పథకానికి మంచి డిమాండ్ ఉంది.

పోస్టాఫీస్ లేదా గుర్తింపు పొందిన బ్యాంకుల్లో.. సింగిల్ అకౌంట్ తెరవొచ్చు. లేదా గరిష్టంగా ముగ్గురు కలిసి జాయింట్ అకౌంట్ తెరవొచ్చు. మైనర్ పేరిట గార్డియెన్ అకౌంట్ తెరవొచ్చు. ఈ స్కీమ్ కింద ఎన్ని అకౌంట్లయినా తెరిచే వీలుంటుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అకౌంట్ తెరిచిన రెండేళ్ల 6 నెలల తర్వాత ఎప్పుడైనా ముందస్తు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఇక పోస్టాఫీస్ పథకాల్లో వడ్డీ రేట్లను కేంద్రం ప్రతి 3 నెలలకు ఓసారి సవరిస్తుంటుంది. ఇక్కడ వడ్డీ రేట్లు పెరగొచ్చు లేదా తగ్గొచ్చు లేదా స్థిరంగా ఉండొచ్చు. వడ్డీ రేట్లు పెరిగితే రాబడి ఇంకాస్త ఎక్కువగా ఉంటుందని గుర్తించాలి.

## ఒప్పో రినో13 సిరీస్ కొత్త 8350 చిప్‌సెట్, AI-రెడీ కెమెరాలతో విడుదల




**హైదరాబాద్ - నవభూమి:**ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రినో13 సిరీస్ 5Gని OPPO India అధికారికంగా విడుదల చేసింది. స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని పునర్నిర్వచించేలా దీన్ని తయారు చేశారు. దీనిలోని MediaTek Dimensity 8350 SoCతో శక్తినిచ్చే ఫ్లాగ్‌షిప్-స్థాయి కెమెరా సిస్టమ్‌ను కలిగి ఉంది. ఇమిజంగ్, ప్రొడక్టివిటీ రెండింటినీ అందించేలా అత్యాధునిక AI ఫీచర్లు కలిగిన, రినో13 సిరీస్ అసాధారణమైన పనితీరును అందించేలా తయారు చేశారు. తన అల్ట్రా-డ్యూరబుల్ డిజైన్‌తో, ఈ సిరీస్ - రినో 13 రినోతో సహా - నీరు ధూళి నిరోధకత కోసం IP66, IP68 IP69 సర్టిఫికేషన్లను కూడా కలిగి ఉంది. ఇది శైలి మన్నిక రెండింటినీ విలువైన వారికి సరైన పరికరం గా ఉంటుంది. అదనంగా, రినో 13 సిరీస్ 80W SUPERVOOC ఫాస్ట్-ఛార్జింగ్‌ను అందిస్తుంది. ఇది విస్తరించిన వినియోగానికి కోసం సరైన శక్తిని నిర్ధారిస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లు ఇప్పుడు మెయిన్‌లైన్ రిటైల్ అవుట్‌లెట్‌లు, ఒప్పో ఇ-స్టోర్ Flipkart ద్వారా కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయి. ధరలు INR 37,999 నుంచి ప్రారంభమవుతాయి.

**మన్నికతో ఫ్లాగ్‌షిప్ డిజైన్**

సరికొత్త OPPO Reno13 5G ముందు, వెనుక భాగాల్లో ఏరోస్పేస్-గ్రేడ్ అల్యూమినియం ఫ్రేమ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ని కలిగి ఉంది. వెనుక దాని వన్-పీస్ స్కల్ప్టెడ్ గ్లాస్ అనేది ఐవరీ వైట్ వేరియంట్‌లో ప్రత్యేకమైన టెక్చర్‌తో మ్యాట్ గ్లోస్ ఫినిషింగ్‌ల మిశ్రమంగా ఉంటుంది. అదే విధంగా భారతదేశంలో ఒప్పో ప్రత్యేకమైన లూమినస్ బ్లూ కలర్ వేరియంట్‌నూ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ వేరియంట్ ఆఫ్‌సెట్ ప్రింటింగ్, రిఫ్లెక్టివ్ కోటింగ్‌తో సాధించిన ప్రత్యేకమైన గ్లోయింగ్ ఎఫెక్ట్‌ను కలిగి ఉంటుంది. ఇది కెమెరా మాడ్యూల్ చుట్టూ సూక్ష్మంగా, ఆకర్షణీయమైన గ్లోయింగ్ అవుట్‌లైన్‌ను ఉత్పత్తి చేస్తుంది.

ఈ పరికరం ఒప్పో సిగ్నేచర్ ఆల్-రౌండ్ ఆర్మర్ ఆర్కిటెక్చర్‌తో వస్తుంది. ఇది అదనపు మన్నికను, అంతర్గత భాగాలను షాక్ నుంచి రక్షిస్తుంది. స్మార్ట్‌ఫోన్ IP66, IP68 IP69-సర్టిఫైడ్, దుమ్ము మంచినీటిలో 1.5 మీటర్ల వరకు మునిగి ఉన్నప్పటికీ నిరోధకతను కలిగి ఉంటుందని ఒప్పో ల్యాబ్‌లలో 2 మీటర్లలోతులో 30 నిమిషాల పాటు ఉంచి పరీక్షించి, ధృవీకరించారు.

అదే విధంగా రినో13 సన్నని, తేలికపాటి డిజైన్‌తో ప్రత్యేకంగా నిలుస్తుంది: ఐవరీ వైట్ మోడల్ కేవలం 7.24m m సన్నగా ఉంటుంది. అయితే, Luminous Blue మోడల్ 7.29 m mసన్నగా ఉంటుందిబీ హ్యాండ్‌సెట్‌లు తేలికగా 181g మేర ఉంటాయి.

**ధర - లభ్యత**

నూతన OPPO Reno13 5G రెండు వేరియంట్లలో నికర ప్రభావవంతమైన ధరతో లభిస్తుంది. అన్ని ఆఫర్లు 8GB + 128GB%¿ì INR 34,199 8GB + 256GB వేరియంట్‌కు INR 35,999. అయితే Reno13 Pro 5G రెండు వేరియంట్లలో నికర ప్రభావవంతమైన ధరతో లభిస్తాయి. అన్ని ఆఫర్లు 12GB + 256GBకి INR 44,999 12GB + 512GB వెర్షన్ INR 49,499 ధరలో లభిస్తుంది.

నూతన రినో13 సిరీస్ నుండి కొనుగోలుకు అందుబాటులో ఉంటుంది. ఉంది,

**ఉత్తేజకరమైన ఆఫర్లలో:**

నూతన OPPO Reno13పై 6 నెలల లిక్విడ్ డ్యామేజ్ ప్రొటెక్షన్, 3,000 ఎక్స్ఛేంజ్ బోనస్, మెయిన్‌లైన్ రిటైల్ అవుట్‌లెట్‌లు, OPPO E-store Flipkartలో లభిస్తుంది.

## జియో సిమ్ వాడుతున్నారా.. ఆ రెండు ప్లాన్స్ గోవిందా..

**న్యూఢిల్లీ- నవభూమి:**ట్రాయ్ ఆదేశాలకు అనుగుణంగా.. రెండు వాయిస్ ఓన్లీ ప్లాన్లను ఇటీవల జియో ప్రవేశపెట్టింది. 84 రోజుల వ్యాలిడీటితో రూ. 458 ప్లాన్‌తోపాటు 365 రోజుల వ్యాలిడీటితో రూ. 1958 ప్లాన్ తీసుకువ వచ్చింది. వీటికి జియో టీవీ, సినిమా, క్లౌడ్ సబ్ స్క్రిప్షన్ సదుపాయాలను కలిపింది. జియో సిమ్ వాడుతున్నారా.. ఆ రెండు ప్లాన్స్ గోవిందా..ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో కీలక నిర్ణయం తీసుకొంది. ప్రస్తుతం అమలు చేస్తున్న రెండు ప్రీపెయిడ్ ప్లాన్లను తొలగించింది. వాయిస్, ఎస్సెమ్మెస్‌ల కోసం ప్రత్యేకంగా ప్యాకేజీలు తీసుకురావాలంటూ టెలికాం సంస్థలకు ట్రాయ్ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కొత్త ప్లాన్లను జియో తీసుకు వచ్చింది. అదే సమయంలో పాత ప్లాన్లను తీసి వేసింది.

ఇప్పటి వరకు అందిస్తున్న రూ.189, రూ. 479 రీఛార్జి ప్లాన్లను తన వెబ్ సైట్ నుంచి తొలగించింది. తక్కువ డేటా, ఎక్కువ రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్లు కావాలనుకే యూజర్ల కోసం జియో గతంలో ఈ ప్లాన్లను అందుబాటులోకి తీసుకు వచ్చింది. రూ. 189 ప్లాన్ కింద 28 రోజులు వ్యాలిడిటీ ఉండగా... రూ. 479 ప్లాన్ కింద 84 రోజుల వ్యాలిడిటీ ఉండేది.



# రైతులకు ఇచ్చిన హామీలు ఏవి.. యూపీ బడ్జెట్‌పై అఖిలేష్ యాదవ్ కీలక వ్యాఖ్యలు..



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఉత్తర్ ప్రదేశ్ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రూ. 8 లక్షల 8 వేల 736 కోట్ల 6 లక్షల బడ్జెట్‌ను ఈరోజు సమర్పించింది. ఇది 2024-2025 సంవత్సరపు బడ్జెట్ కంటే 9.8 శాతం ఎక్కువ కావడం విశేషం. అయితే ఈ బడ్జెట్‌పై ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి సంబంధించి అనేక హామీలు ఇచ్చినప్పటికీ, అవన్నీ నెరవేరలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు పెరిగిపోతున్నాయి తప్ప, రైతుల సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయని అఖిలేష్ విమర్శించారు. ఈ క్రమంలో రైతుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీల గురించి ప్రస్తావించారు అఖిలేష్ యాదవ్. బీజేపీ తన మ్యానిఫెస్టోలో రాబోయే ఐదు సంవత్సరాల్లో రైతులకు నీటిపారుదల కోసం ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఈ హామీ నెరవేర్చలేదని అఖిలేష్ యాదవ్ అన్నారు. మరోవైపు సర్దార్ వల్లభాయ్ పటేల్ వ్యవసాయ మౌలిక సదుపాయాల మిషన్ కోసం రూ. 25 వేల కోట్లను కేటాయించడం. ఈ నిధుల ద్వారా రైతుల మౌలిక సదుపాయాలు మెరుగుపడే అవకాశం ఉన్నప్పటికీ, ఈ హామీ కూడా పూర్తిగా అమలు కాలేదని అఖిలేష్ అన్నారు.



## యూఎస్ఏఐడీ నిధుల వ్యవహారం కలవరపెడుతోంది.. ఎంఈఏ స్పందన



**న్యూఢిల్లీ- నవభూమి:** భారతదేశంలోని ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు గత బైడెన్ ప్రభుత్వం 21 మిలియన్ డాలర్లు కేటాయించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుమానాలు వ్యక్తం చేయడం, అక్కడ ఎవరో ఎన్నిక కావాలని ప్రయత్నం చేసినట్టు ఉందని వ్యాఖ్యానించడంపై భారత విదేశాంగ శాఖ శుక్రవారంనాడు స్పందించింది. అమెరికా కార్యకలాపాలు, ఫండింగ్‌కు సంబంధించి యూఎస్ అడ్మినేషన్ సమాచారం తీవ్రంగా కలవరపెడుతోందని ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ అన్నారు.
"యూఎస్ఏ కార్యకలాపాలు, ఫండింగ్‌కు సంబంధించి యూఎస్ అడ్మినేషన్ పేర్కొన్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇది తీవ్రంగా కలవరచే అంశం. ఇది భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కిందకే వస్తుంది. దీనిపై సంబంధిత శాఖలు, ఏజెన్సీలు పరిశీలిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు దీనిపై వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుంది. సంబంధిత అధికారులు పరిశీలించిన తర్వాత దీనిపై అప్డేడ్‌తో మీ ముందుకు వస్తాం" అని మీడియాతో మాట్లాడుతూ రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. డొనాల్డ్ ట్రంప్ గురువారంనాడు వాషింగ్టన్ డీసీలో జరిగిన రిపబ్లికన్ గవర్నర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతూ, భారత్‌లో ఎన్నికల కోసం మనం 21 మిలియన్ డాలర్లు ఎందుకు కేటాయించాలి? మనకే చాలా సమస్యలు ఉన్నాయి. మనం మన ఎన్నికల గురించి చూసుకోవాలి. భారత్‌లో ఎన్నికల కోసం 21 మిలియన్ డాలర్లు కేటాయించిన విషయం మీకు తెలుసా? అక్కడే ఎవరో ఎన్నిక కావాలని ప్రయత్నించినట్టు కనిపిస్తోంది. ఇది కిక్‌బ్యాక్ స్కీమ్‌లా కనిపిస్తోంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనికి ముందు ఫిబ్రవరి 16న అమెరికా డోజ్ శాఖ యూఎస్ఏఐడీ నిధుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. పొదుపు చర్యల్లో భాగంగా భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఉద్దేశించి 21 మిలియన్ డాలర్ల నిధులను రద్దు చేస్తున్నట్ట ప్రకటించింది. కాగా, యూఎస్ఏఐడీ నిధులు భారత్‌లో ఎవరికి చేరాయో చెప్పాలనే డిమాండ్లు భారత్‌లో మొదలయ్యాయి. బీజేపీ, కాంగ్రెస్ మధ్య వివాదానికి కూడా దారితీసింది. కాంగ్రెస్ హయాంలో యూపీఏ ప్రభుత్వానికి, ఎన్జీఓలకు మిలియన్ డాలర్ల నిధులు అందాయని బీజేపీ విమర్శలు గుప్పించింది. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక నిధుల రాకడ తగ్గిందని ఆ పార్టీ నేతలు తెలిపారు. అయితే ఈ వాదనను కాంగ్రెస్ కొట్టివేసింది. ట్రంప్ చేసిన ఆరోపణల్లో అర్థం లేదని, యూఎస్ఏఐడీ నిధులు ఎవరెవరికి అందాయనే వివరాలతో ఆయన శ్వేతపత్రం విడుల చేయాలని డిమాండ్ చేసింది.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన రేఖా గుప్తా



**న్యూఢిల్లీ- నవభూమి:** కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న రేఖాగుప్తా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును శుక్రవారంనాడు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్‌ను సైతం కలుసుకున్నారు. దీనికిముందు షాలిమార్ భాగ్ నివాసం వద్ద తనను అభినందించేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలందరికీ రేఖా గుప్తా కృతజ్ఞతలు తెలిపారు. తొలి మంత్రివర్గ సమావేశంలోనే ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌ను ఆమోదించినట్టు తెలిపారు. తక్కిన అంశాలను కూడా తదుపరి మంత్రివర్గం సమావేశంలో చర్చిస్తామని చెప్పారు.
రామ్‌లీలా మైదానంలో గురువారంనాడు జరిగిన కార్యక్రమంలో ఢిల్లీ 9వ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సెనా ఆమె చేత, ఆమె మంత్రివర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. పర్వేష్ వర్మ, ఆశిష్ సూద్, మంజిందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ సింగ్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.
"గురువారంనాడు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌ను ఆమోదించాం. స్కీమ్ వివరాలను త్వరలో ప్రజల ముందుకు తెస్తాం. ఈరోజు పీడబ్ల్యూబీ, జల్ బోర్డు అధికారులతో క్యాబినెట్ సమావేశమవుతోంది. రోడ్లపై గుంతల సమస్యను అధికారులతో చర్చిస్తాం" అని మీడియాతో మాట్లాడుతూ రేఖా గుప్తా తెలిపారు.

## అన్నిరంగాల్లో విజనరీ నేతలు తయారు కావాలి.. సోల్ సదస్సులో మోదీ

**న్యూఢిల్లీ- నవభూమి:** వివిధ రంగాల్లో మార్పు తెచ్చే విజనరీ నేతలు తయారు కావాలని, స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్ షిప్ ఇందుకు ఎంతో దోహదపడుతుందని తాను ఆశిస్తున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారంనాడు జరిగిన 'సోల్' లీడర్‌షిప్ సదస్సులో ప్రధాని మాట్లాడుతూ, వికసిత్ భారత్ (అభివృద్ధి భారతం) జర్నీలో స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూషన్ ప్రారంభించడం ఒక ల్యాండ్‌మార్క్ అవుతుందన్నారు.
"జాతి నిర్మాణంలో పౌరుల అభివృద్ధి కీలకం. మనకు ప్రతి రంగంలోనూ ఉన్నత స్థాయి నాయకులు కావాలి. ఆ దిశగా మన ప్రయాణంలో స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ కీలకమైన ముందడుగు అవుతుంది" అని మోదీ అన్నారు. గిఫ్ట్‌సిటీ సమీపంలో సోల్ కొత్త క్యాంపస్ త్వరలోనే ప్రారంభమవుతుందని, ఆర్కిటెక్చరల్ అచీవ్‌మెంట్ ఇదొక బెంచ్‌మార్క్ అవుతుందని అన్నారు. ఇందుకు సంబంధించిన మోడల్, ప్లాన్‌ను తనకు చైర్మన్ చూపించారని చెప్పారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనే నాయకత్వం అవసరం ఉందని మోదీ చెప్పారు. యువ నేతలతోనే ఇండియాలో మార్పు సాధ్యమని స్వామి వివేకానంద చెప్పిన మాటలను ప్రధాని గుర్తు చేశారు. వందమంది శక్తివంతులైన యువతీయువకులను తనకు ఇస్తే ఇండియాను మార్చి చూపిస్తానని ఆయన చెప్పేవారని, సరైన నాయకులతో ఇండియా కేవలం ఫ్రీడం పొందడమే కాకుండా గ్లోబల్ లీడర్‌గా కూడా నిలుస్తుందని తాను బలంగా నమ్ముతానని ప్రధాని చెప్పారు.

## నువ్వు స్లిమ్‌గా, అందంగా ఉన్నావంటూ అమ్మాయిలకు మెసేజ్‌లు చేయడం నేరమే..: ముంబయి కోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** అమ్మాయిల ప్రొఫైల్ ఫోటోలు కనిపిస్తే చాలు.. కొందరు అబ్బాయిలు వెంటనే మెసేజ్‌లు చేయడం ప్రారంభిస్తారు. మీరు చాలా బాగున్నారు, అందంగా కనిపిస్తున్నారు, మీకు పెళ్లి అయిందా లేదా, నాతో మాట్లాడొచ్చు కదా, మీకు ఈ డ్రెస్ బాగుంది, చీర కట్టుకుని రెడీ అయి ఫొటోలు పెట్టొచ్చు కదా అంటూ అడిగేస్తుంటారు. అలాంటి వారందరికీ షాక్ ఇస్తూ ముంబయి సెషన్స్ కోర్టు ఈ షాకింగ్ తీర్పు ఇచ్చింది. గుర్తు తెలియని మహిళకు ఈ రకమైన సందేశాలు పంపడం కూడా నేరం కిందకే వస్తుందని తేల్చి చెప్పింది. ఓ మహిళకు ఇలా మెసేజ్‌లు చేసిన వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష కూడా విధించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. 2020లో మాజీ మహిళ కార్పొరేటన్ తన భర్తతో కలిసి ఓ వ్యక్తిపై కేసు పెట్టింది. వాట్సాప్ ద్వారా తరచుగా మెసేజ్‌లు చేస్తూ ఓ వ్యక్తి తనను వేధిస్తున్నాడని వివరించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఆపై ముంబయి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. ఈక్రమంలోనే విచారణ చేపట్టిన న్యాయస్థానం సాక్ష్యాధారాలను పరిశీలించి మరీ అతడికి మూడు నెలల శిక్ష విధించింది. అయితే తానేమీ తప్పు చేయలేదంటూ సదరు యువకుడు సెషన్స్ కోర్టుకు వెళ్లారు. ఈక్రమంలోనే ఫిబ్రవరి 18వ తేదీ రోజును సెషన్స్ కోర్టు విచారణ జరిపింది.
రాత్రిపూట గుర్తు తెలియని అమ్మాయిలకు నువ్వు స్లిమ్‌గా ఉన్నావు, చాలా స్మార్ట్‌గా కనిపిస్తున్నావు, అందంగా ఉన్నావు, నువ్వంటే నాకిష్టం, నీకు పెళ్లైందా లేదా అంటూ మెసేజ్‌లు పంపపడం అశ్లీలత కిందకే వస్తుందని చెప్పింది. కావాలనే సదరు యువకుడు మాజీ కార్పొరేటర్‌కు ఈ రకమైన మెసేజ్‌లను అర్ధరాత్రి పంపించినట్లు పూర్తి ఆధారాలు ఉన్నాయని అదనపు సెషన్స్ జడ్జి డిజి ధోబ్లే వెల్లడించారు. మెసేజ్‌లు చేసిన వ్యక్తి ఫిర్యాదుదారుడికి తెలియదని.. ఇలాంటి మెసేజ్‌లు పంపిస్తే ఆమె భర్త కూడా ఏమాత్రం సహించరని చెప్పారు. ఈక్రమంలోనే సదరు వ్యక్తి దోషిగా తేలుస్తున్నట్లు వివరించి మేజిస్ట్రేట్ కోర్టు విధించిన మూడు నెలల శిక్షను అమలు చేయాలని స్పష్టం చేశారు. కానీ నిందితుడు మాత్రం కావాలనే వాళ్లు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు చెప్పగా.. స్పందించిన జడ్జి ఏ మహిళ కూడా ఓ వ్యక్తిపై ఆరోపణలు చేసేందుకు తన గౌరవాన్ని ఫణంగా పెట్టరని వివరించారు. మీరు మెసేజ్‌లు చేసినట్లు అన్ని ఆధారాలు ఉన్నాయంటూనే వాటిని మరోసారి అతడికి చూపించారు.

## సరిహద్దుల్లో కాల్పులు.. భారత్-పాక్ మధ్య నేడు కీలక భేటీ



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాక్ సరిహద్దులో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకోవడం తీవ్ర సంచలనంగా మారింది. కొన్ని రోజుల క్రితం పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాక్ రేంజర్లు.. సరిహద్దు వెంట ఇష్టం వచ్చినట్లు కాల్పులకు తెగబడ్డారు. అయితే సరిహద్దుల్లో కాల్పులపై అలర్ట్ అయిన భారత్.. ఎదురుకాల్పులు జరిపి.. దాయాది సైనికులను సమర్థవంతంగా కట్టడి చేసింది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య కీలక సమావేశానికి పిలుపునిచ్చారు. దీనికితోడు గురువారం సరిహద్దుల్లో నియంత్రణ రేఖ వెంట ఉగ్రవాద కదలికలను గుర్తించినట్లు భారత సైనిక ఉన్నతాధికారులు పేర్కొనడం మరింత చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే భారత్-పాక్ సైనిక అధికారులు సమావేశం అయ్యేందుకు సిద్ధం అయ్యారు. సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాక్ కాల్పులకు తెగబడగా.. ఈ పరిణామాలపై చర్చలు జరిపేందుకు జమ్మూ కాశ్మీర్‌లోని పూంఛ్‌లో శుక్రవారం భారత్, పాక్ మిలిటరీ ఫ్లాగ్ మీటింగ్ జరిపేందుకు సిద్ధమయ్యారు. ఇరుదేశాల మధ్య కీలక సమావేశం జరగనుందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. గురువారం పూంఛ్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదులు సంచరించినట్లు అధికారులు వెల్లడించారు. ఉగ్రవాద కదలికలతో అలర్ట్ అయిన భద్రతా దళాలు.. వారిపై ఎదురుకాల్పులు జరిపినట్లు వివరించారు
ఈ ఘటనతో పూంఛ్ సెక్టార్‌లో ఉగ్రవాదుల కోసం భారీ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని భారత సైన్యానికి చెందిన ఓ కీలక అధికారి వెల్లడించారు. ఈ క్రమంలోనే ఇటీవల భారత్-పాక్ సరిహద్దుల్లో జరిగిన పరిణామాలపై రెండు దేశాల సైన్యాధికారులతో ఫ్లాగ్ మీటింగ్ జరగనుందని తెలిపారు. అయితే సరిహద్దుల్లో గత కొన్ని రోజులుగా వివిధ మార్గాల్లో పాక్ వైపు నుంచి కవ్వింపులు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే గతవారం ఘాటి సెక్టార్‌లో పాక్ సైన్యం కాల్పులకు తెగబడింది. అయితే ఈ కాల్పులను భారత సైనికులు బలంగా తిప్పికొట్టారు. ఈ కాల్పుల్లో పాక్ వైపు పలువురు సైనికులు మృతి చెందినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ ఘటన కారణంగా రెండు దేశాల మధ్య ఉన్న కాల్పుల విరమణ ఒప్పందానికి ఎలాంటి నష్టం జరగలేదని భారత సైన్యం స్పష్టం చేసింది. సరిహద్దుల వద్ద కాల్పులు, ఐఈడీ పేలుడు సంభవించడంతో కొంత ఉద్రిక్త పరిస్తితి చోటుచేసుకుందని వెల్లడించింది. ఈనెల 4, 5వ తేదీల మధ్య అర్ధరాత్రి కొంతమంది చొరబాటుదారులు.. పాక్ వైపు నుంచి భారత్‌లోకి చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నించగా.. వారిపై భారత సైనికులు కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఏడుగురు హతం అయ్యారు. ఆ తర్వాత కూడా పలుమార్లు జరిగిన ఉగ్రవాదుల కాల్పుల్లో ఇద్దరు సైనికులు మృతి చెందగా పలువురు గాయాల పాలయ్యారు.

## ప్రారంభమైన యమునా నదిలో కాలుష్య ప్రక్షాళన



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని న్యూఢిల్లీలోని యమునా నదిలో కాలుష్య ప్రక్షాళన పనులు ప్రారంభమైనాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం.. ఇంకా చెప్పాలంటే.. ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా బాధ్యతలు చేపట్టే రెండు రోజుల ముందు ఈ నదీ ప్రక్షాళన కార్యక్రమం మొదలైంది. యమునను శుభ్రపరిచే కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో.. యంత్రాల సహాయంతో నదిలో చెత్తను తీసి వేస్తున్నారు. అందుకోసం ఢిల్లీ ప్రభుత్వం పక్కా కార్యాచరణ రూపొందించింది. అందులోభాగంగా.. చెత్త స్కిమ్మర్లు, కలుపు మొక్కలు తీసే యంత్రాలతో నదిలో క్లీనింగ్ పనులు చేపట్టారు. యమునా నదిని శుభ్రం చేసేందుకు బహుముఖ వ్యూహంతో ప్రభుత్వం ముందుకు వెళ్లోంది. మూడు సంవత్సరాల్లో యమునా నదిని ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా ఢిల్లీ ప్రభుత్వం నిర్దేశించుకొంది.

**బీజేపీ మేనిఫెస్టోలో..**

అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో.. తాము అధికారంలోకి వస్తే.. యమునా నదిని శుభ్రం చేస్తామని బీజేపీ తన మేనిఫెస్టోలో పొందు పరిచింది. నదిని పునరుద్ధరించడంలో భాగంగా యమునను శుభ్రపరిచి.. ఆ నీటిని సాగు, తాగు నీటికి వినియోగించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేసింది. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. దీంతో యమున నదిని శుభ్రపరిచే కార్యక్రమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.
ఇక సెప్టెంబర్ 15వ తేదీన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సెనా.. ఉన్నతాధికారులతో సమావేశమై.. యమునా నదిలోని నీటి ప్రక్షాళనకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి.. ఉన్నత స్థాయికి వారాంతంలో నివేదిక అందచేయాలని అది కూడా ఈ సమావేశంలో ఎల్ జీ ఆదేశించారు.
అయితే 2015లో అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పార్టీ.. రానున్న ఐదేళ్లలో యమునా నదిని శుభ్రం చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఆ హామీని ఆ ప్రభుత్వం నెరవేర్చలేదు సరికదా.. 2025 నాటికి ఈ నది మరింత కాలుష్యంగా మారింది. అయితే 2015, 2021 మధ్య యమునా నదిని కాలుష్యం కోరల నుంచి బయటకు తీసుకు వచ్చేందుకు దాదాపు రూ. 6856.91 కోట్లు ఖర్చు చేసినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇక బీజేపీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా గురువారం రాం లీలా మైదానంలో ప్రమాణ స్వీకారం చేశారు. మధ్యాహ్నం 3.00 గంటలకు ఢిల్లీ సెక్రటేరియట్‌లో సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీఎంఓ కార్యాలయ సిబ్బందితో భేటీ అయ్యారు. ఆ తర్వాత వసంత్ ఘాట్ సమీపంలోని యమునా హారతి కార్యాక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా పాల్గొన్నారు.
70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5వ తేదీన ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి 8వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో బీజేపీకి 48 స్థానాలు కైవసం చేసుకోగా.. ఆమ్ ఆద్మీ పార్టీ మాత్రం కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ మాత్రం వరుసగా మూడోసారి సైతం ఖాతా తెరవ లేదు. దాదాపు 26 ఏళ్ల తర్వాత ఢిల్లీలో కమలం పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోంది. ఈ ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీలే ఆ పార్టీ గెలుపునకు బాట వేసిందనే చర్చ సాగుతోంది. అంతేకాకుండా.. ఆమ్ ఆద్మీ పార్టీ అవినీతితోపాటు ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వైఖరి సైతం ఆప్‌ను ప్రతిపక్షానికి పరిమితం చేసిందని వాదన నడుస్తోంది.

## పవార్‌కు కుర్చీ చూపించి నీళ్లు అందించిన మోదీ



**న్యూఢిల్లీ- నవభూమి:** సైద్ధాంతిక విభేదాలు, పార్టీలు, హోదాలు వేరైనా కొందరు రాజకీయ నేతలు తమ సీనియర్ రాజకీయ నేతలతో ఒకే వేదికను పంచుకున్నప్పుడు వారి పట్ల ఆప్యాయతను చాటుకుంటారు. పెద్దల పట్ల గౌరవం ప్రదర్శించి తమ నమ్రతను చాటుతారు. మరాఠా సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ శరద్ పవార్ పట్ల స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇలాంటి గౌరవాన్నే ప్రదర్శించి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఆ తర్వాత సభలో కరతాళ ధ్వనులు మార్మోగాయి. ఢిల్లీలో శుక్రవారంనాడు జరిగిన 98వ అఖిల్ భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన్‌లో ఈ అపురూప ఘట్టం చోటుచేసుకుంది.
వేదికపై పవార్ తన సీటు దగ్గరకు వచ్చి కూర్చునే ప్రయత్నం చేస్తుండగా మోదీ ఆయనకు సహకరించి ఆయన కూర్చీలో కూర్చున్న తర్వాత తాను కూడా కూర్చున్నాను. వాటర్ బాటిల్ మూత తీసి అందులోని నీటిని పవార్‌కు ఎదురుగా ఉంచిన గ్లాసులో పోసారు. తన కంటే సీనియర్ నేతల పట్ల ప్రధాని చూపిన నమ్రత సభికులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. కొందరైతే హర్షాతిరేకం వ్యక్తం చేస్తూ చప్పట్లు చరిచారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో మోదీ ప్రారంభిస్తూ, ఈవెంట్ రెసెప్షన్ కమిటీ చైర్మన్ అయిన పవార్‌ను సైతం జ్యోతి ప్రజ్వలనలో పాలుపంచుకోవాలని కోరారు. అనంతరం ప్రధాని ప్రసంగిస్తూ. శరద్ పవార్ ఆహ్వానించడంతో ఇంతటి సాంప్రదాయక ఈవెంట్‌లో పాల్గొనే అవకాశం తనకు వచ్చిందన్నారు.
అనంతరం కార్యక్రమం నడుస్తున్నంత సేపూ మోదీ, పవార్ ఎంతో ఆప్యాయంగా మాట్లాడుకోవడం కనిపించింది.

## రాఖీ సావంత్‌కు మహారాష్ట్ర పోలీసులు సమన్లు



**ముంబై-నవభూమి:** "ఇండియాస్ గాట్ లాటెండ్"షోలో ప్రాడ్‌కాస్టర్ రణవీర్ అలహాబాదియా వివాదాస్పద వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో టీవీ నటి రాఖీ సావంత్ కు మహారాష్ట్ర సైబర్ పోలీసులు సమన్లు పంపారు. ఆమె వాంగ్మూలం నమోదు చేసేందుకు ఫిబ్రవరి 24న తమ ముందు హాజరుకావాలని కోరారు.
రాఖీసావంత్ గత ఏడాది అక్టోబర్‌లో "ఇండియా గాట్ లాటెంట్"షోలో పాల్గొన్నారు. ఆ షోలో కో-జడ్జి మహీప్ సింగ్, రాఖీ సావంత్ మధ్య వాగ్వాదం చాలా తీవ్ర స్థాయిలో చోటుచేసుకుంది. ఓ దశలో రాఖీ సావంత్ వేదికపై ఉన్న కుర్చీని విరిసికొట్టారు. ఢిల్లీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన ఫుట్‌జే ఆన్‌లైన్‌లో రావడంతో ఒక్కసారిగా వైరల్ అయింది. మహీప్ సింగ్ కొన్ని "కుళ్లు జోకులు" వేయడం, రాఖీ పదేపదే అడ్డుపడటంతో షో రసాభాసగా మారింది. ఇది తీవ్రస్థాయికి చేరుకోవడంతో షో పూర్తికాకుండానే అర్థాంతరంగా ముగిసిపోయింది. కాగా, ఇటీవల జరిగిన 'ఇండియాస్ గాట్ లాటెండ్'షోలో రణ్‌వీర్ అలహాబాదియా ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారంపైన ప్రశ్నించి వివాదంలో చిక్కుకున్నారు. దీనిపై ముంబై పోలీసులుకు ఫిర్యాదులు వెల్లువతెత్తాయి. మహారాష్ట్ర మహిళా కమిషన్ సైతం మండిపపడింది. దీంతో ఇటు ముంబైతో పాటు అసోం పోలీసులు సైతం రణవీర్‌పై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. తన వ్యాఖ్యలకు రణ్‌వీర్ క్షమాపణలు చెప్పినప్పటికీ దుమారం తగ్గలేదు. పలు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడంతో ఆయన నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు ప్రాణభయం ఉందని, వివిధ చోట్ల నమోదైన ఎఫ్ఆర్‌లను ఒకేచోట చేర్చి విచారించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. మీరు మాట్లాడిన మాటలు వ్యక్తిగత స్వేచ్ఛ పరిధిలోకి వస్తుందా? బుర్రలేని కుళ్లును బయటపెట్టారంటూ తీవ్రంగా మందలించిన అత్యున్నత న్యాయస్థానం ఆయనను విదేశాలకు వెళ్లరాదని, పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ రణ్‌వీర్, ఆయన అసోసియేట్లు యూట్యూబ్‌లో కానీ, ఇతర వేదికలపై కానీ ఎలాంటి షోలు ప్రసారం చేయరాదని ఆంక్షలు విధించింది. కాగా. లాటెండ్ షోతో సంబంధం ఉన్న పలువురి స్టేట్‌మెంట్లను మహారాష్ట్ర పోలీసులు ఇప్పటికే రికార్డు చేశారు.

## జమ్మూకశ్మీర్‌పై ఎర్డోగాన్ వ్యాఖ్యలు అనుచితం.. భారత్ తీవ్ర అభ్యంతరం



**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్మూకశ్మీర్‌కు సంబంధించి పాకిస్థాన్ పర్యటనలో తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఎర్డోగాన్ వ్యాఖ్యలు అనుచితమని, ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌దీప్ జైశ్వాల్ అన్నారు. వారంవారం జరిపే మీడియా సమావేశంలో జైశ్వాల్ శుక్రవారంనాడు మాట్లాడుతూ, ఎర్డోగాన్ వ్యాఖ్యలపై టర్కీ అంబాసిడర్‌కు భారత్ తీవ్ర నిరసన తెలియజేసిందని చెప్పారు. భారతదేశ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారానికి సంబంధించి ఎర్డోగాన్ వ్యాఖ్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, భారత్‌కు వ్యతిరేకంగా చొరబాట్లు, సరిహద్దు ఉగ్రవాదాన్ని పాక్ ప్రేరేపిస్తోందని, పాక్ ప్రేరేపిత ఉగ్రవాద విధానమే జమ్మూకశ్మీర్‌కు అసలైన ముప్పని అన్నారు.

**ఎర్డోగాన్ ఏమన్నారు?**

పాక్‌లో రెండ్రోజుల అధికార పర్యటనలో భాగంగా ఎర్డెగోన్ కశ్మీర్ అంశంపై మాట్లాదారు. కశ్మీర్ సమస్యను ఇండియా, పాకిస్థాన్ చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ఐక్యరాజ్యసమితి తీర్మానానికి అనుగుణంగా ఉభయదేశాలు చర్చించుకోవాలన్నారు. కశ్మీర్ సోదరులకు తాము సంఘీభావం తెలుపుతున్నట్టు ఆయన ప్రకటించారు.

**జమ్మూకశ్మీర్‌పై భారత్ వైఖరి ఏమిటి?**

కేంద్ర పాలత ప్రాంతాలైన జమ్ము, కశ్మీర్, లద్దాఖ్‌లు భారతదేశంలో అంతర్భాగమని భారత్ పదేపదే స్పష్టం చేస్తోంది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను 2019 ఆగస్టు 5న రద్దు చేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. తిరిగి రాష్ట్ర హోదా కల్పించే దిశగా ఇటీవల జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు సైతం నిర్వహించింది. ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

## కృష్ణబిలాల రహస్యాల శోధనలో మరో ముందడుగు

**తెనాలి-నవభూమి:** అంతరిక్షంలో కృష్ణబిలాలకు ఆతిథ్యమిచ్చే మరగుజ్జు గెలాక్సీల అతిపెద్ద నమూనాను భారత్‌కు చెందిన పరిశోధకురాలు పుచ్చా రాగదీపిక గుర్తించారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రాగదీపిక అమెరికాలోని యూటా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈ నెల 19న ఆమె పరిశోధన వివరాలు ఆస్ట్రో ఫిజికల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. క్రియాశీల కృష్ణబిలాన్ని కలిగి ఉన్న ఇంటర్మీడియట్ మాస్ కృష్ణబిలం, మరుగుజ్జు గెలాక్సీల పెద్ద నమూనాలను రాగదీపిక నేతృత్వంలోని పరిశోధకుల బృందం గుర్తించింది. గెలాక్సీలో లోతైన అధ్యయనం చేసేందుకు ఆమె పరిశోధన దోహదపడనుంది. దీపిక నేతృత్వంలోని బృందం నాలుగు లక్షల గెలాక్సీల డేటాను పరిశీలించింది. పాలపుంతలో భారీ గెలాక్సీలు, వాటిలో బ్లాక్‌హోల్స్‌ను కనుగొనడం సవాల్‌గా ఉంది. వీటిపై మరింత అ?ధ్యయనం చేసేందుకు తన పరిశోధన దారి చూపింది. దీపిక తల్లిదండ్రులు రాజగోపాల్, కనకదుర్గ తెనాలిలోని రామలింగేశ్వరపేటలో నివాసం ఉంటున్నారు. రాజగోపాల్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి రిటైరయ్యారు.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్
శనివారం
22 । ఫిబ్రవరి । 2025



## ధనుష్ దర్శకుడు.. మేనల్లుడు హీరో .. సినిమా ఎలా ఉందంటే

నటీనటులు: పవీష్ నారాయణ్, అనికా సురేంద్రన్, ప్రియా ప్రకాశ్ వారియర్, మాథ్యూ థోమస్, వెంకటేశ్ మీనన్, రబియా ఖాటూన్, రమ్యా రంగనాథన్, ఆడుకాలమ్ నరేన్, శరణ్య, ఆర్ శరత్‌కుమార్, ప్రియాంక మోహన్ తదితరులు.
సాంకేతిక నిపుణులు
కెమెరా: లియోన్ బ్రిటో
సంగీతం:జీవీ ప్రకాశ్‌కుమార్
ఎడిటింగ్: ప్రసన్న జీకే
నిర్మాతలు: ధనుష్‌బీ కస్తూరి రాజా, విజయలక్ష్మీ కస్తూరి
దర్శకత్వం: ధనుష్




తమిళ నటుడు ధనుష్ మల్టీ టాలెంటెడ్ పర్సన్. నటుడిగానే కాకుండా, గాయకుడిగా, దర్శకుడిగా నిరూపించుకున్నారు. గత ఏడాది రాయన్ చిత్రానికి దర్శకత్వం వహించి సూపర్‌హిట్ అందుకున్నారు. తాజాగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'జాబిలమ్మ నీకు అంత కోపమా'. ఆయన మేనల్లుడు పవిష్ నారాయణ్‌ను హీరోగా పరిచయం చేస్తూ ఆయన చేసిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన పాటలు నెట్టింట హల్‌చల్ చేశాయి. ట్రైలర్‌లో 'జాలీగా రండి.. జాలీగా వెళ్లండి' అని ధనుష్ చెప్పిన డైలాగ్ సినిమాపై మరింత ఆసక్తి పెంచింది. మరీ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంది ..



# హీరోయిన్‌కి ప్రియుడు కావలెనట..!



పదేళ్ల క్రితం రన్ రాజా రన్ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ సీరత్ కపూర్. బాలీవుడ్‌కి చెందిన ఈ అమ్మడు టాలీవుడ్‌లో మొదట్లో వరుసగా సినిమాల్లో నటించింది. కపూర్ బ్యూటీ అనే ట్యాగ్‌తో టాలీవుడ్‌లో మంచి ఆఫర్లు దక్కించుకుంది. కానీ ఆమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేక పోవడంతో ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. సోషల్ మీడియాలో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా రెగ్యులర్‌గా వార్తల్లో నిలిచే సీరత్ కపూర్ అడపా దడపా సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంటూనే ఉంది. తాజాగా ఈ అమ్మడు హైదరాబాద్‌లో సందడి చేసింది. కరోనా సమయంలో నేరుగా ఓటీటీలో వచ్చిన 'కృష్ణ అండ్ హీజ్ లీల' సినిమాను థియేట్రికల్ రిలీజ్‌కి ప్లాన్ చేశారు. త్వరలో 'ఇట్స్ కాంప్లికేటెడ్' అనే టైటిల్‌తో థియేటర్‌ల ద్వారా రాబోతున్న సినిమా ప్రమోషన్ కోసం సీరత్ కపూర్ మీడియా ముందుకు వచ్చింది. సిద్దు జొన్నలగడ్డకు జోడీగా సీరత్ కపూర్ ఆ సినిమాలో నటించిన విషయం తెల్సిందే. సినిమాను థియేటర్‌లో చూడటం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని సీరత్ కపూర్ చెప్పుకొచ్చింది. అదే సమయంలో మీడియా వారు.. ఈ వాలెంటైన్స్ డే ప్లాన్ ఏంటి అని ప్రశ్నించిన సమయంలో సరదా సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. వాలంటైన్స్ డే ప్లాన్స్ ఏం లేవని, ప్రస్తుతం తాను సింగిల్‌గా ఉన్నాను. మింగిల్ కావడానికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పుకొచ్చింది. వాలంటైన్స్ డే రోజు ఎవరైనా రోజా ఫ్లవర్ ఇస్తే తీసుకోవడానికి రెడీ అన్నట్లు చెప్పుకొచ్చింది. సింగిల్‌గా ఉన్న సీరత్ కపూర్ వచ్చే వాలంటైన్స్ డే వరకు అయినా మింగిల్ కావాలని కోరుకుంటున్నాం అంటూ సోషల్ మీడియా ద్వారా చాలా మంది ఆమె అభిమానులతో పాటు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. హీరోయిన్స్ లో ఎక్కువ శాతం మంది సింగిల్‌గా ఉండరు. రహస్య ప్రేమాయణం సాగిస్తూ ఉంటారు. కానీ సీరత్ కపూర్ మాత్రం సింగిల్ అని క్లీయర్‌గా చెప్పేసింది. సినిమా ఇండస్ట్రీలో మొదట అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా కెరీర్‌ను ప్రారంభించింది. నటిగా, మోడల్‌గా, డాన్సర్‌గా ఎన్నో రకాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న సీరత్ కపూర్ బాంద్రాలోని నేషనల్ కాలేజీలో ప్రీ యూనివర్శిటీ కోర్సును పూర్తి చేసింది. మాస్ కమ్యూనికేషన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని అనుకుంది. కానీ నటనలో బిజీ కావడంతో డిగ్రీని మధ్యలోనే వదిలేసింది. ఎప్పటికైనా తన డిగ్రీని పూర్తి చేయాలని కోరుకుంటున్నాను అంటూ గతంలో ఒక ఇంటర్వ్యూలో సీరత్ కపూర్ చెప్పుకొచ్చింది. 16 ఏళ్ల వయసులో బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ఆష్లే లోబో, ది డాన్స్ వర్క్స్ వద్ద డాన్సర్‌గా జాయిన్ అయ్యింది. కపూర్ డాన్స్ అకాడమీలోనూ ట్రైనర్‌గా సీరత్ కపూర్ కొన్నాళ్లు చేసింది. రాక్ స్టార్ సినిమాకు అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేయడంతో సీతర్ కపూర్ దశ తిరిగింది.



# టాలీవుడ్‌లో ఈ ముద్దుగుమ్మలు కనిపించరా?

ఎక్కడ అయినా కొత్త నీరు వస్తుంటే పాత నీరు అనేది వెళ్లి పోతుంది. సినిమా ఇండస్ట్రీలోనూ అదే జరుగుతుంది. దాదాపు వందేళ్లుగా ఎంతో మంది కొత్త వాళ్లు ఎంట్రీ ఇవ్వడం, అదే స్థాయిలో పాత వారు కనుమరుగు కావడం మనం చూస్తూ వస్తున్నాం. కొద్ది మంది మాత్రమే ఇండస్ట్రీలో అలా పాతుకు పోతూ ఉంటారు. కొద్ది మంది హీరోలు నాలుగు అయిదు దశాబ్దాలు అయినా ఇండస్ట్రీలో కొనసాగుతూ వస్తున్నారు. కొందరు హీరోయిన్స్ సైతం అప్పట్లో హీరోయిన్స్‌గా నటించి, ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటిస్తున్నారు. కొన్నాళ్ల తర్వాత వారు కూడా కనుమరుగు కానున్నారు. అయితే కొద్ది మంది హీరోయిన్స్ మాత్రం ఉన్నట్లుండి కనుమరుగు అవుతున్నారు. వరల్డ్ బెస్ట్ స్టార్లతో సందడే సందడి టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్స్‌గా మొన్నటి వరకు వెలుగు వెలిగిన పలువురు హీరోయిన్స్ ఇకపై కనిపించే అవకాశాలు లేవని, ఒకవేళ చేసినా చిన్నా చితక సినిమాల్లో మాత్రమే వారు కనిపించే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా సమంత ఈ జాబితాలో ముందు వరుసలో ఉంటుంది. టాలీవుడ్‌లో ఈ అమ్మడు సుదీర్ఘ కాలం పాటు టాప్ స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. ఈమధ్య కాలంలో బాలీవుడ్‌లో వరుసగా వెబ్ సిరీస్‌లు, సినిమాలు చేస్తున్న కారణంగా తెలుగులో సినిమాలు చేయడం లేదు. ఒకటి రెండు సినిమా ఆఫర్లు వచ్చినా సమంత వాటిని సున్నితంగా తిరస్కరించిందట. ముందు ముందు సైతం టాలీవుడ్‌లో ఆమె నటించే అవకాశాలు కనిపించడం లేదు. పెళ్లి చేసుకుని తల్లి అయిన తర్వాత కూడా కాజల్ అగర్వాల్ టాలీవుడ్‌లో సినిమాలు చేయాలని ఆశ పడింది. కానీ కాజల్‌కి టాలీవుడ్‌లో ఆఫర్లు పెద్దగా రావడం లేదు. ఒకటి రెండు సినిమాల్లో నటించిన పెద్దగా అవి వర్కౌట్ కావడం లేదు. సినిమా ఇండస్ట్రీ నుంచి ఆమె మెల్ల మెల్లగా దూరం జరుగుతుందని తెలుస్తోంది. చిన్నా చితకా ఆఫర్లు వస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదని తన ఇమేజ్‌కి తగ్గట్లు ఆఫర్లు వస్తేనే నటించేందుకు ఆసక్తిని కనబర్చుతుంది. కనుక కాజల్ అగర్వాల్‌కి టాలీవుడ్‌లో కాలం చెల్లినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. యూనివర్శిల్ స్టార్ కమల్ హాసన్ నట వారసురాలు శృతి హాసన్ సైతం టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేయడం లేదు. ఆమెకు యంగ్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు రావడం లేదు, సీనియర్ హీరోల సినిమాల్లో ఆమె నటించేందుకు ఆఫర్లు దక్కించుకోవడం లేదు. అందుకే శృతి హాసన్ రాబోయే రోజుల్లో టాలీవుడ్ నుంచి కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయి. వీరు మాత్రమే కాకుండా పలువురు హీరోయిన్స్ సైతం టాలీవుడ్ నుంచి దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఉప్పెన సినిమాతో కృతి శెట్టి టాలీవుడ్‌లో అడుగు పెట్టి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకుంది. కానీ అంతలోనే ఈ అమ్మడికి ఆఫర్లు తగ్గాయి. ప్రస్తుతం ఈమె చేతిలో సినిమాలు ఏమీ లేవు. కీర్తి సురేష్‌కి తెలుగులో పెద్దగా ఆఫర్లు రావడం లేదు. ఈమె సైతం మెల్ల మెల్లగా టాలీవుడ్‌కి దూరం అయ్యేలా ఉంది. పూజా హెగ్డే సైతం కొన్ని సంవత్సరాల పాటు టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా నిలిచింది. కానీ టాలీవుడ్‌లో ఈమె పరిస్థితి బాగాలేదు. ఈమెకు టాలీవుడ్‌లో ఆఫర్లు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే రకుల్, తమన్నా, రెజీనా ఇంకా ఇతర హీరోయిన్స్ సైతం ఇండస్ట్రీకి దూరం అవుతున్నారు.

## 'దేవుడు మంచి కోసం ఇవన్నీ చేస్తాడు'.. విడాకుల తర్వాత ధనశ్రీ పోస్ట్



టీమిండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ నుండి విడాకులు తీసుకున్నట్లు వార్తలు వచ్చిన కొన్ని గంటలకు ధనశ్రీ వర్మ ఇన్‌స్టాలో ఒక క్రిప్టిక్ పోస్ట్ తో తన మనసులోని మాటను వెల్లడించారు. ఒత్తిడి నుంచి విముక్తితో ధన్యుల వరకూ.. అనే క్యాప్షన్ తో ధనశ్రీ ఒక నోట్ రాసారు. "దేవుడు మన బాధలు పరీక్షలను చివరికి ఆశీర్వాదాలుగా ఎలా మార్చగలడో ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ రోజు దేని గురించి అయినా ఒత్తిడికి గురైతే మీకు మరో అవకాశం ఉందని తెలుసుకోండి. మీరు చింతిస్తూ ఉండవచ్చు.. కానీ అన్నింటినీ దేవుడిపై భారం మోపి ప్రార్థించండి. దేవుడు మీ మంచి కోసం ఇవన్నీ చేస్తాడని నమ్మడం శక్తినిస్తుంది" అని రాసారు. ఆంగ్ల మీడియా కథనాల ప్రకారం..ఈ జంట విడాకులపై తుది విచారణ గురువారం (ఫిబ్రవరి 20) నాడు బాంద్రా ఫ్యామిలీ కోర్టులో జరిగింది. విడాకుల విచారణకు సంబంధించిన ప్రక్రియ గురువారం ఉదయం 11:00 గంటలకు మొదలైంది. సాయంత్రానికి న్యాయమూర్తి విడాకుల మంజూరును ఖరారు చేసారని కథనాలొచ్చాయి. కౌన్సెలింగ్ సెషన్‌కు హాజరు కావాలని కోర్టు ఆదేశించినప్పుడు చాహల్- ధనశ్రీ ఇద్దరూ హాజరయ్యారు. 45 నిమిషాల కౌన్సెలింగ్ సెషన్ తర్వాత ఇద్దరూ పరస్పర అంగీకారంతో విడిపోవడానికి పట్టుదలగా నిలబడటంతో జడ్జి తుది తీర్పును వెలువరించారు. భార్యాభర్తలు తప్పనిసరి అని పట్టుబడితే విడాకులు మంజూరు చేసేందుకు ఇప్పుడు చట్టంలో వెసులుబాటును ఈ జంట ఉపయోగించుకుంది. యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ ఇద్దరూ గతంలో తమపై పుకార్లు ప్రచార చేయవద్దని కోరారు. నిరాధార వార్తలు ప్రచురించవద్దని కోరిన దాదాపు ఒక నెల తర్వాత విడాకులు వచ్చాయి. ఎట్టకేలకు కొన్ని నెలల పాటు సాగిన విడాకుల డ్రామాకు కోర్టు ముగింపు పలికిందని ఆంగ్ల మీడియాలు ధృవీకరించాయి. ధనశ్రీ తన ఇన్‌స్టాగ్రామ్ పేరు నుండి 'చాహల్'ను తొలగించిన తర్వాత మొదటిసారి ఈ జంట విడాకుల గురించి ఊహాగానాలు చెలరేగాయి. యుజ్వేంద్ర చాహల్ "న్యూ లైఫ్ లోడింగ్' అని వ్యాఖ్యానిస్తూ ఒక క్రిప్టిక్ పోస్ట్ చేసిన తర్వాత ధనశ్రీ వర్మ క్రిప్టిక్ పోస్ట్ వైరల్ అయింది. 11 డిసెంబర్ 2020న గురుగ్రామ్‌లో కొద్దిమంది బంధుమిత్రుల సమక్షంలో ధనశ్రీ వర్మను వివాహం చేసుకున్నారు. ఈ జంట డ్యాన్స్ క్లాసుల్లో కలుసుకున్నప్పుడు ప్రేమ వికసించింది. కానీ నాలుగేళ్లలో సంసారంలో కలతలతో విడిపోయారు.

# అల్లు అర్జున్ ఛాయిస్‌పై డౌట్ పడుతున్నారెందుకు..?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప 2 తర్వాత త్రివిక్రమ్ డైరెక్షన్ లో సినిమా చేస్తాడని అనుకోగా ఆ ప్రాజెక్ట్ కి కాస్త టైం పట్టేలా ఉందని నెక్స్ట్ మూవీకి ఓకే చెప్పేశాడు అల్లు అర్జున్. సౌత్ స్టార్ డైరెక్టర్ అట్లీతో సినిమా ఫిక్స్ చేసుకున్నాడు. జవాన్ తో షారుఖ్ తో సెన్సేషనల్ హిత్ అందుకున్న అట్లీ నెక్స్ట్ సినిమా విషయంలో చాలా పెద్ద ప్లానింగ్ తోనే ఉన్నాడు. అసలైతే బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ తో సినిమా చేయాలని అనుకోగా అది ఎందుకో ఆగిపోయింది. వరల్డ్ బెస్ట్ స్టార్లతో సందడే సందడి అల్లు అర్జున్ అట్లీ మూవీ త్వరలోనే అనౌన్స్‌మెంట్ రాబోతుంది. ఈ సినిమాను భారీ రేంజ్ లో తెరకెక్కించే ప్లానింగ్ లో ఉన్నారు. ముఖ్యంగా పుష్ప తో ఎలాగైతే నేషనల్ లెవెల్ ఆడియన్స్ ని మెప్పించాడు కాబట్టి రాబోతున్న సినిమా కూడా అదే రేంజ్ అంచనాలు ఉంటాయి. ఇంకా చెప్పాలంటే దానికి మించి అంచనాలు ఉంటాయి. ఐతే అల్లు అర్జున్ అట్లీ సినిమా కు తమిళ యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ తో మ్యూజిక్ డైరెక్షన్ చేయించే ప్లానింగ్ లో ఉన్నారు. ! అట్లీ తన ప్రతి సినిమాకు ఏ.ఆర్.రెహమాన్ తో మ్యూజిక్ కంపోజ్ చేయిస్తాడు. ఐతే ఈసారి కొత్తగా యువ సంగీత దర్శకుడికి ఛాన్స్ ఇస్తున్నాడని టాక్. ఐతే సాయి అభ్యంకర్ తమిళ్ లో ఫోక్ సాంగ్స్ కంపోజ్ చేస్తూ వస్తున్నాడు. మరి అట్లీ అతన్ని ఈ సినిమాకు ఎందుకు సెలెక్ట్ చేశాడో తెలియదు కానీ ఫ్యాన్స్ మాత్రం అతని ఎంపిక రాంగ్ ఛాయిస్ అంటున్నారు. సాయి అభ్యంకర్ మాత్రం తనకు వచ్చిన ఈ ఛాన్స్ ని అన్ని విధాలుగా పర్ఫెక్ట్ గా యూజ్ చేసుకోవాలని చూస్తున్నాడు. అట్లీ అల్లు అర్జున్ కాంబో లో స్టైలిష్ యాక్షన్ సినిమా ఉంటుందని తెలుస్తుంది. ఈ సినిమా విషయంలో మేకర్స్ ప్లానింగ్ కూడా నెక్స్ట్ లెవెల్ లో ఉంటుందని తెలుస్తుంది. మ్యూజిక్ డైరెక్టర్ విషయంలో మేకర్స్ ప్లాన్ ఏంటో తెలియదు కానీ అదొక్కటి పక్కన పెడితే ఈ సినిమా పై అంచనాలు మాత్రం భారీగా ఉన్నాయి. మరి పుష్ప తర్వాత అల్లు అర్జున్ చేస్తున్న ఈ సినిమా ఏమేరకు ఇంపాక్ట్ కలిగేలా చేస్తుందో చూడాలి.






## మ్యాచ్‌కు ముందే పాక్‌కు షాక్.. మనోళ్లు కొడితే ఇట్లుంటది



**న్యూఢిల్లీ-నవభూమి:** పాకిస్థాన్‌ను భారత్ నిద్రపోనివ్వడం లేదు. చాంపియన్స్ ట్రోఫీ విషయంలో మొదలైన గొడవ టోర్నమెంట్ స్టార్ట్ అయినా ఇంకా కంటిన్యూ అవుతోంది. 29 ఏళ్ల తర్వాత ఒక ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నీకి ఆతిథ్యం ఇచ్చే అవకాశం వచ్చిందని గంతులేసిన పాక్ క్రికెట్ బోర్డు.. భారత్‌తో కయ్యానికి దిగి లేనిపోని సమస్యలు తెచ్చుకుంది. భద్రతా కారణాలు రీత్యా ఆ దేశానికి టీమిండియాను పంపేందుకు బీసీసీఐ నిరాకరించడంతో ఈ వివాదం పీక్స్‌కు చేరుకుంది. రోహిత్ సేన ఎలాగైనా పాక్‌కు రావాల్సిందేనని పీసీబీ పట్టుబట్టినా ఐసీసీలో జైషా రాకతో వాళ్లకు నిరాశ తప్పలేదు. భారత మ్యాచులు దుబాయ్‌కు తరలించింది ఐసీసీ. అయితే ఇక్కడితో అంతా సమసిపోలేదు. తాజాగా మరో కాంట్రవర్సీ మొదలైంది. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్-పాకిస్థాన్ మధ్య దుబాయ్ వేదికగా ఆదివారం మ్యాచ్ జరగనుంది. సెమీస్ వెళ్లాలంటే రెండు జట్లకు ఈ పోరు చాలా కీలకంగా మారింది. పాక్‌కు ఇది చావోరేవో మ్యాచ్. ఓడితే ఆ టీమ్ ఇంటిదారి పట్టాల్సిందే. అందుకే ఎలాగైనా రోహిత్ సేనను ఓడించి తీరాలని దాయాది భావిస్తోంది. అయితే న్యూజిలాండ్ చేతుల్లో చిత్తుగా ఓడటం, ఫఖర్ జమాన్ లాంటి క్వాలిటీ బ్యాటర్ గాయంతో దూరమవడం, ఉన్న ఆటగాళ్లు సరిగ్గా ఆడకపోవడంతో ఆ టీమ్ తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. ఈ తరుణంలో భారత్ నుంచి ఆ జట్టుకు గట్టి షాకులు తగులుతున్నాయి. పుండు మీద కారం చల్లినట్లు పాక్‌ను ఇన్‌డైరెక్ట్‌గా రెచ్చగొడుతోంది భారత్. బంగ్లాదేశ్ మ్యాచే దీనికి ఉదాహరణ అని చెబుతున్నారు.

## నిద్రపోతున్న సింహాన్ని లేపుతున్న రోహిత్.. పాక్‌కు ఇక కాళరాత్రే



**న్యూఢిల్లీ-నవభూమి:** చాంపియన్స్ ట్రోఫీ-2025 ప్రయాణాన్ని ఊహించిన విధంగా ఎ ౕ ం న ం గా ఆరంభించింది భారత్. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టీమిండియా.. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 6 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ రోహిత్ సేన అదరగొట్టింది. కొన్ని పొరపాట్లు చేసినా ఓవరాల్‌గా టీమ్ పెర్ఫార్మెన్స్ అదిరిందనే చెప్పాలి. సెమీఫైనల్స్‌లో బెర్త్ కోసం చూస్తున్న మెన్ ఇన్ బ్లూ.. రెండో పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. దుబాయ్ వేదికగా ఈ టీమ్స్ మధ్య సండే ఫైట్ జరగనుంది. ఇందులో గెలిస్తే నేరుగా సెమీస్ వెళ్లే చాన్స్ ఉండటంతో మ్యాచ్‌ను మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాడు సారథి రోహిత్.సరిహద్దులతో పాటు క్రికెట్‌లోనూ పాకిస్థాన్‌తో ఉన్న వైరం, దీనికి తోడు సెమీస్ వెళ్లేందుకు కీలక మ్యాచ్ కావడంతో రేపటి పోరులో నెగ్గి తీరాలని రోహిత్ శర్మ డిసైడ్ అయ్యాడు. అందుకే నిద్రపోతున్న స్పిన్ సింహాన్ని లేపుతున్నాడట. ఆకలి మీద ఉన్న అతడ్ని దాయాది జట్టుపై ఉసిగొల్పేందుకు సిద్ధమవుతున్నాడట. తొలి మ్యాచ్‌లో ఆడకుండా దాచిన ఆ యోధుడ్ని ఇప్పుడు పాక్ పైకి దండయాత్రకు దింపుతున్నాడట.

## అమన్ అదుర్స్



**బెంగళూరు-నవభూమి:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తాజా సీజన్‌లో వరుస విజయాలతో జోరుమీదున్న డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు సొంత మైదానంలో చుక్కెదురైంది. శుక్రవారం చివరి బంతి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ నాలుగు వికెట్లతో బెంగళూరును ఓడించింది. పొదుపైన బౌలింగ్‌తో మూడు వికెట్లు (3/22) తీయడంతోపాటు బ్యాటింగ్‌లోనూ (27 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34 నాటౌట్) సత్తా చాటిన అమన్‌జోత్ కౌర్ ముంబై విజయంలో కీలక భూమిక పోషించింది. తొలుత బెంగళూరు 20 ఓవర్లలో 167/7 స్కోరు చేసింది. ఎలిస్ పెర్రీ (43 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 81), రిచా ఘోష్ (25 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 28), మంధాన (13 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 26) రాణించారు. ఛేదనలో ముంబై 19.5 ఓవర్లలో 170/6 స్కోరు చేసి విజయం అందుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (38 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 50), బ్రంట్ (21 బంతుల్లో 9 ఫోర్లతో 42) సత్తా చాటారు. అమన్ జోత్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**